జులై
2018

147

సంపుటి : 13 సంచిక : 3 వెల రు. 10/-

## ఈ సంచికలో........

పోరాటాలద్వారానే మతోన్మాదాన్ని ఓడించగలం
న్యాయవ్యవస్థపై పెత్తనానికి కేంద్రం కుట్ర
సావార్కర్ 'వీరత్వం'
అనాగరికత, క్రూరత్వంవైపు తిరోగమనం
తూత్తుకుడిలో ఏం జరిగింది?
ప్రమాదాలు పెరుగుతున్నాయి
శ్రామికవర్గ మేధావి అశోక్ మిత్రా
వామపక్షాల ఐక్య కార్యచరణ అవసరం
బహుముఖ ప్రజ్ఞాశాలి జక్కా వెంకయ్య


**నివాళి**

# బహుముఖ ప్రజ్ఞాశాలి జక్కా వెంకయ్య

**ఉన్నం వెంకటేశ్వర్లు**

**'జక్కా ఎంకన్న యాడికి పోయిండు? ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని ఉన్నాడు. ఆయనిచ్చిన ఎర్రజెండా అందరిచేతుల్లో ఉంది. ఆయన అందరిలో బతికున్నాడు.' ఆయన చనిపోయినపుడు బాధతో జ్వలించే వాళ్ళను ఎదుటివాళ్ళు ఓదార్చుతున్న తీరిది. ఉద్యమంలో అమర వీరుల ఎదుట జక్కా వెంకయ్య స్పందించిన తీరునూ ఒకసారి గుర్తుచేసుకుందాం...**

"మామూలు మనుషుల్లో నుంచి తయారైన ఒక నాయకుణ్ణి మన ఉద్యమం కోల్పోయింది. కాదు.. ఈ ఊరి భూస్వాములే ఆయన్ని బలిగొన్నారని అనడం నిజమైన మాట. ఇందుకు మనం బదులు తీర్చుకోవాలంటే ఇంతకన్నా బలమైన ఉద్యమాన్ని నిర్మించాలి. ఏ భూస్వామి అయినా మనకు ఎదురుపడటానికి భయపడేంతటి బలం కలిగిన ఉద్యమాన్ని పెంపొందించాలి" అంటూ అమర వీరుల పార్థివ దేహం ముందు ఎర్రటి జీరెక్కిన కళ్ళతో కోపాన్నీ, బాధనూ అణుచు కుంటూ మాట్లాడేవారు. అంతలోనే ఆస్వరం తేరుకునేది. "నాకు నమ్మకం ఉంది. మీలో చాలామంది కోల్పోయిన నాయకుని స్థాయికి ఎదుగుతారు. కానీ.. ఆ కుటుంబానికి ఆయన లేని లోటును తీర్చలేం. ఆయన పిల్లలకు తండ్రినివ్వలేం. ఆయన భార్యకు భర్తలేని లోటు పూడ్చలేం" అంటూ కళ్ళు చెమర్చేవారు. వెన్వెంటనే తేరుకుని మనం చేయగలిగింది ఒకటుంది. 'ఆర్థికంగా ఆ కుటుంబానికి ఆయన లేని లోటు కనపడనీయకూడదు. ఆయన ఎవరికోసం పని చేశారో తన ప్రాణాన్ని బలిదానం చేశారో.. వారందరూ ఇందుకు పూనుకోవాలి. పార్టీ శాఖ ముందుండి ఈ భారాన్ని మోయాలి" అని చెప్పడంతో ఆగేవారు కాదు. ఆ కర్తవ్యం పూర్తి చేసేవరకూ తానూ ఒక సైనికుడై నిలిచేవారు. పోరాటాల్లో ప్రాణాలొదిలిన అమరవీరుల కుటుంబాల పట్ల పార్టీ నుంచి ఆయన నేర్చుకున్న నిబద్ధత ఇది. నేర్పిన త్యాగనిరతి ఇది. భూ పోరాటంలో ఎల్లాయపాలెం, సోమరాజుపల్లి కాల్పుల్లో చనిపోయిన, అవయవాలు కోల్పోయిన వారి కుటుంబాలనూ, దామరమడుగు అంకులయ్య కుటుంబం మొదలు జిల్లా ఉద్యమంలో అశువులుబాసిన అన్ని కుటుంబాల విషయంలోనూ ఇలాంటి బాధ్యతనే పార్టీ మోసేలా ప్రోత్సహించారు. చివరకు అఖిలపక్ష రైతాంగ ఉద్యమం సందర్భంగా కావలిలో పోలీసు కాల్పుల్లో మరణించిన గౌరవరం రైతు చింతం శేషారెడ్డి (పార్టీ కాదు) విషయంలో కూడా అఖిల పక్షాల బాధ్యత ఎలా ఉన్నా చేసిన వాగ్దానం ప్రకారం ఆ కుటుంబం పేరిట పార్టీ కొంత మొత్తాన్ని డిపాజిట్ చేసింది.



చాలా యేళ్ళ తర్వాత డిగ్రీ పూర్తిచేసుకున్న ఒక యువతి నెల్లూరు పార్టీ ఆఫీసుకు వచ్చింది. జక్కా వెంకయ్యను కలిసింది. "మా ఊళ్ళో రోడ్డు వెడల్పులో భాగంగా చింతం శేషారెడ్డి విగ్రహాన్ని కూలుస్తుంటే ఏ ఒక్కరూ, ఏ ఒక్క పార్టీ పట్టించుకోలేదు. (ఆ ఊరిలో సిపిఎం శాఖ లేదు) నేనే నా తోటి యువతులను కలుపుకొని మరోచోట దాన్ని ప్రతిష్టించాలంటూ సంతకాలు సేకరించాను. సిపిఎంగా ప్రకటించుకొని ఈ పని చేశాను. కలెక్టరును కలవడానికి మీ సహకారం కావాలి" అంది. "ఇంతకూ నీవు ఎవరమ్మా?" అని జక్కా అడిగారు. "చింతం శేషారెడ్డి కూతుర్ని. మా నాన్న తరపున మీ పార్టీ డిపాజిట్ చేసిన సొమ్ముతో చదువుకున్నదాన్ని. ఆ స్ఫూర్తితోనే ఈ పని చేశాను" అంది. కమ్యూనిస్టు ఉద్యమం తీర్చిదిద్దిన జక్కా వెంకయ్య పార్టీ శ్రేణులపైనా, అభిమానులపైనా చూపిన ప్రభావానికి నిదర్శనం ఇది. అందుకే జక్కా వెంకయ్య శ్రమ జీవుల నోళ్ళలో 'వెంకన్న' అయ్యాడు. పార్టీ శ్రేణుల్లో 'జెవి'అయ్యారు. ఈ రెండూ ఆయన్ను ఆప్యాయంగా పిలుచుకునే పదాలే.

ఈ స్ఫూర్తి పార్టీ శ్రేణుల్లోనూ, కార్యకర్తల్లోనే కాదు. స్వయంగా తన కుంటుంబ సభ్యుల్లోనూ నింపారు. ఆయన కుమారుడు అశోక్‌ను పూర్తికాలం కార్యకర్తగా ప్రోత్సహించారు. ఆయన ఇంటిని పార్టీ కోసం వచ్చే వారికి ఆత్మీయ కేంద్రంగా మార్చారు. ఆయన చనిపోయిన రోజు అనేక మంది ఏడుస్తూ జెవి జీవిత సహచరి పార్వతమ్మకు ఎదురుపడ్డారు. పార్వతమ్మ ఏమాత్రం కళ్ళు చెమర్చలేదు. పైగా "ఎందుకే ఏడుస్తారు? ఆయన ఏడ్చే పార్టీని నిర్మించారా? కాదు, పోరాడే పార్టీని నిర్మించారు. ఆ పద్ధతిలోనే ఆయనకు వీడ్కోలు చెబుదాం రండి. లేవండి" అంటూ తోటి మహిళలను అంతిమ యాత్రకు బయలుదేరదీశారు.

కమ్యూనిస్టుగా సుందరయ్యగారు పాటించిన అనేక లక్షణాలు జెవి జీవితంలో కనిపిస్తాయి. సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడం, దాన్ని ఆచరించడం, సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం, వర్గ సమస్యలను గుర్తించడం, కష్టజీవులకు జరిగే నష్టం ఆధారంగా వర్గ పోరాటాలుగా మార్చడం, ప్రజలతో మెలగడం, ప్రజల మనిషిగా నిలవడం ఆయన ప్రత్యేకత. ధరించే దుస్తులు మొదలు నివసించే జీవన శైలి వరకు కమ్యూనిస్టు తత్వం అడుగడుగునా కనపడేది. "కమ్యూనిస్టు ప్రజల మధ్య పోతపోసిన ఉక్కు మనిషిలా ఉండాలి" అని స్టాలిన్ చెప్పిన మాటలను చాలాసార్లు చెప్పేవారు. బహుశా తనను తాను తీర్చిదిద్దు కోవడంలో ఇదే ప్రేరణ అయి ఉండవచ్చు. రక్త సంబంధం రీత్యా జెవి కుటుంబానికీ, పుచ్చలపల్లి సుందరయ్య, జెట్టి దశరథ రామిరెడ్డి, జెట్టి శేషారెడ్డి కుటుంబాలకూ మధ్య దగ్గర సంబంధం ఉంది. అయినా బంధుత్వ సంబంధాల కన్నా పార్టీ ఆలోచన సరళే వారి మధ్య సాన్నిహిత్యాన్ని పెంచింది. జెవి భూస్వామ్య కుటుంబంలో పుట్టినా శ్రమజీవిగానే ఎదిగారు. వాళ్ళ నాన్న 16వ యేటనే వ్యవసాయంతో సహా కుటుంబ

(మిగతా 32వ పేజీలో)

## ఈ సంచికలో...


1. **బహుముఖ ప్రజ్ఞాశాలి జక్కా వెంకయ్య**

   ఉన్నం వెంకటేశ్వర్లు ................ 2

2. **పోరాటాల ద్వారానే మతోన్మాదాన్ని ఓడించగలం**

   బివి రాఘవులు ..................... 4

3. **న్యాయవ్యవస్థపై పెత్తనానికి కేంద్రం కుట్ర**

   ప్రశాంత్ పద్మనాభన్, వి. వెంకటేశన్ 10

4. **సావర్కర్ 'వీరత్వం'**

   ఏ.జి. సూరాని ..................... 14

5. **అనాగరికత, క్రూరత్వంవైపు తిరోగమనం**

   ఆనంద తెల్‌తుమ్డే ................. 16

6. **తూత్తుకుడిలో ఏం జరిగింది?**

   ఇలంగోవన్ రాజశేఖరన్........... 19

7. **ప్రమాదాలు పెరుగుతున్నాయి**

   పి. దక్షిణామూర్తి .................. 24

8. **శ్రామికవర్గ మేధావి అశోక్ మిత్రా**

   ప్రభాత్ పట్నాయక్ ................. 27

9. **వామపక్షాల ఐక్య కార్యాచరణ అవసరం**

   బివి రాఘవులు .................. 29



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె హరికిషోర్ : 9490098977**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# సాంస్కృతిక రంగంలో పోరాటం

"ఫాసిజానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున జరగాల్సిన ప్రజాపోరాటం ఒక రంగంలో మాత్రం అసలు ప్రారంభం కాలేదు...." అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (ఏడవ) ప్రపంచ మహాసభకు ఇచ్చిన నివేదికలో కామ్రేడ్ జార్జి డిమిత్రోవ్ చెప్పారు.

సాంస్కృతిక రంగంపై పెట్టుబడిదారీ గుత్తాధిపత్యాన్ని బద్దలుగొట్టడానికి కార్మికవర్గం జరపాల్సిన ప్రజాపోరాటం అది. మేధావుల్లో అత్యుత్తములు, నిజాయితీ పరులను తమవైపు ఆకర్షించి, ఇతరులను తటస్థంగా ఉంచేందుకు జరగాల్సిన పోరాటం అది. ఈనాడు మన దేశంలో మతోన్మాదం విజృంభిస్తున్న తరుణంలో కామ్రేడ్ డిమిత్రోవ్ చెప్పిన విషయం మనకూ పూర్తిగా వర్తిస్తుంది.

సైన్సు, విద్య, పత్రికలు, సినిమా, టివి, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, కళలు, సాహిత్యం, వైద్యం, నాటకరంగం...ఇవీ ఇంకా అనేక కార్యకలాపాలను పాలకవర్గాలే నియంత్రిస్తున్నాయి. పెట్టుబడిదారీ సమాజాన్ని కొనసాగించడానికి వీటిని ఉపయోగించుకుంటున్నాయి.

కాని శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, రచయితలు, డాక్టర్లు మొదలైన వారు ధనిక వర్గం కాదు. వారంతా మధ్యతరగతి వారు. నిజానికి వారంతా కార్మికవర్గానికి దగ్గరగా ఉన్నవాళు . యవ్వనంలో వాళ్లలో చాలా మంది పేదరికాన్ని అనుభవించినవారే, చాలా కష్టాలు అనుభవించిన వారే.

పెట్టుబడిదారీ వ్యవస్థలో వచ్చే సంక్షోభం వల్ల ఈ సెక్షన్ల ప్రజలు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నారు....కుళ్లిపోయిన పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ సాంస్కృతికాభివృద్ధికి ఇంకెంతమాత్రం దోహదపడబోదని, పైగా ఈ వ్యవస్థ సంస్కృతిని క్షీణింపజేసి, నాశనం చేస్తుందని ఈ మేధావుల్లో చైతన్యవంతులు తెలుసుకుంటున్నారు. వినిమయ సంస్కృతి సృష్టిస్తున్న విధ్వంసాన్ని చూస్తున్నారు. భారత దేశంలోని సాంస్కృతిక వైవిధ్య వినాశనాన్ని గమనిస్తున్నారు. దేశంలో ప్రతి నిత్యం దళితులమీద, మహిళలమీద మనువాద సంస్కృతి సాగిస్తున్న అణచివేతను గుర్తిస్తున్నారు.

అయితే ఈ సెక్షన్ మేధావులో అత్యధిక శాతం ప్రస్తుతం తమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మతోన్మాద వాగాడంబరానికి లోనై దానికి చురుకైన ఏజెంట్లుగా మారుతున్నారు. మతోన్మాద సంస్కృతిని విస్తరించడంలో వీరిదే ప్రధాన పాత్ర. పత్రికలు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వీరే చురుగ్గా పనిచేస్తున్నారు.

అయితే నేడు నిజమైన సాంస్కృతిక కార్యకలాపాలకు దూరం చేయబడిన లక్షలాది మంది శ్రామికుల్లో విజ్ఞానతృష్ణ విపరీతంగా ఉంది. వైద్యం కోసం, అందాన్ని ఆస్వాదించడం కోసం ఆరాటం ఉంది. పాఠశాలల కోసం, పరిశోధనాలయాలకోసం, ఆసుపత్రులకోసం, కొత్తకొత్త రవాణా సదుపాయాల కోసం, కళలు, సాహిత్యం, సంగీతం కోసం లక్షలాదిమంది శ్రామికులు డిమాండ్ చేస్తున్నారంటే సాంస్కృతిక రంగంలో సృజనాత్మక కృషి చేయడానికి గొప్ప అవకాశాలున్నాయన్న మాట.

మేధావులు, సాంస్కృతిక రంగంలో పనిచేస్తున్న వారికి, శ్రామిక వర్గాలకూ మధ్య ఐక్యత ఏర్పడ్డానికి ఇదే ప్రాతిపదిక. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకునే నేడు మనం సాంస్కృతిక రంగంలో ఐక్య సంఘటనా పోరాటాలను ఖరారు చేయాల్సి ఉంది. సాంస్కృతిక రంగంలో మన పోరాటం చాలా బలహీనంగా ఉందని గుర్తించాం. దాన్ని అధిగమించాలి. సాంస్కృతిక రంగంలో పోరాటం పార్టీ పనికాదనే భావన విడనాడాలి. దేశంలో రాజ్యమేలుతున్న మితవాద చీకటి శక్తులను ఓడించాలంటే సరళీకరణ ఆర్థిక విధానాలపై పోరాటం ఎంత ముఖ్యమో, సాంస్కృతిక రంగంలో పోరాటమూ అంతే ముఖ్యమని గుర్తించాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.


**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఈ మాసం ప్రత్యేకం

# పోరాటాలద్వారానే మతోన్మాదాన్ని ఓడించగలం

**బివి రాఘవులు**



రచయిత సిపిఐ(ఎం)
పొలిట్‌బ్యూరో సభ్యులు

*విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జూన్ 18, 19 తేదీల్లో జరిగిన సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ విస్తృత స్థాయి సమావేశాలకు హాజరైన ప్రతినిధులనుద్దేశించి రాఘవులు ప్రసంగించారు. సరళీకరణ విధానాలపై పోరాటం దానితోపాటు సాంస్కృతిక, సేవా, విద్య, వైద్యరంగాల్లో ప్రత్యామ్నాయ కార్యక్రమాలతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లడం ద్వారానూ, సామాజిక అంశాలపై విశాల వేదికలు నిర్మించడం ద్వారానూ బహుముఖ ఉద్యమ కార్యచరణతోనే మతోన్మాదాన్ని ఓడించగలమని, కేవలం ఎన్నికల ఎత్తుగడలతో దానిని ఓడించలేమని విశ్లేషిస్తూ సిపిఎం అఖిల భారత మహాసభ తీర్మానించిన ముఖ్యమైన రాజకీయ, నిర్మాణపర అంశాలను ఆయన వివరించారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులను వివరిస్తూ సాగిన రాఘవులు ప్రసంగంలోని ముఖ్యమైన అంశాలు ఆయన మాటల్లోనే...*

❊ ❊ ❊ ❊ ❊ ❊ ❊ ❊ ❊

దేశంలో ద్రవ్యలోటును జిడిపిలో 3.5 శాతానికి నియంత్రించే లక్ష్యంతో అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు వ్యయ కర్తన చర్యలకు దిగాయి. అందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (రేగా)కు కేటాయింపులు తగ్గించారు. వంట గ్యాస్ తదితర వాటికిచ్చే రాయితీలను తగ్గించారు. పెట్రోలు, డీజిలు ధరలను ప్రతి రోజు పెంచుతూపోతున్నారు. ప్రజల మీద దోపిడి పెరిగింది. ఆర్థిక సంక్షోభానికి ఇప్పటికీ పరిష్కారమేదీ దొరకలేదు. ఈ సంక్షోభానికి ప్రజలను దోపిడి చేయడం ఒక్కటే పెట్టుబడి దారీవర్గాలకు పరిష్కారంగా కనిపిస్తోంది. అందువల్లే ప్రజలు పోరాడి సాధించుకున్న సౌకర్యాలను తొలగించి, భారాలు మోపుతున్నారు. ప్రపంచంలో దాదాపు అన్ని దేశాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో ప్రజల నుంచి ప్రతిఘటన కూడా పెరిగింది. ఐరోపా, అమెరికా, బ్రిటన్ తదితర దేశాలన్నిటిలోనూ సమ్మెలు ఉధృతంగా జరుగుతున్నాయి.

### ప్రపంచ పరిస్థితి

ఆర్థిక సంక్షోభం కారణంగా అసమానతలు తీవ్రమవుతున్నాయి. దేశాలకు, దేశాలకు మధ్యనే కాదు..ఒకే దేశంలో వివిధ తరగతుల మధ్య అసమానతలు కూడా భారీగా పెరిగిపోతున్నాయి. సంక్షోభం కాలంలోనే ధనవంతులు ఎక్కువ లాభపడతారు. పేదలు మరింత పేదలు అవుతారు. ప్రజలపై భారాలు పెరగడం వల్ల ఆ భారాలు తగ్గించుకునేందుకు విద్య, వైద్యం తదితర ఖర్చుల కోసం తమకున్న ఆస్తిపాస్తులు అమ్ముకోవడానికి సిద్ధపడతారు. మద్దతు ధరలు లభించక రైతులు తాము తీసుకున్న అప్పులు కట్టలేని పరిస్థితులు ఏర్పడటంతో రుణం ఇచ్చినవారు పొలాలు లాగేసుకుంటారు. దివాళా తీసినవారి నుంచి, ప్రభుత్వ అమ్మకాల నుంచి కారు చౌకగా ఆస్తులను, వనరులను కొట్టేసి సంపన్నులు మరింత సంపన్నులు కావడానికి సంక్షోభ కాలం ఒక మంచి అవకాశం. ఈ కాలంలోనే పోర్బ్స్ ధనవంతుల జాబితాలో భారతీయుల సంఖ్య పెరిగిపోయింది ఇందుకే.

అమెరికా నేటికీ ప్రపంచ సామ్రాజ్యవాద దేశాల్లో అగ్రభాగాన ఉంది. అంతకుముందు చాలా సులభంగా ప్రపంచంపైన ఆధిపత్యం చలాయించగలిగిన అమెరికా నలు వైపులా సమస్యలు చుట్టుముట్టేసరికి ఇప్పుడు దుందుడుకుతనంతో వ్యవహరించేందుకు వెనుకాడటం లేదు. ఉత్తర కొరియా, ఇరాన్, లాటిన్ అమెరికా దేశాల విషయంలో అమెరికా వ్యవహరిస్తున్న తీరు ఇందుకు నిదర్శనం.

ఆర్థిక అసమానతల కారణంగా ప్రపంచ మంతటా మితవాద పోకడలు (రైట్‌వర్డ్‌షిఫ్ట్) విస్తరిస్తున్నాయి. పెట్టుబడిదారి వ్యవస్థలో ఎప్పుడయితే వ్యవస్థీకృత సంక్షోభాన్ని పరిష్కరించుకోలేని పరిస్థితి ఏర్పడుతుందో అప్పుడు ఆ సంక్షోభానికి కారణాల్ని వ్యక్తుల మీద, దేశాల మీద, గ్రూపుల మీద నెట్టివేసే ప్రయత్నాలు ఆయా దేశాల రాజకీయాలు అభివృద్ధి నిరోధకం వైపుకి మళ్ళటానికి దారితీస్తున్నాయి. అంటే ప్రతి దేశంలోనూ అభివృద్ధి నిరోధక భావాల్ని ముందుకు తీసుకొచ్చి, వాటి ప్రాతిపదికన ఎన్నికల్లో పోటీ చేసేవాళ్లు ఎక్కువయ్యారు. కొన్ని చోట్ల గెలుస్తున్నారు. కొన్ని చోట్ల ఎక్కువ ఓట్లు తెచ్చుకుంటున్నారు. అమెరికా ఫస్ట్ అందులోనూ అమెరికా తెల్లవాళ్లు ఫస్ట్ అంటూ ట్రంప్ ఇచ్చిన నినాదం, మెక్సికో సరిహద్దు వెంబడి గోడ కట్టేస్తామనడం వంటివన్ని అభివృద్ధి నిరోధక ప్రాతిపదికలే. నిన్నటి జి7 దేశాల సదస్సులో ఒక దేశం మరో దేశం మోసం చేసిందంటూ విమర్శలు చేసుకోవడం, ఇస్లామోఫోబియా, ఏడు దేశాల పౌరులను అమెరికాలో అడుగు పెట్టనీయకుండా పర్యాటక నిషేదం విధించడం వంటివన్నీ కూడా మితవాదం వైపుమొగ్గుకు ఉదాహరణలే.

అభివృద్ధి నిరోధక ధోరణలు ఒక్క దేశానికే పరిమితం కాదు. ఇటలీ, స్పెయిన్, డెన్మార్క్, నెదర్లాండ్ ఇలా ప్రతి దేశంలోనూ అభివృద్ధి నిరోధక శక్తులు పెరిగిపోతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన సంక్షోభ ప్రభావం ప్రతి దేశం మీద వివిధ భావాల ప్రాతిపదికగా అభివృద్ధి నిరోధక దోరణలకు దారితీసింది. ఒకచోట చోట వలసలు వచ్చినవాళ్ల మీద కోపం రూపంలో కావచ్చు, ఇంకో చోట ఉగ్రవాదం మీద కోపం తోటి కావచ్చు. మన

దేశంలో మతం పేరుతో జాతీయ ఉన్మాదానికి కారణం కావచ్చు.

ఆర్థిక సంక్షోభం మూలాన దేశాల మధ్య తగాదాలు కూడా వస్తాయి. సోషలిస్టు దేశాలున్నప్పుడు సామ్రాజ్యవాదులు తమలో తగాదాలు పెద్దగా ముందుకు రానివ్వలేదు. సర్దుకొనిపోయే ధోరణి ఉండేది. సోషలిస్టు వ్యవస్థ దెబ్బతిన్న తర్వాత కూడా వాళ్ల మధ్య తగాదాలు పెద్దగా ముందుకు రాలేదు. గతంలో ఏ దేశ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాల కోసం ఆ దేశం ముందుకు వచ్చేది కాబట్టి ఈ పెట్టుబడుల మధ్య తగాదా దేశాల మధ్య తగాదాలుగా వచ్చేవి. ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఫలానా దేశం పెట్టుబడి అని చెప్పడానికి లేదు. ప్రపంచ పెట్టుబడి అంతా ఏకమైపోయింది. అందువల్ల సామ్రాజ్యవాదులు ఐక్యంగా దోచుకునే పరిస్థితి వచ్చింది. కాబట్టి నా దేశం పెట్టుబడి ప్రయోజనాలను నేను రక్షించుకునే పద్ధతి తగ్గిపోయింది. అందువల్ల వాళ్ల మధ్య తగాదాలు కూడా పరిమితం అయిపోయాయి. మళ్లీ ఇప్పుడు ఈ సామ్రాజ్యవాద దేశాల మధ్యనే ఆర్థిక సంక్షోభం ఎప్పుడయితే తీవ్రమైందో ప్రపంచ సంగతంతా నా కెందుకు? నా దేశం ప్రయోజనాలు రక్షించుకుంటామనే ధోరణి పెరిగింది. అందుకనే ట్రంప్ అమెరికా ఫస్ట్ నినాదం. పాతకాలంలో సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు యుద్ధాలను సృష్టించేంతటి స్థాయిలో ఉండేవి. ఇప్పుడు అంతటి స్థాయి ఘర్షణలు లేవు. గతంలో ఉండే స్నేహాలు, సర్దుబాట్లు తగ్గి తగాదాల ధోరణి పెరుగుతూ వస్తోంది. అందుకనే జి7 సదస్సు ఉమ్మడి ప్రకటనపై ట్రంప్ సంతకం చేయలేదు. అంతకుముందు పర్యావరణ ఒప్పందంపైనా సంతకం చేయనన్నారు. ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. కాబట్టి ఈ రూపాల్లో వాళ్ల మధ్య అంతర్గతమైన ఘర్షణలు కొంత పెరిగాయి. రాబోయే కాలంలోనూ పెరగవచ్చు.

**బహుళ ధ్రువ ప్రపంచానికి ఇబ్బందులు**

సోషలిస్టు వ్యవస్థ ముఖ్యంగా సోవియట్ రష్యా పతనం తర్వాత అమెరికాను ఏక ధ్రువ ప్రపంచంగా భావిస్తూ వచ్చాం. అయితే క్రమేణా ఏక ధ్రువ ప్రపంచం కాకుండా సోషలిస్టు ప్రపంచమూ, సామ్రాజ్యవాదం కాకుండా బహుళ ధ్రువ ప్రపంచం, అంటే రకరకాల కూటములు ముందుకు వచ్చాయి. ఒకరి పెత్తనం కింద కాకుండా రకరకాల కూటముల కింద ఆయా దేశాల ప్రయోజనాలు కాపాడుకునేందుకు కృషి చేయడంతో బహుళ ధ్రువ ప్రపంచంగా మారింది. ఈ మూడేళ్ల కాలంలో అటువంటి బహుళ ధ్రువ ప్రపంచం కొంత బలహీన పడే లక్షణాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా భారతదేశం అమెరికా పంచన చేరిపోవటంతో ఈ బహుళ ధ్రువ ప్రపంచం బలహీనపడుతున్నది. బ్రిక్స్ దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా భారత్ వ్యవహరించే పరిస్థితి తగ్గిపోయింది.

> **❝ఉత్తర కొరియా, అమెరికా మధ్య చారిత్రాత్మక ఒప్పందం జరిగింది. అణ్వాయుధాలు తయారు చేసి అనుక్షణం సర్వసన్నద్ధంగా ఉండాలనేది చిన్నపాటి కొరియాకు తలకు మించిన భారమే. అటువంటి స్థితి నుంచి తమ ప్రయోజనాలకు నష్టం కలగకుండా బయటపడటం ఉత్తరకొరియాకు ఉపయుక్తమనడంలో సందేహం లేదు.❞**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ఏ దేశమైనా విదేశాంగ విధానంలో ఇరుగుపొరుగు దేశాలతో సఖ్యతగా ఉండాలనేది ఒక ముఖ్యమైన అంశం. మనకు పొరుగు దేశాలతో సత్సంబంధాలు అంతగా లేవని చెప్పాలి. చర్చల ద్వారా పొరుగు దేశాలతో సఖ్యత పెంచుకోకపోతే ప్రస్తుత పరిస్థితి భారతదేశానికి నష్టదాయకంగా పరిణమిస్తుంది.

**సోషలిస్టు దేశాల పరిస్థితి**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రభావం సోషలిస్టు దేశాల మీద కూడా పడింది. కొంత మేర దానిని తట్టుకొని తమ ఆర్థిక వ్యవస్థలను చైనా నిలబెట్టుకుంది. తమ దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచి ఉత్పత్తి ఆగిపోకుండా ప్రయత్నం చేస్తున్నారు. దానికితోడు పర్యావరణం వంటివాటిపైనా దృష్టి సారించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభలో అటువంటి నిర్ణయాలు తీసుకుంటూనే మార్క్సిజం, లెనినిజం, సోషలిజం వాటికన్నిటికీ కట్టుబడి వుండటమే అభివృద్ధికి మార్గం అని స్పష్టీకరించారు.

వియత్నాం కూడా అంతర్గత మార్కెట్ మీద శ్రద్ధ పెట్టాలని ప్రయత్నాలు చేస్తోంది. ఈ కాలంలో క్యూబా కొన్ని కొత్త ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అమెరికా అధ్యక్షునిగా బరాక్ ఒబామా ఉన్నప్పుడు క్యూబాపై కొన్ని ఆంక్షలను సడలించారు. ఇప్పుడు ట్రంప్ మళ్లీ వాటిని పునరుద్ధరించేందుకు యత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో దేశాధ్యక్ష బాధ్యతలు వయసు రీత్యా రావుల్ కాస్ట్రో కొత్త తరానికి అప్పగించారు. అయినా సోషలిజానికి కట్టుబడి ముందుకు పోతామని క్యూబా కూడా ప్రకటించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సమ్మిళితమై అవి కూడా సంస్కరణలు చేపట్టినందున సంక్షోభ ప్రభావం వాటి మీద కూడా పడింది. అయితే సోషలిస్టు వ్యవస్థ ప్రభుత్వ రంగంపై ఆధారపడి వుంది. కాబట్టి సంక్షోభాలను తట్టుకొనే శక్తి కాస్త మెరుగ్గా ఉంటుంది. వీటిని తట్టుకొని ఆ దేశాలు మళ్లీ ముందుకు వెళ్తున్నాయి.

ఉత్తర కొరియా, అమెరికా మధ్య చారిత్రాత్మక ఒప్పందం జరిగింది. అణ్వాయుధాలు తయారు చేసి అనుక్షణం సర్వసన్నద్ధంగా ఉండాలనేది చిన్నపాటి కొరియాకు తలకు మించిన భారమే. అటువంటి స్థితి నుంచి తమ ప్రయోజనాలకు నష్టం కలగకుండా బయటపడటం ఉత్తరకొరియాకు ఉపయుక్తమనడంలో సందేహం లేదు. కానీ దక్షిణ కొరియాతో సంబంధాలు మెరుగుపర్చుకుంటున్న క్రమంలో ఆ సంబంధాలను బలహీనపర్చి దెబ్బతీసే ప్రయత్నాలు అమెరికా చేస్తే, దాని ప్రయత్నాలపట్ల ఉత్తర కొరియా అప్రమత్తంగా ఉండాలి.

**అంతర్జాతీయ పరిస్థితులపై కర్తవ్యం**

విప్లవోద్యమంలో సామ్రాజ్యవాద వ్యతిరేకత అంశం ఎల్లప్పుడూ ముఖ్యమైనది. అంతర్జాతీయ పరిస్థితులు ఏ విప్లవాన్ని అయినా ప్రభా

> **"అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రారంభించినా దానిని బిజెపి ఇంకాస్త ముందుకు తీసుకెళ్లింది. అలాగే రక్షణ రంగంలోకి విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరిచి, ఆ రకంగానూ బిజెపి అమెరికాతో వ్యూహాత్మక భాగ స్వామ్యాన్ని ఒక ఉన్నతస్థాయికి తీసుకెళ్లింది. మరోవైపు నిరంకు శత్వ పోకడలు, ఆధిపత్య ధోరణులు పెరిగిపోయాయి."**

వితం చేస్తాయి. ఒక దేశంలో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడం అంతర్జాతీయ పరిస్థితి సానుకూలత లేకుండా సాధ్యం కాదు. అందు కని సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాన్ని జయ ప్రదం చేయడం పార్టీ కర్తవ్యాలలో ఒక ముఖ్య మైన అంశం.

**జాతీయ పరిస్థితులు**

విశాఖపట్నంలో పార్టీ 21వ మహాసభ జరిగేనాటికి బిజెపి అధికారంలోకి వచ్చింది. 22వ మహాసభ నాటికి బిజెపి నాలుగు సంవత్స రాలు పరిపాలన చేసింది. గతంలో కూడా బిజెపి అధికారంలోకి వచ్చింది. అప్పుడు సంపూర్ణమైన మెజార్టీతో కాకుండా సంకీర్ణంతోటే అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. విశాఖ మహాసభ నాటికే పది నెలల కాలంలో బిజెపి ప్రజాజీవితంలోని అన్ని రంగాల్లో మతోన్మాదాన్ని చొప్పించే ప్రయత్నాలను ఉధృతం చేసింది. విశాఖ మహాసభ కూడా దానిని గుర్తించింది. అదే సమయంలో సరళీకరణ విధానాలను కూడా అది వేగంగా అమల్జేస్తోంది. అధికారం లోకి వచ్చిరాగానే సంస్కరణల అజెండా ప్రకటిం చారు. ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి నీతి అయోగ్‌ను ముందుకు తీసుకొచ్చారు. ఈ సరళీ కరణ విధానాల వేగాన్ని కూడా విశాఖపట్నం మహాసభ గమనించింది.

అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రారంభించినా దానిని బిజెపి ఇంకాస్త ముందుకు తీసుకెళ్లింది. అలాగే రక్షణ రంగం లోకి విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరిచి, ఆ రకంగానూ బిజెపి అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఒక ఉన్నతస్థాయికి తీసుకెళ్లింది. మరోవైపు నిరంకుశత్వ పోకడలు, ఆధిపత్య ధోరణులు పెరిగిపోయాయి. పార్లమెం టును, రాజ్యాంగ సంస్థలను లెక్క చేయడం లేదు. ఇటు రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. ఈ


రావుల్ కాస్ట్రో

విషయాలన్ని విశాఖ మహాసభ గమనించింది. ఇదంతా పది నెలల బిజెపి పాలనలోనే జరిగిం ది. మరి ఈ మూడేళ్ల పాటు ఏం జరిగింది? పది నెలల బిజెపి పాలనలో విశాఖ మహాసభ గమనించిన అంశాలు ఈ కాలంలో మరింత తీవ్రమయ్యాయి. విశాఖ మహాసభ తర్వాత మితవాద దాడిలో అన్ని అంశాలూ తీవ్ర రూపం దాల్చినట్టు రాజకీయ తీర్మానంలోని 2.4 పేరాలో పేర్కొన్నారు. ఏఏ అంశాలు తీవ్రరూపం దాల్చాయ నంటే..

**మొదటిది మతోన్మాద పోకడలు :** మతోన్మాదాన్ని విస్తరింపజేసి, మతోన్మాద శక్తు లను పెంచి ఆ రకంగా అన్ని వ్యవస్థలనీ, సంస్థ లనీ ధ్వంసం చేసే కార్యక్రమం ఏదైతే ఉందో అది ఈ మూడేళ్లలో బాగా వేగంగా జరి గింది. ప్రణాళిక సంఘాన్ని ధ్వంసం చేశారు. ఆర్థిక బిల్లులపై రాజ్యసభ చర్చ చేయటం ఉండదు కాబట్టి పార్లమెంటులో ప్రతి బిల్లును ఫైనాన్స్ బిల్లుగా పెట్టేసి రాజ్యసభకు పోకుండా చేశారు.

కార్మిక చట్టాల్లో 44 బిల్లులను నాలుగు కోడ్‌లుగా తయారు చేసి పార్లమెంటులో పెట్టాలని ప్రయత్నం చేశారు. శాశ్వత ఉద్యోగా లనే మాటలేదు. అన్ని టెన్యూర్ పెట్టేశారు. విద్యా సంస్థల్లో, పరిశోధక సంస్థల్లో డైరెక్టర్లుగా ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లను నియమించారు. విద్యాశాఖ మంత్రితో సహా డైరెక్టర్లలో చాలామందికి శాస్త్రీయ ఆలోచన ఏమాత్రమూ లేదు. సీతమ్మ టెస్ట్‌ట్యూబ్ బేబీ అని, ప్లాస్టిక్ సర్జరీలు ఎప్పుడో చేశామనీ ఇతిహాసగాథలనే శాస్త్రీయ వార సత్వంగా ప్రచారం చేసుకునే మూఢ వైఖరి వీరిది. దేశంలో నలుగురు ప్రముఖ హేతువాదు లను చంపేశారు. గౌరీ లంకేశ్ హత్యపై ప్రధాన మంత్రి స్పందించలేదంటూ నిలదీస్తే 'ఒక కుక్క చస్తే ప్రధాని స్పందిచాలా' అనంటూ కర్నాటకకు చెందిన శ్రీరామ్‌సేన వారు నోరు పారేసుకు న్నారు. ఈ రూపంలో సాంస్కృతిక రంగం, విద్యా రంగం మీద దాడులు పెరిగాయి.

మైనార్టీలపైనా, దళితులపైనా ఇదేరీతిలో దాడులు జరుగుతున్నాయి. హిందూత్వ సిద్ధాం తం ఒట్టి మతానికి సంబంధించినదే కాదు.. మొత్తం సామాజిక రంగానికి సబంధించినది. దళితులు మీదే కాదు, వారి రిజర్వేషన్ల మీదా, రక్షణ కల్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మీద దాడులు చేస్తున్నారు. సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ స్థాయిలో ఉద్యోగుల నుంచో, సెలక్షన్‌లలో నుంచో కాకుండా లేటరల్ ఎంట్రీ పేరుతో బయట వాళ్లని నియమించుకునే పద్ధతి ఇటీవల తెచ్చారు. నైపుణ్యాన్ని బట్టి అంటే ఇక రిజర్వేషన్లు ఏమీ ఉండవు.

స్త్రీల మీద అత్యాచారాలు, అక్రమాలు తీవ్రమయ్యాయి. ఇందుకు స్త్రీలదే తప్పు అని సంఘ్ పరివార్ వారు ముద్ర వేస్తున్నారు. తప్పు వాళ్లలోనూ, వాళ్ల కుటుంబాల్లోనో ఉంది తప్ప నేరస్తులది కాదంటూ చెప్పే దుస్థితి నెలకొంది.

**నీతి అయోగ్‌తో సరళీకరణ సంస్కరణల జోరు :** సరళీకరణ విధానాలను ముందుకు తీసుకొచ్చి అమలు జరపడంలో నీతి అయోగ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ఇది మూడేళ్లు, ఏడేళ్లు, 15 ఏళ్లకు ప్రణాళికలు రూపొంది స్తుంది. ఇప్పుడు మూడేళ్ల ప్రణాళికను బిజెపి ప్రభుత్వం అమలు జరుపుతున్నది. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎన్నింటిని అమ్మేయాలి, ఎన్నిం టిని మూసేయాలి అనేది ఇది ప్రతిపాదిస్తుంది. కాంగ్రెస్ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు ప్రారంభమైనా ఇప్పుడు వ్యవస్థీకృ తంగానే ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యపర్చే పని జరుగుతోంది.

విద్యారంగంలో ఇది వరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉండేది. ఇప్పుడు నామ మాత్రం చేశారు. ఇప్పుడు ఒక ఫండ్ ఏర్పాటు చేశారు. ఆ ఫండ్ నుంచి వర్సిటీలు అప్పులు

తీసుకొని మళ్లీ చెల్లించాలి. రుణార్హత కూడా ప్రస్తుతం 20 వర్సిటీలకే కల్పించారు. అందునా పది ప్రయివేటు వర్సిటీలు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో హానికరమైన కొత్త పద్ధతులను ప్రవేశ పెడుతున్నారు. విద్యారంగంతో పాటు రైల్వేలు, విమానయానం ఇలా ప్రతి రంగాన్నీ ప్రయివేటీకరించడం నీతి అయోగ్ సిఫార్సుల తోనే వేగంగా జరుగుతోంది.

**అధిపత్య దోరణలు :** బిజెపి హయాంలో ఆధిపత్య దోరణులు (అథారిటేరియన్ టెండెన్సీస్) తీవ్రతరం అయ్యాయి. సమాఖ్య స్ఫూర్తిని నీరుగారుస్తూ రాష్ట్రాల హక్కులపై దాడులు చేస్తోంది. గవర్నర్ల వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వస్తు, సేవల పన్ను (జిఎస్టి), నోట్ల రద్దు ద్వారా రాష్ట్రాలకు దక్కాల్సిన వాటాలపైనా, హక్కులపైనా దాడి జరుగుతోంది. మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (రేగా)తో సహా 49 రకాల పథకాల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపైకి నెట్టేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్థిక సంఘం రాష్ట్రాల హక్కులను హరించివేసింది.

**జమిలి ఎన్నికలు :** పార్లమెంటు ఎన్నికలు, శాసనసభ ఎన్నికలు ఒకేసారి జమిలిగా నిర్వహించాలని ఇప్పుడు కేంద్రం ప్రయత్నిస్తున్నది. రెండింటికీ ఒకేసారి ఎన్నికలు జరిగితే కేంద్ర ప్రభుత్వం యొక్క అజెండానే ప్రధానమైపోతుంది. రాష్ట్రాల యొక్క ప్రయోజనాలకు, వాటికి ప్రాధాన్యత ఇచ్చే పార్టీల యొక్క ప్రాధాన్యత తగ్గిపోతుంది. ప్రస్తుతం స్థానికంగా, రాష్ట్రాల్లోనూ స్థానిక ప్రజల ఆకాంక్షలను కాస్తయినా ప్రతిబింబించేలా, వైవిధ్యాన్ని ప్రతిబింబించే పార్టీలున్నాయి. జమిలి ఎన్నికలొస్తే అఖిల భారత రాజకీయాలే ముఖ్యమై, రాష్ట్రాల ఆకాంక్షలకు ప్రాధాన్యత లేకుండా పోతుంది. జమిలి ఎన్నికల కోసం వాళ్లు ముందుకు తెస్తున్న వాదనేంటి? వేర్వేరుగా ఎన్నికలు నిర్వహిస్తే డబ్బులు ఖర్చు చేయాల్సివస్తుందని. మరి ఎన్నికల్లో లోక్‌సభ స్థానానికి రూ.100 కోట్లు, శాసనసభ స్థానానికి రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నారు కదా. ఆ ఖర్చు నియంత్రణకు చర్యలేమీ తీసుకోరు సరికదా ఇప్పుడు ఎన్నికల బాండ్లు తీసుకొచ్చారు. ఇది వరకు రాజకీయ విరాళాలిస్తే ఎవరు ఎవరికి ఎంత ఇచ్చారనేది ప్రకటించాల్సివుండేది. అది కూడా ఆదాయంలో 7.5 శాతం మించి రాజకీయ విరాళం ఇవ్వడానికి వీల్లేదు. ఇప్పుడు ఎన్నికల బాండ్లు ఎవరు ఎవరికి ఇచ్చారో చెప్పాల్సిన పనిలేదు. కార్పొరేట్ కంపెనీలు వాళ్ల ఆదాయం ఎంత వస్తే అంతా

> **❝ మన రాష్ట్రంలో ప్రత్యేక హోదా అంశం, ఉత్తరాది రాష్ట్రాల్లో వ్యవసాయ సంక్షోభం, ఇంకో రాష్ట్రంలో మైనార్టీల సమస్య, పౌరసత్వ సమస్య ఇలా ప్రతి రాష్ట్రంలోనూ బిజెపికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యమవుతున్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని బలహీనపర్చే ప్రయత్నాలను నిరసిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 2న దళితులు దేశవ్యాప్త బంద్‌కు పిలుపు నిస్తే దిగ్విజయంగా జరిగింది. ❞**

ఇచ్చేయవచ్చు. మరి ఎన్నికల్లో ఇంత డబ్బు వాళ్లతో ఎందుకు ఖర్చు పెట్టించాలి. అది వృథా కాదా అనంటే ఆ డబ్బు అంతా సమాజంలోకి వెళ్లి ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని కొంతమంది వాదన చేస్తుంటారు. మరి ఎన్నికలు రెండు సార్లు జరిగినా ఆ రకంగా అయ్యే ఖర్చు కూడా సమా జంలోకి వెళ్లి ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుంది కదా అనంటే దానికి సమాధానం చెప్పరు. ఇవన్నీ కూడా జనాకర్షక వాదనలు (పాపులరిస్ట్ టెండెన్సీస్). లోతుపాతులకెళ్లి విషయాన్ని అర్థం చేసుకోలేని సామాన్య ప్రజానీకాన్ని తప్పుదారి పట్టించే వాదనలివి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లాంటి వాళ్లంతా చేస్తున్నది ఈ వాదనలే. ఇవి మధ్య తరగతి ప్రజలను, అసంతృప్తితో ఉన్నవారిని నమ్మించడానికి ఉపయోగపడతాయి. అందుకని ఎన్నికల సంస్కరణల కోసం తీవ్రమైన కృషి జరపకపోతే అభ్యుదయ భావజాలం కలిగినవాళ్లు ఎన్నికల్లో పోటీ చేయడం కూడా సాధ్యపడదు. ఎన్నికల్లో ఎంత పోరాటం చేస్తున్నామో, వాటిలో సంస్కరణల కోసం కూడా అంతటి పోరాటం చేయాల్సిన ఆవశ్యకతను మహాసభ నొక్కి చెప్పింది.

**వ్యవసాయ సంక్షోభం :** బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగ సంక్షోభం చాలా తీవ్రమైంది. బిజెపిపై తీవ్రమైన అసంతృప్తితో ఇవాళ రైతులున్నారు. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో రైతాంగ ఉద్యమాల ఉధృతి మనకు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఇలా బిజెపి పాలిత రాష్ట్రాలన్నిటిలోనూ రైతులు తిరుగుబాటు చేస్తున్నారు. మహారాష్ట్ర మినహాయిస్తే మిగిలిన రాష్ట్రాల్లో వామపక్షాల బలం అంతగా లేకున్నా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. మహారాష్ట్రలో కిసాన్‌సభ నిర్వహించిన మహా పాదయాత్ర ఒక చరిత్రాత్మక ఘటనగా నిలిచింది. అందువల్ల వ్యవసాయ రంగ సంక్షోభం ఒక ముఖ్యమైన అంశంగా మహాసభ పేర్కొంది.

**బిజెపి పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి :** విశాఖ మహాసభ తర్వాత ఈ మూడేళ్ల బిజెపి పాలనలో అటు సరళీకరణ విధానాలవల్లనైతేనేమి, మతోన్మాద విధానాల వల్లనైతేనేమి వివిధ సెక్షన్ల ప్రజల్లో అసంతృప్తులు తీవ్రంగా పెరిగాయి. సామాజిక, రాజకీయ, వివిధ సమస్యలపై ఆందోళనల్లో అది వ్యక్తమవుతోంది. పోరాటాలూ ఉధృతమౌతున్నాయి. అయితే ఈ పోరాటాలను దారి మళ్లించే చర్యలు కూడా బిజెపి ముమ్మరంగా చేస్తోంది. అస్సాంలో పౌరసత్వ వివాదంపై పెద్ద గొడవ నడుస్తోంది. ఇటువంటి విభజన అంశాల ప్రాతిపదిక మీద వచ్చిన అసంతృప్తులను పక్కదోవ పట్టించేదానికి బిజెపికి అదనంగానే శక్తి ఉంది. కానీ ఎన్ని విభజనలు చేసినా మొత్తం మీద ప్రజలు బిజెపికి వ్యతిరేకంగా నిలబడే పరిస్థితి వచ్చింది. మన రాష్ట్రంలో ప్రత్యేక హోదా అంశం, ఉత్తరాది రాష్ట్రాల్లో వ్యవసాయ సంక్షోభం, ఇంకో రాష్ట్రంలో మైనార్టీల సమస్య, పౌరసత్వ సమస్య ఇలా ప్రతి రాష్ట్రంలోనూ బిజెపికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యమవుతున్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని బలహీనపర్చే ప్రయత్నాలను నిరసిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 2న దళితులు దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తే దిగ్విజయంగా జరిగింది. బిజెపికి వ్యతిరేకంగా వివిధ తరగతుల ప్రజల్లో పెరిగిపోతున్న ఈ అసంతృప్తులన్నిటినీ ఒక్క చోటకు తీసుకురావడం ముఖ్యమైన కర్తవ్యం అని మహాసభ రాజకీయ తీర్మానం పేర్కొంది.

బిజెపి పట్ల వివిధ తరగతుల ప్రజల్లో అసంతృప్తులు పెరుగుతున్న నేపథ్యంలో మన కర్తవ్యమేంటి? మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా మనం ఏమి చేయాలనంటే.. మొదటిది సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటం చేయాలి. మతాలు, కులాలు,

> **"కాంగ్రెస్, బిజెపి బడా బూర్జువా, భూస్వామ్య వర్గ పార్టీలు. టిడిపి, వైసిపి, టిఆర్ఎస్ ఇవన్నీ కూడా బూర్జువా, భూస్వామ్య వర్గాల పార్టీలే. అయితే కాంగ్రెస్, బిజెపి బడా బూర్జువా వర్గానికి నాయకత్వం వహించే పార్టీలు. అందు వలన ఈ రెండు బడా బూర్జువా, భూస్వామ్య వర్గ పార్టీలతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ అవగాహనలు, సంఘట నలు ఏర్పాటు చేయ కూడదు."**



వ్యవసాయం సంక్షోభంతో పోరాటాలలోకి కదులుతున్న రైతులు

ఉపకులాలు, భాషా మైనార్టీల మధ్య రకరకాల పద్ధతుల్లో ఏదైతే విభజన చేసి తంపులు పెట్టాలని బిజెపి ప్రయత్నాలు చేస్తోందో వాటిని తిప్పికొట్టి ప్రజలను ఐక్యపర్చేందుకు సరళీకరణ విధానా లపై పోరాటం ఉపయోగపడుతుంది. సరళీక రణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయ కుండా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయటం సాధ్యం కాదని కలకత్తా ప్లీనంలోనూ, విశాఖ మహాసభలోనూ తేల్చి చెప్పాం. వాస్త వంగా మతోన్మాదం వైపు ప్రజలు మొగ్గడానికి సరళీకరణ విధానాల వల్ల వచ్చిన అసంతృప్తి కారణం. ఆ అసంతృప్తికి ఉద్యమరూపం ఇచ్చి సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడక పోతే అసంతృప్తిని మతోన్మాద శక్తులకు వదిలిసి నట్టు అవుతుంది. కాబట్టి మతోన్మాదాన్ని తిప్పి కొట్టాలంటే సరళీకరణ విధానాలపై పోరాడటం అనేది ముఖ్యమైన కర్తవ్యం.

మతోన్మాద ప్రభుత్వంలో సరళీకరణ విధా నాలు ఉధృతంగా అమలు చేయడంతో పాటు సాంస్కృతిక, సేవా తదితర రంగాల్లోకి సంఘ్ పరివార్ శక్తుల ద్వారా ఆర్ఎస్ఎస్ మతోన్మా దాన్ని చొప్పిస్తోంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతా లపై కేంద్రీకరించి పాఠశాలలు, వైద్య శిబిరాలు నడపడం, భజనలు లాంటి అధ్యాత్మిక కార్యక్ర మాల ద్వారా మతతత్వ భావాలను బిజెపి చొప్పి స్తోంది. వీటికి కార్పొరేట్ సంస్థలు పూర్తిగా సహ కరిస్తున్నాయి. అందుకనే రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లోని గిరిజనులు బిజెపి వైపు మొగ్గుతున్నారు. క్రైస్తవు లకు వ్యతిరేకంగా క్రైస్తవులు కాని గిరిజనులను అది రెచ్చగొడుతోంది. అందువల్ల బిజెపి మతోన్మాదాన్ని అడ్డుకోవాలంటే సాంస్కృతిక, సాహిత్య, మేధావి, విద్యా, వైద్య రంగాల్లో అభ్యు దయ శక్తుల కృషి పెరగాలి. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం అనేది ఎన్నికల ఎత్తు గడల పోరాటానికి పరిమితం చేయకూడదు. అది బహుముఖ పోరాటంగా చేయాలి.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఎన్నికల పోరాటం, రాజకీయ ఎత్తుగడలు, సాంస్కృతిక, సేవా రంగాల్లో కృషి ద్వారా బహుముఖంగా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు లౌకిక శక్తులను, ప్రజాస్వామ్య శక్తులతో విశాలమైన వేదికలు కూడా నిర్మించాల్సిన అవసరం ఉ ంది. ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి, టిడిపి, కాంగ్రెస్ లాంటివాటితో కలవకపోవచ్చు కానీ ఒక నిర్దిష్ట మైన అంశం ఆధారంగా బిజెపి మతోన్మాదంపై పోరాడేందుకు ప్రదర్శనలు చేయడానికో, నిరసన తెలియజేయడానికి ఆ పార్టీలు కలిసి వస్తే కలుపుకుపోవాలి. అలాంటి వాళ్లను ఆక ర్షించే ప్రయత్నాలు చేయాలి.

**సామాజిక ఉద్యమాలు :** హిందూ మతోన్మాదానికి కులవ్యవస్థ గుండెకాయ లాంటిది. కుల వ్యవస్థను నాశనం చేయాలని వాళ్లు అనుకోవడం లేదు. సామాజిక తరగతులు నేడు బిజెపిపై తీవ్రమైన ఆగ్రహంతో రగిలి పోతున్నాయి. అందుకని దళిత, గిరిజన, మైనా ర్టీ, మహిళల, వృత్తిదారుల సమస్యలను ముందు కు తీసుకొచ్చి వివిధ విశాల వేదికల నిర్మాణం ద్వారా నిలదీస్తే బిజెపి సమాధానం చెప్పుకోవా ల్సిన పరిస్థితి వస్తుంది. ఆత్మరక్షణలో పడే పరిస్థితి వస్తుంది. తెలంగాణలో లంబాడీలకు, గిరిజన గోండులకు తగాదా పెట్టారు. ఇదివరకు మాలలకు, మాదిగలకు తంపులు పెట్టి రాజకీ యంగా వాడుకున్నారు. ఇలాంటి తంపులు సృష్టించి సామాజిక తరగతుల్లో ఉండే ఆగ్రహాన్ని తట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సామాజిక తరగతుల సమస్యలను తీసుకోవడం ద్వారా మతోన్మాదులను ఒంటరి చేయగలం.

**రాజకీయ ఎత్తుగడలు :** రాజకీయ ఎత్తు గడలు నిర్ణయించుకోవడానికి మూడు అంశా లను పరిశీలనలోకి తీసుకోవాలని తీర్మానంలో పేర్కొన్నారు. మొదటిది : బిజెపి పట్ల వైఖరి, దాని యొక్క స్వభావం గురించిన అంచనా. రెండవది : కాంగ్రెస్ పార్టీ యొక్క స్వభావం గురించి. మూడవది : ప్రాంతీయ పార్టీలు.

కాంగ్రెస్, బిజెపి బడా బూర్జువా, భూస్వా మ్య వర్గ పార్టీలు. టిడిపి, వైసిపి, టిఆర్ఎస్ ఇవన్నీ కూడా బూర్జువా, భూస్వామ్య వర్గాల పార్టీలే. అయితే కాంగ్రెస్, బిజెపి బడా బూర్జువా వర్గానికి నాయకత్వం వహించే పార్టీలు. అందు వలన ఈ రెండు బడా బూర్జువా, భూస్వామ్య వర్గ పార్టీలతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ అవగాహనలు, సంఘటనలు ఏర్పాటు చేయ కూడదు. ఇవి మన శత్రు వర్గాలు. దేశంలో విప్లవం సాధించాలంటే వీటిని బలహీనపర్చి ఓడించాలనేది మన లక్ష్యం. అయితే బడా బూర్జువా వర్గం ఇప్పుడు బిజెపికి మద్దతుగా ఉంటోంది. కాంగ్రెస్‌కు దాని నుండి మద్దతు తగ్గిపోయింది. కదా. అందుకని అది బడా బూర్జువావర్గ పార్టీ కాకుండా పో యిందా? అలాగే ఇంతకు ముందు భారతదేశ వ్యాపితంగా కాంగ్రెస్ పార్టీ ఉండేది. ఇప్పుడు రెండు, మూడు రాష్ట్రాలకు పడిపోయిన పరిస్థితి ఉంది. అందుకని అది ప్రాంతీయ పార్టీ అయి

పోయిందేమో. దాని స్వభావం మారిపోయిందేమో అని కొందరు భావిస్తున్నారు.. దానికి నాలుగు సీట్లు ఎక్కువ వస్తే బడా బూర్జువా వర్గం, నాలుగు సీట్లు తగ్గిపోతే చిన్న బూర్జువా వర్గం అయిపోదు. అట్లయితే రెండు సీట్లు ఉన్నప్పుడు బిజెపి ఉంది. ఇప్పుడు కూడా ఉంది. అప్పుడూ, ఇప్పుడూ అది బడా బూర్జువా వర్గ పార్టీయే. అలాగే కాంగ్రెస్ కూడాను.

దేశంలో ప్రాంతీయ పార్టీలు ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వాటి శక్తిని మించి కూడా పాత్ర నిర్వహిస్తున్నాయి. బీహార్‌లో స్థానిక పార్టీలన్నీ కాంగ్రెస్‌తో కలిసిపోయి మహాగట్బంధన్‌గా ఏర్పడి బిజెపిని ఓడించాయి. కాబట్టి అటువంటి మహాగట్బంధన్ రావాలి. అందులో వామపక్షాలు చేరాలి. ఇదే మాట సిపిఐ కూడా అంటోంది. కానీ జరిగిందేమిటి? మహాగట్బంధన్ ద్వారా అధికారంలోకి వచ్చిన నితీశ్ కుమార్ ఆ తర్వాత బిజెపి పంచన చేరారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వముంది. అక్కడ లెఫ్టినెంట్ గవర్నరు వ్యవహారంపై ముఖ్యమంత్రితో సహా అందరూ నిరాహార దీక్షలు చేస్తుంటే కాంగ్రెస్, బిజెపి కలిసి వాళ్లను మూలకు నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ చూసినపుడు పార్టీల యొక్క స్వభావం, వాటి వర్గ అవగాహనను బట్టే ఎత్తుగడలను నిర్ణయించుకోవాలని మహాసభ నిర్దేశించింది.

అదే సమయంలో కాంగ్రెస్‌కు, బిజెపికి కచ్చితంగా తేడా చూస్తాం. కాంగ్రెస్‌ను లౌకిక పార్టీ అంటున్నాం. బిజెపి మతోన్మాద పార్టీ అంటున్నాం. లౌకికవాదం విషయంలో బిజెపికి, కాంగ్రెస్‌కు మధ్య వ్యత్యాసం చూస్తాం. గతంలో బిజెపి అధికారంలోకి వచ్చే ప్రమాదమున్నందునే దానిని అధికారంలోకి రాకుండా చేసేందుకే యుపిఎకు మద్దతు ఇచ్చాం మినహా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని కాదు.

కానీ కాంగ్రెస్ వర్గ స్వభావం బడా బూర్జువా, భూస్వామ్య వర్గ స్వభావనేది విస్మరించకూడదు. అది గమనంలో ఉంచుకొని దానితోటి రాజకీయంగా వ్యవహరించాలని మహాసభ నిర్దేశించింది. లౌకికవాద విషయాల్లో, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడే సమయాల్లో కాంగ్రెస్‌తో కలిసి వ్యవహరించడానికి వెనుకాడకూడదు. ప్రాంతీయ పార్టీలు 20 సంవత్సరాలు క్రితం ఉన్నట్లు ఇప్పుడు లేవు. సరళీకరణ విధానాల అమలులో ప్రాంతీయ పార్టీలు కూడా కాంగ్రెస్‌కు, బిజెపికి ఏమాత్రం తీసిపోవడం లేదు.

> “అనుభవంలో తేలిందేమిటి? వాళ్లతో కలిసినందున నాలుగైదు సీట్లు ఎన్నికల్లో ఎక్కువగా వచ్చినా ప్రజా పునాదిని పోగొట్టుకున్నాం. అందువల్ల సీట్లు కొలబద్ద కాదు. వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమా నికి ఉపయోగపడుతుందనుకుంటేనే ఎన్నికల సర్దుబాట్లుకు వెళ్లాలి. లేదంటే వెళ్లకూడదు అని చాలా స్పష్టంగా మహాసభ నిర్దేశించింది.”




పోరాటాలలో కార్మిక వర్గం

ప్రాంతీయ పార్టీలు కూడా అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచబ్యాంకు వంటి కార్పొరేటు ప్రాతినిధ్య సంస్థలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాయి. కాబట్టి ప్రాంతీయ పార్టీలు కూడా బడా బూర్జువా వర్గ పార్టీలుగా మారాయని చెప్పి బిజెపి, కాంగ్రెస్ పట్ల ఎలాంటి వైఖరితో ఉన్నామో వీటినే అలాగే చూడాలనేది ఒక వాదన. ప్రాంతీయ పార్టీలు ఏమీ మారలేదు, కాంగ్రెస్సే మారిపోయి వీటితో కలిసిపోయిందని చెప్పి ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకుంటున్నాం. కాబట్టి కాంగ్రెస్ తోనూ పొత్తు పెట్టుకోవచ్చు కదా అనేది మరో వాదన. ఈ రెండు వాదనలూ తప్పు. ఇప్పటికీ ఈ ప్రాంతీయ పార్టీలు ప్రాంతీయ బూర్జువా వర్గానికే స్థూలంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయనేది మహాసభ అంచనా. కాబట్టి బడా బూర్జువా వర్గానికి, ప్రాంతీయ బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యాలుంటాయి. ఆ వైరుధ్యాలున్న సందర్భంలో మనం ప్రాంతీయ పార్టీలతో భిన్నంగా వ్యవహరిస్తాం. వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమానికి ఉపయోగమయ్యేటట్లయితే అవసర మైనప్పుడు వాటితో సర్దుబాట్లు చేసుకోవడానికి వెనుకాడం. ప్రాంతీయ పార్టీలు తమ స్వప్రయోజనాలకోసం మతోన్మాద బిజెపితో అవకాశ వాదంగా వ్యవహరిస్తున్నాయి.

అయితే పాతిక సంవత్సరాలుగా ప్రాంతీయ పార్టీలతో పొత్తులు, సర్దుబాట్లు చేసుకుంటున్నాం. అవి సరళీకరణ విధానాల అమలుతో పాటు బిజెపి, సంఘ్‌పరివార్ మతోన్మాద శక్తుల పట్ల అవకాశవాద వైఖరిని ప్రదర్శిస్తున్నాయి. అనుభవంలో తేలిందేమిటి వాళ్లతో కలిసినందున నాలుగైదు సీట్లు ఎన్నికల్లో ఎక్కువగా వచ్చినా ప్రజా పునాదిని పోగొట్టుకున్నాం. అందువల్ల సీట్లు కొలబద్ద కాదు. వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి ఉపయోగపడుతుందనుకుంటేనే ఎన్నికల సర్దుబాట్లుకు వెళ్లాలి. లేదంటే వెళ్లకూ డదు అని చాలా స్పష్టంగామహాసభ నిర్దేశించింది.

ఎత్తుగడలు గురించి 2.115 చిత్తు తీర్మానంలో చెప్పడం జరిగింది. తుది తీర్మానంలో పార్టీ పొలిట్ బ్యూరో ప్రతిపాదించిన ఒక సవరణను మహాసభ ఆమోదించి 2.116లో చేర్చింది. ముసాయిదాలోని 2.115, 2.90 పేరాలలో విషయం మధ్య ఉన్న గందరగోళం తొలగించడం కోసం సవరణ అవసరమైంది. ‘మతోన్మాదం ముప్పునకు వ్యతిరేకంగా పోరాటాలు చేసే సందర్భంలో కాంగ్రెస్, ఇతర

(మిగతా 31వ పేజీలో)

న్యాయరంగం

# న్యాయవ్యవస్థపై పెత్తనానికి కేంద్రం కుట్ర

**ప్రశాంత్ పద్మనాభన్, వి. వెంకటేశన్**



రచయిత ప్రముఖ జర్నలిస్ట్

హైకోర్టుకి సుప్రీం కోర్టుకి జడ్జీల నియామకం ముందెన్నడూ ఇంత వివాదాస్పదం కాలేదు. సెకండ్ జడ్జెస్ కేసులో సుప్రీం కోర్టు యొక్క తొమ్మిది మంది జడ్జిలతో కూడిన ధర్మాసనం, కార్యనిర్వహణ విభాగం, న్యాయవిభాగం ఉమ్మడిగా జడ్జీల నియామకాన్ని చేపట్టాలని తీర్పు (1993) నిచ్చింది. అందువలన జడ్జీలను ప్రతిపాదించిన వారిలోని నిశితదృష్టిని న్యాయ విభాగంలోని వారు పరిశీలిస్తే వారి పూర్వపరాలను, కార్యనిర్వహణ విభాగం పరిశీలిస్తుందని ఆశించడం జరిగింది. తద్వారా ప్రజాతంత్ర వ్యవస్థకి మూలస్థంభాల వంటి ఈ రెండు విభాగాలు కలిసి దేశంలోని అత్యున్నత న్యాయ స్థానానికి తగిన వ్యక్తులను సూచిస్తారని, నియమిస్తారని ఆశిస్తారు ఎవరయినా.

కానీ ఈ ఏడు జనవరి 10వ తేదీ అయిదుగురు సీనియర్ జడ్జిలతో కూడిన కొలీజియం ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కె ఎం జోసెఫ్‌ని సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమించడానికి చేసిన సూచనను మోడీ ప్రభుత్వం నిరాకరించింది. ఇందుకు కారణం పైన చెప్పిన రెండు సూచనలలో ఏ ఒక్కటీ, అంటే పరిశీలించబడిన అభ్యర్థికి నిశిత దృష్టి లేకపోవడం గాని, పూర్వాపరాలు సరిగా లేకపోవడం గాని కారణాలు కావు. కేంద్రం, కొలీజియం కూడా జస్టిస్ జోసెఫ్ నైపుణ్యంలో అసాధారణ ప్రతిభ కలవారేనని అంగీకరించాయి. అయన పూర్వాపరాలు కూడా స్వచ్ఛంగానే ఉన్నాయి, అన్న ఏకాభిప్రాయంలోనే ఉన్నాయి. అయితే జస్టిస్ జోసెఫ్ 2016లో ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించడానికి అంగీకరించక పోవడం వలననే ఆయన నియామకాన్ని కేంద్రం తిప్పిపంపి, ఆయనను శిక్షిస్తున్నదని పౌరసమాజం భావిస్తున్నది. కేంద్రం ప్రత్యక్షంగా నియామకానికి సంబంధం లేని కొన్ని కుంటి సాకులు చెప్తున్నది. అఖిల భారత హైకోర్టు న్యాయమూర్తులలో సీనియారిటీ లేదని, కేరళ లాంటి ఒకచిన్న రాష్ట్రానికి ఒకరి కంటే ఎక్కువ ప్రాతినిధ్యం సుప్రీం కోర్టులో అవసరం లేదని, కొలీజియం దళిత లేదా గిరిజనుడినో ఎంపిక చేయడంలో విఫలమయ్యారన్నవి ఆ కారణాలు. ఏప్రిల్ 26వ తేది ప్రభుత్వం జస్టిస్ జోసెఫ్ ఎంపికను తిరిగి పరిశీలించవలసిందిగా కోరుతూ సుప్రీం కోర్టు కొలీజియంకి తిప్పి పంపింది. ఆలా పంపుతూ అతనితోపాటు ఎంపికచేయబడిన మరో వ్యక్తి ఎంపికను ఎందుకు వేరుచేసి చూసారో సుదీర్ఘంగా వివరించింది(ఇందు మల్హోత్రా అనే ఆమెను కూడా కొలీజియం జోసెఫ్‌తో పాటు సుప్రీమ్ కోర్టుకి ఎంపిక చేసింది.)

మే రెండవ తేదీ కొలీజియం జస్టిస్ జోసెఫ్ విషయంలో తన ఎంపికను సమర్థించుకుంటుందనుకుంటున్న సమయంలో కొలీజియం ఈ చర్చను వాయిదా వేసింది. ఆసమావేశం ప్రస్తుతానికి ప్రాతినిధ్యం లేని రాష్ట్రాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించడం సముచితంగా ఉంటుందని చెపుతూ, ప్రస్తుతం ప్రాతినిధ్యం లేని కలకత్తా, రాజస్థాన్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌ల నుండి సుప్రీం కోర్టుకు న్యాయమూర్తులుగా ఉండడానికి అర్హులను గుర్తించడంలో నిమగ్నమైంది. కేంద్రం కొలీజియం తాను చేసిన ఎంపికని తిరిగి పరిశీలించమని కోరడంలో ఆశ్చర్యం లేదు. అయితే కొలీజియం పరిశీలించవలసిన ఏ అంశం మయినా విస్మరించినట్లయితే అలా తిప్పిపంపడంలో అర్థముంది. కొలీజియం ఎంపికచేసిన ఇద్దరిలో కేవలం ఇందు మల్హోత్రాని నియమించి వేరొక వ్యక్తిని పక్కకు పెట్టడం, రెండో వ్యక్తి ఎంపికను కొలీజియం తిరిగి పరిశీలించేవరకు అనిశ్చిత పరిస్థితిలో పెట్టడం పౌర సమాజానికి ఆగ్రహం తెప్పించింది. నియామకాలు వేరుచేయడానికి ఇచ్చిన వివరణ సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఎంపిక చేయడం అన్నది రెండు స్థాయిలలో జరుగుతుంది. మొదటి స్థాయిలో, పరిశీలనలో ఉన్న జోన్లలో సుప్రీంకోర్టుకి నియమించ బడడానికి అర్హతగల వారి చిట్టాను తయారు చేస్తుంది. ఇందులో భారతదేశం మొత్తంగా ఉన్న సీనియారిటీ లిస్ట్ లోని జూనియర్స్ కూడా ఉంటారు. దీనికి కారణం సుప్రీంకోర్టులో ఏనాడూ ప్రాతినిధ్యంలేని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించడం, లేదా మైనారిటీలకు, ఎస్‌సి, ఎస్‌టిలకు లేదా మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం. ఇటువంటి ఎంపిక ప్రక్రియ ద్వారానే ఇతరత్రా అర్హతలున్న జూనియర్లకు కూడా సుప్రీంకోర్టులో ప్రాతినిధ్యం వహించే అవకాశం కలుగుతుంది. సుప్రీంకోర్టులో సీనియారిటీ అన్నది బెంచ్‌లు కేటాయించేటప్పుడు మాత్రమే ముందుకొస్తుంది. లేదా తన సర్వీస్ కాలంలో కొలీజియం చేత చీఫ్ జస్టిస్‌గా అత్యున్నత న్యాయస్థానానికి ఎంపిక కాబడే సమయంలో ముందుకొస్తుంది. కొలీజియం ఎంపిక చేసిన జడ్జిలలో ఎవరిపైన అయినా ప్రత్యేకంగా అభియోగాలు గాని ఇతరంగా అభ్యంతరాలు గాని ఉన్నట్లయితే కేంద్రం తిరస్కరిస్తుంది. ఒకవేళ అలా తిరస్కరించిన పక్షంలో కొలీజియంను తిరిగి వారి పేర్లను పరిగణించమని కోరవచ్చు. ఆలా కొలీజియం సమ్మతిని కోరినప్పుడే ఇటువంటి వివాదాలు ముందుకు వస్తాయి. 2014లో సీనియర్ అడ్వొకేట్ గోపాల్ సుబ్రహ్మణ్యంని కొలీజియం సుప్రీం కోర్టుకి నియమించినపుడు కూడా అయన పేరును పక్కన పెట్టడం జరిగింది. అప్పుడు జస్టిస్ లోధా అలా నియామకం పక్కన పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే జస్టిస్ సుబ్రహ్మణ్యమే ఆ తరువాత తన సమ్మతిని వెనక్కు తీసుకోవడం వలన సమస్య ముగిసిపోయింది. కొలీజియం వద్దకు ఆ ప్రతిపాదన తిరిగి రాలేదు. జనవరి 19వ తేదీ కొలీజియం ఇంకా ఎందరో అర్హులు ఉన్నప్పటికీ జస్టిస్ జోసెఫ్ పేరును, ఇందు మల్హోత్రా పేరును సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రతిపాదించింది. అప్పటికి 6 ఖాళీలున్నాయి.

“అందువలన జస్టిస్ జోసెఫ్ పేరు పక్కన పెట్టి, ఇందు మల్హోత్రా పేరును మాత్రమే పరిగణనలోనికి తీసుకోవడం కేవలం అనౌచిత్యమే. కొలీజియం జస్టిస్ జోసెఫ్, ఒక్క ఇందు మల్హోత్రానే కాక భారత దేశంలోని మిగిలిన అందరు సీనియర్ జడ్జిలకన్నా కూడా ముందుండాలని అభిప్రాయ పడింది. ముందు ముందు అతనికి పదోన్నతి కల్పించటానికి ఇది ఉపయోగపడవచ్చు.”

వారి ఉద్దేశం జస్టిస్ జోసెఫ్‌కి, ఇందు మల్హోత్రాకు సుప్రీం కోటాలో సీనియారిటీని కల్పించడమే. వారి పేర్లను గనక మిగిలిన అర్హులైన వారి నుండి వేరుగా చూపించకపోతే వారికి సీనియారిటీ దక్కదు. ఎందుకంటే పరిగణనలోకి తీసుకున్న జోన్‌లో ఇతర న్యాయవాదులు, హై కోర్టులలో వీరికంటే ముందుగా నియమించబడి ఉన్నందువలన వీరికంటే సీనియర్స్‌గా ఉండిఉండవచ్చు. అదేవిధంగా ఒక వ్యక్తి బార్ కౌన్సిల్ నుండి నేరుగా సుప్రీంకోర్టు జడ్జిగా వస్తే అయన హైకోర్టు జడ్జిగా అనుభవం ఉన్న వ్యక్తికన్నా జూనియర్ అవుతాడు. అంటే జస్టిస్ జోసెఫ్, ఇందు మల్హోత్రాల నియామకానికి ముందే కొలీజియం కేంద్రానికి సీనియారిటీ విషయంలో వారి ప్రతిపాదన తెలియచేసింది. కొలీజియం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కొలీజియం సమ్మతి లేకుండా కేంద్రం ఏకపక్షంగా మార్చవచ్చా లేదా అన్నది చర్చించవచ్చు. అఖిల భారత స్థాయిలో సీనియారిటీకి బదులుగా జోన్ స్థాయిలో అర్హులను జడ్జీలుగా ఎంపిక చేయడం అన్నది గుడ్డిగా సీనియారిటీ పైనే ఆధారపడడం వలన ఏర్పడే నష్టాలను తగ్గించడానికి ఉపయోగపడుతుందని పైవిధంగా ఎంపిక చేయడం జరుగుతున్నది. అందువలన అత్యున్నత న్యాయస్థానం విభిన్న తరగతుల నుండి వచ్చిన వారు ఉండడమే కాక వైవిధ్యంతో కూడి ఉంటుంది. నియమించబడినవారి నైపుణ్యాన్ని గుర్తించటం, వారు ఎల్లప్పుడూ జూనియర్స్‌గానే మిగిలిపోకుండా చూడటం కూడా జరుగుతుంటుంది. అఖిల భారత స్థాయిలో సీనియారిటీ జాబితా వారు హైకోర్టులో ఎప్పుడు నియమించబడ్డారన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది. బార్‌కి నేరుగా వచ్చిన వారి విషయంలో సీనియారిటీ నిర్ణయించడానికి వారు పుట్టిన తేదీని పరిగణనలోనికి తీసుకోవడం జరుగుతుంది. ఒకే రోజు ఒకటి కన్నా ఎక్కువమంది సుప్రీం కోర్టుకు నియమించబడి ఉంటే ముందు హైకోర్టులో ఎవరు చేరారన్న దానిపై సీనియారిటీపై నిర్ణయం తీసుకోడం జరుగుతుంది. అందువలన జస్టిస్ జోసెఫ్ పేరు పక్కన పెట్టి, ఇందు మల్హోత్రా పేరును మాత్రమే పరిగణనలోనికి తీసుకోవడం కేవలం అనౌచిత్యమే. కొలీజియం జస్టిస్ జోసెఫ్, ఒక్క ఇందు మల్హోత్రానే కాక భారత దేశంలోని మిగిలిన అందరు సీనియర్ జడ్జిలకన్నా కూడా ముందుండాలని అభిప్రాయపడింది. ముందు ముందు అతనికి పదోన్నతి కల్పించటానికి ఇది ఉపయోగపడవచ్చు. అంతేకాదు, ముఖ్యంగా నియామకాల ప్రక్రియలో కేంద్రం నిర్ణయాన్ని



సుప్రీంకోర్టు కొలీజియం సభ్యులు

కొలీజియం తిరస్కరించగలదన్న సంకేతాన్ని ఇది ఇస్తుంది. న్యాయ, పరిపాలనా విభాగాలు వేరువేరుగా ఉండాలని, అప్పుడే న్యాయవ్యవస్థ స్వతంత్రత కాపాడబడుతుందని, అదే రాజ్యాంగం మౌలిక స్వభావమని కొలీజియం అభిప్రాయపడింది. ఏప్రిల్ 27వ తేదీ ఇందు మల్హోత్రా చేత ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. నిజానికి ఏప్రిల్ 26వ తేదీ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, డివై చంద్రచూడ్ ధర్మాసనానికి 100 మంది న్యాయవాదులు ఇందు మల్హోత్రా ప్రమాణ స్వీకారాన్ని నిలిపివేయమని పిటిషన్ పెట్టుకున్నారు. అయితే ఈ రకంగా ఎంపిక చేసినవారి పేర్లను వేరుచేసి ప్రమాణ స్వీకారం చేయించడంలో తప్పులేదని, అందువలన ఉన్న ఖాళీలు కొంతవర కన్నా భర్తీ అవుతాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కొలీజియం ఎంపికచేసిన జడ్జిలను కేంద్రం తిప్పిపంపవచ్చా అన్న విషయంలో సుప్రీం కోర్టు ఏమాత్రం తొందరపడలేదు. మరో రోజుకి వాయిదా వేసింది. అయితే ఇందు మల్హోత్రా ప్రమాణస్వీకారాన్ని కూడా ఆపలేదు.


### ప్రాధాన్యత సీనియారిటీకా లేక అర్హతకా

జస్టిస్ జోసెఫ్ పేరును అఖిలభారత జాబితాలో 42వ వ్యక్తిగా ఉండాలని, వివిధ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తులు 11 మంది అయన కన్నా సీనియర్లగా ఉన్నారు అని కేంద్రం అంటున్నది. సంబంధిత హై కోర్టుల నుండి సుప్రీంకోర్టుకు ప్రాతినిధ్యం తగినంతగా ఉండడం, హై కోర్టులలో ప్రధాన న్యాయమూర్తిని నియమించడంలో ఆయా రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అందువలన అఖిల భారతస్థాయి సీనియర్ జడ్జీలకు ఈ ఎంపిక ప్రక్రియ నష్టం కలిగించే విధంగా ఉండకూడదు. కేరళ హైకోర్టుకి 47 మంది జడ్జీలను అనుమతించడం జరిగింది. అక్కడి వారికి సుప్రీంకోర్టులో కూడా తగిన ప్రాతినిధ్యం ఉంది. హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తులుగా కూడా తగినంతమంది ఉన్నారు. “ఇప్పుడు మరో కేరళ హైకోర్టు జడ్జిని సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించడం సమంజసంగా లేదు. ఇది మరెందరో హైకోర్టు న్యాయమూర్తుల న్యాయమైన హక్కుకు భంగం కలిగిస్తుంది. అంతే కాక అనేకమంది ప్రధాన న్యాయమూర్తి కావాలనుకునే సీనియర్ జడ్జీల ఆశలను నీరుగారుస్తుంది” అని కేంద్రం తన అభ్యంతరాన్ని వివరించింది. థర్డ్ జడ్జెస్ కేస్ (1998)లో భారత దేశ రాష్ట్రపతి సుప్రీంకోర్టుని సంప్రదించిన కేసులో, సుప్రీంకోర్టు ఆర్టికల్ 143ను ఉటంకిస్తూ ఇచ్చిన సమాధానాన్ని కేం ద్రం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. “చెప్పదలచుకున్నదేమంటే హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు సుప్రీం కోర్టుకి ఎంపిక కావాలని ఆశించడం అతిసహజం. దీనిని భారతదేశ అత్యున్నత న్యాయ నిర్ణయసంస్థ కొలీజియం కూడా దృష్టిలో పెట్టుకోవాలి.” జస్టిస్ జోసెఫ్ మిగిలిన అందరు హైకోర్టు జడ్జీలకన్నా అన్నిరకాల గానూ సుప్రీంకోర్టుకి నియమించిబడడానికి అర్హుడని కొలీజియం అభిప్రాయం పడింది. అది జస్టిస్

> **❝ భారత దేశంలోని సుప్రీంకోర్టులో ఈ సామాజిక వైవిధ్యం లేకపోవడం వలన జడ్జీలు తీర్పులను చెప్పేటప్పుడు చాలాసార్లు న్యాయం ఉల్లంఘించ బడింది. డాక్టర్ సుభాష్ కాశీనాథ్ మహాజన్ వెర్సస్ స్టేట్ అఫ్ మహారాష్ట్ర కేసులో ఇద్దరు జడ్జీలు మార్చి 20వ తేదీ ఇచ్చిన తీర్పులో, జడ్జీలకు ఎస్‌సి, ఎస్‌టి (ప్రివెన్షన్ అఫ్ ఆట్రాసి టీస్)చట్టం 1989ని నీరుగార్చటం తప్పనిపించలేదు.❞**

నియామకాన్ని సమర్ధించాడనికి (1998) మూడవ జడ్జి కేసును ఉటంకించింది. అందులో "అసాధారణ ప్రతిభ ఉన్న వ్యక్తి అఖిల భారత సీనియారిటీ లేక పోయినా అతను పనిచేసున్న హైకోర్టులో సీనియారిటీ లేకపోయినా కూడా అతని ప్రతిభ ఆధారంగా అతని నియామకాన్ని సిఫారసు చేయవచ్చు." కేంద్రం అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈతీర్పులోని అంశాన్ని పరిగణలోనికి తీసుకోలేదు. కేంద్రం చట్టాన్ని అపార్ధం చేసుకో వడం వలననే జస్టిస్ జోసెఫ్ నియామకాన్ని తిరిగి పరిశీలించమని సిఫారసు చేసింది.

కొలీజియం పరిగణనలోనికి తీసుకున్న సామాజిక, భౌగోళిక ప్రాతినిధ్యం అంశాలను కేంద్రం సరయిన దఋక్పథం నుండి చూడలేదు. సీనియారిటీ ఓ తికమక పెట్టే సమస్య. సుప్రీం కోర్టుకి ఒక ప్రధాన న్యాయమూర్తి, 30 మంది అంతకంటే తక్కువ హోదా కలిగిన న్యాయ మూర్తులు మంజూరు చేయబడ్డారు. సుప్రీంకోర్టు జడ్జీల నియామకానికి మూడు విషయాలను పరిగణన లోనికి తీసుకుంటారు. మొదటిది ఆ వ్యక్తి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ హై కోర్టులలో కనీసం 5 సంవత్సరాలు ఏకధాటిన జడ్జిగా పనిచేసి ఉండాలి. రెండవది, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ హైకోర్టులలో 10 సంవత్స రాలు ఏకధాటిగా అడ్వొకేట్‌గా పనిచేసిఉండాలి. సాధారణంగా ఏదో ఒక రాష్ట్ర హైకోర్టు పరిపా లన విభాగంలోని రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో చేరి, సుప్రీంకోర్టులో న్యాయాధికారిగా పనిచేయడం కూడా ఈ కేటగిరి కిందికే వస్తుంది. మూడో కేటగిరిలో భారత రాష్ట్రపతి అత్యంత ప్రతిభా వంతుడని భావించిన వారిని కూడా సుప్రీం కోర్టులో నియమించడం జరుగుతుంది. ఇప్పటికి మొదటి రెండు విధానాలనే అవలంభిస్తున్నారు గాని మూడో విధానం జోలికి వెళ్ళలేదు. జస్టిస్ ఉపేంద్రబక్షి ఒకసారి "ఇప్పటి వరకు భారతదేశ రాష్ట్రపతిగా నియమితులైన వారికి కంచుకా



సుప్రీం న్యాయమూర్తి కెఎం జోసెఫ్

గడా పెట్టి వెతికినా సుప్రీంకోర్టుకి నియమించ తగిన న్యాయమూర్తి ఒక్కరు కూడా దొరకలేదు." అని అన్నారు.

భారతదేశంలో 24 హైకోర్టులు ఉన్నాయి, కొలీజియం అతున్నత న్యాయస్థానానికి జడ్జీలను ఎంపిక చేసే క్రమంలో ఏఒక్క రాష్ట్రానికి ఎక్కువ ప్రాతినిధ్యం ఇవ్వకూడదని అదేసమయంలో ఏఒక్క రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకుండా ఉండ కూడదన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకునే నియా మకానికి సిఫారసు చేస్తుంది. సుప్రీంకోర్టు, సెకం డ్ జడ్జెస్ కేసులో (1993), "రాష్ట్రాల హైకోర్టు లలో వారికి అక్కడ ఉన్న జడ్జీల సీనియారిటీ, భారతదేశం మొత్తంమీద వారికున్న సీనియారి టీకి ప్రాధాన్యత ఉందన్నది వాస్తవం" అని చెప్పింది. ఉదాహ రణకి జస్టిస్ జోసెఫ్ కేరళ హై కోర్టులో అత్యంత సీనియర్ జడ్జి. కానీ అఖిల భారతస్థాయిలో అయన 42వ స్థానంలో ఉన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల మొట్టమొదటి నియామకం తేదీని గనక పరిగణన లోనికి తీసుకుంటే జస్టిస్ జోసెఫ్ కన్నా ముందు 11 మంది హైకోర్టు జడ్జీలు నియమించబడ్డారు. కానీ ప్రధాన న్యాయమూర్తిగా నియమించబడిన తేదీని గనక పరిగణించినట్లయితే జస్టిస్ జోసెఫ్ అందరికంటే సీనియర్. అయితే ఈ సీనియారిటీ అతను సుప్రీం కోర్టుకి ఎన్నిక చేయబడడానికి పరిగణనలోనికి తీసుకోబడదు. ఈ అభిప్రా యంతో ఏకీభవిస్తూ జస్టిస్ ఎస్.ఆర్.పాండ్యన్ "సుప్రీంకోర్టులో జడ్జీల నియామకాలు పూర్తిగా ప్రతిభ ఆధారంగానే జరగాలి. అయినప్పటికీ సమాజంలోని అన్ని తరగతుల ప్రజలకు ప్రాతి నిధ్యం ఉండేలాగా చూసుకోవలసిన అవసరం కూడా ఉన్నది. ఏంతో అభివృద్ధి చెందిన అమెరికా, ఇంగ్లాండ్ దేశాలలో కూడా ప్రాంతం, సామాజిక తరగతి, జాతి మొదలయిన వాటికి నియామకాలలో ప్రాధాన్యత ఉంటుంది. అయితే అదే సమయంలో ప్రతిభకు ఏ మాత్రం విలువ తగ్గదు. ఈ వైవిధ్యం ఎందుకు అంత ముఖ్యమైనది? కోర్టులు సంక్లిష్ట, సామాజిక, చట్టపరమైన సమస్యలను ఎదుర్కొనేటప్పుడు ప్రజాతంత్ర దేశంలోని అత్యున్నత న్యాయ స్థానంలో విశాలమైన దృక్పధం ఉన్నవారి అవ సరం ఉంటుంది. అమెరికా అత్యున్నత న్యాయ మూర్తి ఒలివర్ వెన్డేల్ హోమ్స్ జూనియర్, జస్టిస్ వి ఆర్ కృష్ణయ్యర్ మాటల్లో "సమస్య అతి చిన్నదిగా కన్పించి, దాని ప్రభావం ప్రజల జీవితాలపై, స్వేచ్ఛపై అత్యధికంగా ఉన్నట్టయితే చట్టాలకన్నా ఉన్నతంగా మానవత్వాన్ని పరిగ ణించవలసి వస్తుంది" జడ్జీలు తమ తీర్పులను వెలువరించే సమయంలో వారి తాత్విక దఋష్టి లేదా వారి పక్షపాత బుద్ధి ప్రభావం వారిచ్చే తీర్పులపై పడే అవకాశం ఉండడం వలన జడ్జీల ఎంపికలో వైవిధ్యం ఉండవలసిన అవసరం ఉ ంది. హొమ్స్ మాటల్లో "జీవితాలు తర్కాల ప్రకారం నడవవు. అదే మన అనుభవం. కాలానుగుణంగాను, అప్పుడున్న నైతిక విలువల ఆధారంగాను, రాజకీయ సిద్ధాంతాలకు అనుగు ణంగాను, అక్కడున్న వాస్తవ పరిస్థితులకు అనుగుణంగాను, తెలిసో తెలియకో, జడ్జిలు కూడా తమతోటి వారిలో ఉన్న పక్షపాత ఆలో చనలను పంచుకోవడానికి అవకాశాలు ఉ ంటాయి. తీర్పులు చెప్పేటప్పుడు కేవలం చట్టం యొక్క అక్షరరూపానికే ప్రాధాన్యత నివ్వడం కంటే మనుషులుగా నడవాల్సిన మార్గాన్ని అను సరించ వలసిన అవసరం ఉంటుంది." భారత దేశంలోని సుప్రీంకోర్టులో ఈ సామాజిక వైవిధ్యం లేకపోవడం వలన జడ్జీలు తీర్పులను చెప్పేటప్పుడు చాలాసార్లు న్యాయం ఉల్లంఘించ బడింది. డాక్టర్ సుభాష్ కాశీనాథ్ మహాజన్ వెర్సస్ స్టేట్ అఫ్ మహారాష్ట్ర కేసులో ఇద్దరు జడ్జీలు మార్చి 20వ తేదీ ఇచ్చిన తీర్పులో, జడ్జీలకు ఎస్‌సి, ఎస్‌టి (ప్రివెన్షన్ అఫ్ ఆట్రాసి టీస్)చట్టం 1989ని నీరుగార్చటం తప్పని పించలేదు. కోర్టులో గనక అన్ని సామాజిక తరగతులకు తగినంత ప్రాధాన్యత ఉండి ఉ ంటే ఈ రకమయిన తీర్పు వచ్చి ఉండేది కాదు.

ప్రాంతీయ వైవిధ్యాలు, సుప్రీంకోర్టులో వివిధ ప్రాంతాలలోని హైకోర్టుల ప్రాతినిధ్యానికి భంగం కలగకుండా, అదేసమయంలో విలువలకు తిలోదకాలు ఇవ్వకుండా ఎలా సమతూకాన్ని పాటించగలం? ఈ కింది ఉదాహరణలో దీనిని బాగా వివరించగలం. బొంబాయి హైకోర్టులో 75 మంది జడ్జీలు ఉన్నారు. అందువలన వారికి ఎప్పుడూ సుప్రీం కోర్టులో ప్రాతినిధ్యం ఉంటుంది. అక్కడ ప్రతిభావంతులు కూడా అత్యధికంగా ఉన్నారు. ఇప్పటికి ఎన్నికయిన 45 మంది ప్రధాన న్యాయమూర్తులతో 8 మంది ఇక్కడి నుండి వెళ్లినవారే. వారందరూ ప్రతిభావంతులు. ప్రధాన న్యాయమూరులుగా, లేదా హైకోర్టు జడ్జిలలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన వారే. హైకోర్టులలో ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన వారిలో ముగ్గురు– పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వాజిఫ్దార్, అలాహాబాద్ ప్రధాన న్యాయమూర్తి భోంస్లే, బంబాయి హైకోర్టు తాత్కాలిక ప్రధానన్యాయమూర్తి వి కె తాహిర్ రమణి – ఇక్కడి వారే. వారు 2001లో హైకోర్టు జడ్జీలుగా నియమితులయ్యారు. అంటే 2004లో నియమించబడిన జడ్జి జోసెఫ్ కన్నా సీనియర్లు. అయితే జోసెఫ్‌ను సుప్రీంకోర్టుకు సిఫారసు చేయడంలో ఔచిత్యమేమిటి? ప్రస్తుతం సుప్రీంకోర్టులో బంబాయి హైకోర్టు నుండి వెళ్లిన ముగ్గురు న్యాయమూర్తులున్నారు. వారు, జస్టిస్ ఎస్ ఏ బబ్డే, ఏ ఎం ఖన్విల్కర్, డి వై చంద్రచూడ్. వీరిలో జస్టిస్ బబ్డే, చంద్రచూడ్ వారి సీనియారిటీ ప్రకారం లేదా ప్రధాన న్యాయమూర్తి రిటైర్ అయ్యే తేదీలను పరిగణలోనికి తీసుకుంటే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపిక కాబడే వరుసలో ఉన్నారు. అందువలన ఇప్పటికే ఉన్న 24 మంది జడ్జిలలో బొంబాయి హైకోర్టు నుండి ముగ్గురు న్యాయమూర్తులు ఉన్నందువలన మరొకరిని కూడా బంబాయి హైకోర్టు నుండే నియమిస్తే ప్రాంతీయ సమతుల్యతను కాపాడటానికి దోహదం చేయదు.

కొన్ని హైకోర్టులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో ప్రాతినిధ్యమే లేదన్నది జోసెఫ్ పేరును తిప్పి పంపడానికి మరో కారణంగా కేంద్రం చెపుతున్నది. కలకత్తా, ఛత్తీస్ ఘర్, గుజరాత్, రాజస్థాన్, జార్ఖండ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, ఇంకా కొన్ని చిన్న రాష్ట్రాలు సిక్కిం, మణిపూర్, మేఘాలయాలు సుప్రీం కోర్టులో ప్రాతినిధ్యం లేని రాష్ట్రాలు. ఇందుకు కారణాలు అనేకం. రాజస్థాన్ హైకోర్టు నుండి ఎంపికయిన

> **"ఎస్‌సి, ఎస్‌టిలకు సుప్రీంకోర్టులో చాలాకాలం నుండి ప్రాతినిధ్యం లేకుండాపోయింది" అంటూ గోల చేసింది. భారతదేశ జనాభాలో ఎస్‌సి, ఎస్‌టిలు 25% ఉంటారు. ప్రస్తుతం ఉన్న 24 హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులలోగాని, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తులలో గాని ఒక్కరు కూడా ఎస్‌సి, ఎస్‌టికి చెందిన వారు లేరు."**



అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న సుప్రీం న్యాయమూర్తులు

దినేష్ మహేశ్వరి కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. అయన 2016 ఫిబ్రవరి 24వ తేదీ నియమించిబడ్డారు. అంటే జస్టిస్ జోసెఫ్ ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తిగా నియమించబడిన రెండు సంవత్సరాల తరువాత అన్నమాట. కానీ జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ జోసెఫ్ కన్నా అఖిల భారతస్థాయిలో సీనియర్.. అయినా జస్టిస్ జోసెఫ్ పేరునే కొలీజియం ఉన్నత అర్హతల ప్రాతిపదికన ఎంపిక చేసి ప్రమాణ స్వీకారం చేయించింది. జస్టిస్ మహేశ్వరిని, జస్టిస్ జోసెఫ్‌ని కూడా ఒకే సారి ఎంపిక చేసిఉంటే జస్టిస్ జోసెఫ్‌ని మహేశ్వరి కన్నా ముందు సీనియారిటీ లిస్ట్‌లో పెట్టలేదు. జస్టిస్ జోసెఫ్ సుప్రీం కోర్టులో ముందుగా నియమించబడి ప్రమాణస్వీకారం చేసి ఉంటే కూడా అఖిల భారత సీనియారిటీలో అతని స్థానం మార్చివేయబడవచ్చు. జారండ్ హైకోర్టు జడ్జీలు ఎవ్వరూ ఇప్పుడు ఏ హైకోర్టులోనూ ప్రధాన న్యాయమూర్తిగా లేరు. నిజానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అవ్వడానికి ముందు హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా ఉండాలని నియమం ఏమి లేక పోయినా ఆచరణలో హైకోర్టు న్యాయమూర్తులు ముందుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులై, ఆ తరువాత సుప్రీం కోర్టుకు ఎంపిక చేయబడ తారు.

జార్ఖండ్ ఒక చిన్న రాష్ట్రం. అక్కడ హై కోర్టులో 25 మంది జడ్జీలు మాత్రమే ఉన్నారు. 2000లలో హైకోర్టు స్థాపించిన నాటి నుండి అక్కడి వారు ఎవరూ ఏ హైకోర్టులకు ప్రధాన న్యాయ మూర్తులు కాలేదు. ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాతి నిధ్యం కొలీజియంకి వ్రాసిన ఉత్తరంలో కేంద్రం "ఎస్‌సి, ఎస్‌టిలకు సుప్రీంకోర్టులో చాలాకాలం నుండి ప్రాతినిధ్యం లేకుండా పోయింది"అంటూ గోల చేసింది. భారతదేశ జనాభాలో ఎస్ సి, ఎస్ టిలు 25% ఉంటారు. ప్రస్తుతం ఉన్న 24 హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులలో గాని, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తులలో గాని ఒక్కరు కూడా ఎస్ సి, ఎస్ టి కి చెందిన వారు లేరు. భారత రాజ్యాంగంలో సామాజిక చట్టపరమయిన సంస్కరణలకు, సకారాత్మక చర్యలకు స్థానం ఉంది. రాజ్యాంగం కల్పించిన ఈ విలువలను ఏ తరగతులలో అమలు పరచాలో, ఆ చారిత్రికంగా వివక్షతకు గురైన తరగతులకు మాత్రం అమలు జరిపే చర్యలు తీసుకునే చోట స్థానం లేదు. పార్లమెంటరి స్టాండింగ్ కమిటీ, "చట్టం న్యాయం అమలు, న్యాయస్థానం యొక్క సామాజిక తాత్వి కతపై ఆధారపడి ఉంటుంది. సామాజిక తాత్వి కతను న్యాయనిర్ణేతల సామాజిక మూలాల నుండి

(మిగతా 31వ పేజీలో)

# సావర్కర్ 'వీరత్వం'

ఏ.జి. నూరాని



రచయిత విశ్రాంత న్యాయమూర్తి

"సాధికారిక మైన చేదు వాస్తవాలు ఒక్కొక్కటీ వెలుగులు చిమ్ముతూ ఎగసిపడుతున్నా కూడా అతను ఏమాత్రం సిగ్గుపడడు" అన్నదో పాత సామెత. సావర్కర్ విషయంలో జరిగిందిదే. నమోదు చేయబడ్డ ప్రతి విషయంలోనూ అయన చేసిన మోసం, చూపిన వైషమ్యం, హత్యల పథక రచనల వ్యసనం బయటపడుతున్నాయి. ఆయన 1966లో కన్నుమూశారు. ఆ తరువాతి సంవత్సరం గోపాల్ గాడ్సే, గాంధీని చంపిన నాథురాం గోడ్సే అన్న తమ్ముడు, అతనితోసహా నిందితుడు, "గాంధీ హత్య–నేను" అని ఓ పుస్తకం వ్రాసారు. అందులో గాంధీ హత్యకు సంబంధించిన కేసులోనాథురాంకి సావర్కర్‌కి ఏ సంబంధం లేదని చెప్పడానికి ఏంతో కష్టపడ్డట్టు చెప్పుకున్నారు. సెషన్స్ జడ్జి సావర్కర్‌ని శిక్షించేందుకు సరిపడా సాక్ష్యాలు లేవని విడుదల చేసారు. అప్రువర్‌గా మారిన బాగ్డే ఇచ్చిన సాక్ష్యం పూర్తిగా నమ్మి ఆధారపడడానికి అవకాశం ఉన్నా చట్టరీత్యా స్వతంత్ర ధ్రువీకరణ అవసరం ఉన్నందువలన సావర్కర్ విడుదల చేయబడ్డారు. సావర్కర్ వ్యక్తిగత రక్షకుడు అయిన అప్ప రామచంద్ర కేసర్, ఆయన కార్యదర్శి గజానన విష్ణు డంబెల్, కోర్టులో సావర్కారుకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పలేదు. వారు సావర్కర్ చనిపోయిన తరువాత మాత్రమే జస్టిస్ కపూర్ ముందు నిజం ఒప్పుకున్నారు. సావర్కర్‌కి వ్యతిరేకంగా ఎన్నో సాక్ష్యాలు ఉన్నప్పటికీ అవి కోర్టుకు అందుబాటులో లేవు.

1975లో భారతదేశ ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ ప్రాచీన దస్తావేజుల ఆధారంగా ఒక పుస్తకాన్ని ప్రచురించింది. దీనిని పీనల్ సెటిల్మెంట్స్ అనే పేరుతో ఆర్ సి మజుందార్ అనే చరిత్రకారుడు వ్రాసారు. అయన హిందూ మత పక్షపాతి. అయన చరిత్రను వీలయినంత ఎక్కువగా సావర్కర్‌కి అనుగుణంగా మలిచారు. అయితే పత్రాల ఆధారాలు ఉన్నచోట నిస్సహాయుడయ్యారు. వెలుగుచూసిన పత్రాలు వీర్ సావర్కర్ వీరత్వాన్ని పూర్తిగా బహిర్గతం చేసాయి. ప్రస్తుత సంఘ్ పరివార్ సావర్కర్ గుర్తింపు తమ గుర్తింపుగా చూసుకుంటున్నా, సావర్కర్ అతని జీవిత కాలంలో అప్పటి ప్రభువులకు ఎన్నెన్ని క్షమాభిక్షలకు అభ్యర్థనలు పంపారో, ఎన్ని రకాలుగా పూచికత్తుపై విడుదల కావడానికి ప్రయత్నాలు చేసారో మొదటిసారిగా ఆ పత్రాలే బహిర్గతం చేసాయి. నిజానికి ఈ నాటికీ అతనిలో సంఘ్ పరివార్ తమ భావాలను, విలువలను ప్రతిబింబించగల ఒక మూర్తిని చూసుకుంటున్నారు.

భారతదేశ ప్రజల ఆకాంక్షల పట్ల సానుభూతిగా ఉన్న అప్పటి నాసిక్ జిల్లా కలెక్టర్ ఏ టి ఎం జాక్సన్‌ని హత్య చేసినట్టు రుజువు అవ్వడంతో సావర్కర్‌కి శిక్ష ఖరారయింది. సావర్కర్‌ని అండమాన్ జైలుకు 1911లో తరలించారు. సావర్కర్ కుట్ర పన్నిన హత్యలలో ఈ ఒక్క హత్యా కేసులోనే సావర్కర్‌కి శిక్ష పడింది. మిగిలిన మూడు హత్యకేసులలో ఆయన తప్పించుకున్నారు – 1909లో కర్జన్, 1931లో ఎర్నెస్ట్ హొత్సన్‌పై హత్య ప్రయత్నం (బులెట్ ప్రూఫ్ తొడుగుతో రక్షించబడ్డారు), 1948 జనవరి 30న గాంధీపై జరిగిన హత్యయత్నం – ప్రతిసారి హత్యకు ప్రేరేపించేది సావర్కర్, కానీ తుపాకీలు వేరే ఎవరో నొక్కుతారు.

1911–1950 మధ్య కాలంలో సావర్కర్ ఇచ్చిన క్షమా పత్రాలు, పూచీకత్తుల పట్టి ఈ కింద ఇవ్వడం జరిగింది. ఈయన నాలుగు దశాబ్దాల " వీరుని" చరిత్రకు గుర్తుగానే మన పార్లమెంటులో అయన రాజకీయ అనుయాయులు అతను చంపేందుకు పథకం రచించిన ఆ గాంధీకి ఎదురుగా ఈయన చిత్రపటాన్ని పెట్టడం జరిగింది.

1. 1911 జులై4న సావర్కర్ అండమాన్ లోని సెల్యూలర్ జైలుకి తరలించబడ్డారు. ఆరునెలలు తిరగక ముందే అయన క్షమాభిక్షకు దరఖాస్తు చేసుకున్నారు.

2. 1913 అక్టోబర్‌లో వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ హోంమంత్రి సర్. రెజినాల్డ్ క్రడాక్, జైలును సందర్శించినపుడు కలుసుకున్నవారిలో సావర్కర్ కూడా ఉన్నారు. 1913, నవంబర్ 23న ఆయన రాసిన నోట్‌లో సావర్కర్ క్షమాభిక్షను గురించి వ్రాశారు. సావర్కర్ తన రెండో క్షమాభిక్ష పత్రాన్ని 1913 నవంబర్ 14వ తేదీ సమర్పించారు. "ప్రభుత్వం ఏ హోదాలో నన్ను సేవ చేయమన్నా నేను సిద్ధమే. తండ్రి లాంటి ప్రభుత్వ ద్వారాలకు తప్పిపోయిన ఈ కొడుకు మరే విధంగా చేరగలడు..?" అంటూ ప్రాధేయపడ్డారు. "విప్లవవీరుడు", "జాతీయవాది" అయిన సావర్కర్ గురించి క్రడాక్ ఈ విధంగా వ్రాసారు "సావర్కర్ దరఖాస్తు చేసుకున్నది క్షమాభిక్ష కోసం". ఇదే తరహా ఆ తరువాత కాలంలో కూడా కొనసాగింది.

3. 1920 మార్చ్ 22న, సావర్కర్ మద్దతుదారుడు, జి ఎస్ ఖోపర్డే, ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఒక ప్రశ్న లేవ నెత్తారు. అందులో ఇలా ఉంది. "1915లో ఒక సారి 1918లో మరోసారి సావర్కర్, ఆయన అన్న ప్రభుత్వానికి తాము యుద్ధ సమయంలో సైన్యాన్ని సమకూర్చిపెట్టి ప్రభువులకు సేవ చేస్తామని, జైలు నుండి విడుదల అయితే సంస్కరణల బిల్ పాస్ అయిన వెంటనే ఆ చట్టాన్ని విజయవంతం చేసేందుకు, శాంతి నెలకొల్పేందుకు సహకరిస్తామని దరఖాస్తు పెట్టుకున్న మాట నిజం కాదా? హోమ్ సభ్యుడు, సర్ విలియం విన్సన్ట్" కు వినాయక్ దామోదర్ సావర్కర్ నుండి రెండు పిటిషన్లు పోర్ట్ బ్లెయిర్ సూపరింటెండెంట్ ద్వారా అందిన మాట నిజమే – 1914లో ఒకటి 1917లో మరొకటి. మొదటి దానిలో అయన యుద్ధంలో ఏ రకమయిన సేవలు చేయడానికయినా సంసిద్ధతను తెలియచేసి తనకు, మిగిలిన రాజకీయ ఖైదీ లందరికీ కూడా సాధారణ క్షమా భిక్షపెట్టమని అభ్యర్థించారు. రెండో పిటిషన్‌లో కేవలం రెండో విషయానికే పరిమితమయ్యారు. "అంటే 1913తో పాటు 1917లో కూడా క్షమాభిక్షను అభ్యర్థించారు. 1914లో విన్సన్ట్ అన్నది 1913లో పెట్టిన పిటిషన్ గురించే అయి ఉండవచ్చు.

4. 1920 మార్చి 30వ తేదీన మరో క్షమాభిక్ష పత్రం మొదటిసారిగా ప్రచురించ బడింది. ఇది రచయిత ముందు ప్రచురించిన పుస్తకంలో లేదు. ఈ పిటిషన్ అయితే పూర్తిగా యాచించడమే. "ఇక విన్నవించుకోడానికి అవకాశం ఉన్న చివరిసారి ఇదే" అని బెదిరించారు. సావర్కర్ డిసెంట్రీ నుండి అయిదు నెలల క్రింద బాగు పడ్డారని విన్సెన్ట్ వెల్లడించారు. అతని ప్రాణానికి ఏమాత్రం ముప్పు లేదు. అయినా అతను తనను విడుదల చేయడానికి బెదిరించడమే కాదు కొంతమంది ఇతర ఖైదీలను ఉదాహరణగా కూడా చూపారు." అరోబిందో ఘోష్, పోర్ట్ బ్లెయిర్‌లో తీవ్రమయిన హత్యాయత్నం నేరం మోపబడిన వాడు. తనేమో విధేయుడు", "తీవ్రవాది అవడం అటుంచి కనీసం కూర్పట్కిన్, టాల్‌స్టాయ్ లాంటి శాంతి, తాత్వికతకి సంబంధించిన అరాచకవాది కూడా కాదు", ఇంకా ఇలా మొరపెట్టుకున్నాడు "నా గత విప్లవ ధోరణిని గమనించండి – ఇప్పుడేదో క్షమాభిక్ష అడుగుతున్నందువలననే కాదు. చాల ఏళ్ల కిందటే ప్రభుత్వానికి సమర్పించిన (1918, 1914)నా పిటిషన్లలో శ్రీ మోంటేగ్ రూపొందించబోయే రాజ్యాంగానికి నేను కట్టుబడి పనిచేస్తానని, దానికి అండగా ఉంటానని ప్రభుత్వానికి నేను తెలియచేసాను. ఆయన సూచించిన సంస్కరణలు నా ఆలోచనలను, ప్రకటనను మరింతగా ధ్రువపరిచాయి. ఈ మధ్యనే నేను రాజ్యాంగబద్ధంగా ఉంటానని, అభివృద్ధికి కృషి చేస్తానని, బాహాటంగా ప్రకటించాను" ఎందుకయినా మంచిదని మరో మాట కూడా చేర్చారు "నేను రాజ్యాంగం బాటలో నడవడానికి మనస్ఫూర్తిగా ఇష్టపడు తున్నట్టు నిజంగా చెప్తున్నాను. నా చేతనైనంతగా బ్రిటిష్ ప్రభుత్వం యెడల ప్రేమను, గౌరవాన్ని పెంచుకోడానికి ప్రయత్నిస్తానని సవినయంగా మనవి చేస్తున్నాను. మన మధ్య సహకారాన్ని కూడా పెంచుకుందాము. ప్రకటించబడినటు వంటి "రాజ్యాంగం నా హృదయాన్ని గెలుచుకుంది" అదీ అతని జాతీయత !

> **"ఎందుకయినా మంచిదని మరో మాట కూడా చేర్చారు "నేను రాజ్యాంగం బాటలో నడవడానికి మనస్ఫూర్తిగా ఇష్టపడు తున్నట్టు నిజంగా చెప్తున్నాను. నా చేతనైనంతగా బ్రిటిష్ ప్రభుత్వం యెడల ప్రేమను, గౌరవాన్ని పెంచుకోడానికి ప్రయత్నిస్తానని" సవినయంగా మనవి చేస్తున్నాను. మన మధ్య సహకారాన్ని కూడా పెంచుకుందాము. ప్రకటించబడినటు వంటి "రాజ్యాంగం నా హృదయాన్ని గెలుచుకుంది."**


సావర్కర్


గాంధీని హత్యచేసిన గాడ్సే

ముగింపులో సావర్కర్, "ఇకపై ప్రభుత్వం నిర్దిష్టంగా, సహేతుకంగా సూచించినంత కాలం ఏ రకమైన రాజకీయాలలో పాల్గొనక పోవడానికి నేను, నా అన్న సంసిద్ధులుగా ఉన్నాము. ఇది కాక ఇతర ఏ రకమైన ప్రతిజ్ఞను చేయడానికైనా – ఉదాహరణకి ప్రత్యేకంగా ఒక ప్రాంతంలోనే ఉండాలనో, మా విడుదల తరువాత కొంతకాలం వరకు మా కదలికలు పోలీసులకు తెలియచేయాలనో – ఇటువంటి మరే ఇతరమైనవి, రాజ్యం భద్రత దృష్ట్యా అవసరమైన సహేతుకమైన నిబంధనలు ఆమోదించడానికి కూడా నేను, నా అన్న సంసిద్ధులం."

5. ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉంటానని 1924లో ఇచ్చిన మరో పత్రం 1995 ఏప్రిల్7 ఫ్రంట్‌లైన్ పత్రికలో ప్రచురించబడింది. ఇవన్నీ అవమానకరమైన క్షమాపణలు, అసహ్యకరమైన కట్టుబడి ఉంటానన్న హామీలతో నిండి ఉన్నవే.

6. గాంధీ హత్యకి సంబంధించిన అభియోగం నుండి తప్పించుకోడానికి " నేను ఏ రకమయిన మతతత్వ, రాజకీయ కార్యకలాపాలలో ప్రభుత్వం ఆజ్ఞాపించినంత కాలం పనిచేయను" అని1948 ఫిబ్రవరి 22 తేదీ ముంబయి పోలీస్ కమిషనర్‌కి వ్రాసియిచ్చారు.

7. 1950 జులై 13నబొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయవాది ఎం సి ఛాగ్లా, న్యాయవాది పి బి గజేంద్ర గడ్కర్‌కి " ఏ రకమయిన రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనను, బొంబాయిలోని నా ఇంట్లోనే ఒక ఏడాదిపాటు ఉంటాను" అని వ్రాసిచ్చారు. హిందూ మహాసభ అధ్యక్షుడిగా రాజీనామా కూడా చేసారు.


సావర్కర్‌కి వైస్రాయ్ లార్డ్ లైన్లిత్గోకి జరిగిన సంభాషణను మజియో కాసొలరీ ఇలా నమోదు చేసారు. 1930 అక్టోబర్ 9న ఆ "జాతీయ వాది" " మన ప్రయోజనాలు ఇప్పుడు ఒకటే , మనం కలిసి పనిచేద్దాం". ఆ పని చేయడం అన్నది గాంధీకి, కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా అన్న దాంట్లో సందేహం లేదు. ("1930లలో హిందుత్వం యొక్క విదేశీ కలయిక", 2000 జనవరి 22 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లి) అని నమోదు చేసారు.

(ఈ వ్యక్తీకరణలు అతని వారసులను కూడా వెన్నాడుతున్నాయి . ఏ బి వాజ్‌పాయ్ 1992 డిసెంబర్ 5న బాబ్రీ మసీదు కూల్చే సందర్భంలో ఇచ్చిన ప్రసంగం – 2005 ఫిబ్రవరి 28 ఔట్‌లుక్‌లో ప్రచురించబడింది. అలాగే అదేసమయంలో ప్రచురించబడిన మాలోయ్ కఅష్ణధర్ పుస్తకం, ఓపెన్ సీక్రెట్స్‌లో వ్రాసిన ఎల్ కె అద్వానీ యొక్క నేరాల్లో భాగస్వామ్యం ఈ కోవలోవే.) ఈ విషయాలన్నీ బహిర్గతమవుతున్న కొద్దీ వారు సిగ్గుతో కుంచించుకు పోక తప్పదు.

**అనువాదం: కందికుప్ప ఉషారాణి**

**విశ్లేషణ**

# అనాగరికత, క్రూరత్వంవైపు తిరోగమనం



రచయిత ప్రముఖ సామాజిక కార్యకర్త

**ఆనంద తెల్‌తుమ్బ్డే**

మహారాష్ట్ర మాజీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ప్రస్తుత మానవవనరుల అభివృద్ధి శాఖ స్టేట్ మంత్రి అయిన సత్యపాల్ సింగ్ (ఉన్నత విద్యాశాఖ బాధ్యులు కూడ) చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పని బహిరంగ ప్రకటన చేయడం ద్వారా ప్రాచుర్యం లోకి వచ్చారు. కాని, జమ్మూకాశ్మీర్‌లోని కతువాలో సంఘ్‌పరివార్ అనుయాయుల ప్రవర్తన చూసిన తరువాత సత్యపాల్ సింగ్ చెప్పింది నిజమైవుంటుందని భావించినవారిని క్షమించవచ్చు. ఎనిమిది సంవత్సరాల బాలికను ఒక గుడిలో ఐదురోజుల పాటు ఆహారం లేకుండా బంధించి మూకుమ్మడి లైంగిక అత్యాచారం చేశారు. ఆ తరువాత అతి కృరంగా చంపి అడవిలో విసిరివేశారు. ఆ పాప ముస్లిం బకరవాలా తెగకు చెందినది. బకర్‌వాల్ తెగవారిని భయాందోళనలకు గురి చేసి ఆ ప్రాంతం నుండి తరిమి వేయడానికి వారు ఇదంతా చేశారు. ఇది ఈ భూమి మీద మానవ పరిణామ వాదం పై నమ్మకం కలిగిన వారి నందరిని ఒక్కసారిగా తొట్రుపడి సిగ్గుపడేలా చేసింది. దీని తరువాత జమ్ము న్యాయవాదుల సంఘానికి చెందిన హిందూ ఐక్యతామంచ్, ఇతర సంఘపరివారపు అనుబంధ ముఠాల సభ్యులు బా.జ.పా మంత్రుల సారధ్యంలో నిందితులకు మద్దతుగా జాతీయ జెండాతో ఊరేగింపు నిర్వహించారు. డార్విన్ తప్పని చెప్పడానికి ఇంతకన్నా రుజువు ఏమికావాలి! – సుదీర్ఘమైన పరిణామం తరువాత, మానవదేహాలలోని మనుషులు క్రూర మృగాలకంటే హేయంగా, అనాగరికంగా మారకుండా ఎలా ఉండగలరు. దీనితో యధాతథంగా పోల్చరానివైనప్పటికి ఇటువంటి ఘటనలు అనేకం ఉన్నాయి. ఇవి మనం ఇప్పటి వరకు సాధించామని చెప్పుకొనే ప్రగతి తిరోగమనమైందన్న దానికి గుర్తుగా మిగులుతాయి.

**ఘటనలతో నిండిన ఏప్రిల్**

మన కాలపు చెరగని గుర్తులుగా గత నెలలో వీక్షించిన పెద్ద సంఖ్యలోని పరిణామాలు మరింత గాఢమైన నిరాశను, విషాదాన్ని కలిగించాయి. జనవరిలో జరిగిన 8 సంవత్సరాల పసిబాలిక హృదయ విధారకగాథ వెలుగు చూడటం, హిందూత్వ దురభిమానులు నిందితులకు మద్దతుగా బహిరంగ ప్రదర్శనలు చేయటం జరిగాయి. ఆ సందర్భంగానే మరొక దుఃఖదాయకమైన కథ, 17 సంవత్సరాల బాలికను ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావో నియోజక వర్గపు భాజపా ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ సెంగార్ జనవరి 4, 2017న అత్యాచారం చేసినట్లు కధనం వెలుగు చూసింది. బాధితురాలి కధనం మేరకు ఆ తరువాత అతని అనుచరులు ముగ్గురు ఆమెను ఎత్తుకుపోయి తొమ్మిది రోజులపాటు సామూహిక అత్యాచారం చేసినట్లు తెలిపింది. ఏప్రిల్ 9, 2018 తేది ఆమె ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నివాసం ఎదురుగా నిప్పంటిచుకొని ఆత్మహత్యాప్రయత్నం చేయడంతో ఈ ఉదంతం బయటపడింది. ఆరోజు ఆమె తండ్రి న్యాయ నిర్భంధంలో మరణించాడు. అతడు తన ఎఫ్ఐఆర్‌ను వెనుకకు తీసుకోవడానికి నిరాకరించినందుకు ఎమ్మెల్యే సోదరుడు, సెంగార్ యొక్క మద్దతుదారులతో కలిసి అతనిపై కృరంగా దాడి చేశారు. దాడి చేసినవారిని అదుపులోకి తీసుకోకుండా బాధితుల్ని న్యాయ నిర్భంధంలో ఉంచిన కారణంగా అతను తీవ్రమైన గాయాల వలన ప్రాణాలు కోల్పోయాడు. విస్తృతంగా నిరసనలు వెల్లువెత్తిన తరువాత మాత్రమే సెంగార్ పేరుమీద ఎఫ్ఐఆర్ నమోదు చేసి అతనిని అదుపులోకి తీసుకున్నారు.

పసిబాలికలపై జరిగిన ఈ రెండు అత్యాచార ఘటనలు వెలుగుచూసిన తరువాత మాత్రమే కేవలం నాలుగు నెలల పసికందుపై కూడా అత్యాచారం చేసి చంపివేస్తున్న ఎన్నో ఘటనల కధనాలు నిత్యం పత్రికలలో వెల్లువెత్తుతున్నాయి. పౌరసమాజపు క్షుద్రకర్మకాండతో పోటాపోటీగా రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు, నిర్ణయాలు పరంపరగా జతకూడుతున్నాయి. వీటిలో కొన్ని చూసినట్లైతే న్యాయమూర్తి బి. హెచ్‌లోయా అంతు చిక్కని పరిస్థితులు, చీకటి రాజకీయల పూర్వపరంగంలో అకాల మృత్యువాత పడిన దానిపై స్వయంప్రతిపత్తిగల నేరపరిశోధన చేయాలని దాఖలైన అనేక అర్జీలను సుప్రీంకోర్టు ఆగ్రహంతో తిరస్కరించిన ఘటన. నరోదా పాటియా కేసు, 2002 గుజరాత్ అల్లర్లలో 97 మంది ముస్లింల మరణానికి కారణమైన ప్రధాన కుట్రదారుగా ప్రత్యేక న్యాయస్థానం నిర్ధారించిన మాయాకొద్నానిని గుజరాత్ హైకోర్టు ఆ కేసు నుండి విముక్తి కలిగించడం (ఇదే మొదటి విడుదలకాదు): 2002 గుజరాత్ మారణకాండలో భాగస్వాములుగా ఉన్న నేరస్తులందరు విడుదలయ్యారు. బాధితులకు న్యాయం జరగాలని కోరుతున్న వారికి గుర్తుగావున్న తీస్తా సెతల్‌వాద్ వంటివారిపై వేధింపులు కొనసాగుతున్నాయి. 2001 మే 18న జరిగిన మక్కా మసీదు పేలుడులో 9 మంది మరణించగా 58 మంది గాయపడిన ఘటనకు సంబంధించిన కేసులో నిందితులైన స్వామి అసిమానంద మరి నలుగురికి తీవ్రవాద వ్యతిరేక న్యాయస్థానం విముక్తి కలిగించింది. 2002లో గుజరాత్‌లో జరిగిన విధంగానే, కాషాయ తీవ్రవాద చర్యలలో నిందితులు చాలా మంది విడుదలై బయట పడ్డారు. అదే సందర్భంలో డిసెంబరు 31, 2017న విడుదలైన పూణెలోని ఎల్గార్ పరిషత్‌కు సంబంధించిన ఉద్యమకారుల గృహాలపై పోలీసులు దాడి చేశారు.

ఈ దాడులకు ఎల్గార్ పరిషత్‌కు ఏ మాత్రం సంబంధం లేదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్ ప్రకటన చేశారు. ఈ అసత్యాన్ని వెంటనే సోషల్ మీడియా యాక్టివిస్టులు కాఫీలను పంచి పెట్టడం ద్వారా బట్టబయలు చేశారు. ఈ వారెంట్‌లలో భీమ కొరెగావ్ హింసాకాండ స్పష్టంగా ప్రస్తావించబడింది.

నిజానికి ఇవి బీమ కొరెగావ్‌కి సంబంధించిన వైతే, నాగపూర్‌లోని న్యాయవాది సురేంద్ర గాడ్‌వింగ్, ఢిల్లీలోని రోనా విల్‌సన్‌ల నివాసాలపై జరిగిన దాడులను అర్థం చేసుకోవడంలో ఎవరైనా విఫలమవుతారు. ఎందుకంటే వారు ఎల్గార్ పరిషత్ లేదా భీమ కొరెగావ్ అల్లర్లతో ఏ మాత్రం సంబంధం కలిగిన వారు కాదు. తొలి ముద్దాయి శంభాజి బిడే (జనవరి 1, 2018 అల్లర్లదోషి)కు నిర్దోషిగా ఫడ్నవీస్ సర్టిఫికెట్ ఇస్తున్న సందర్భంలోనే ఎల్గార్ పరిషత్‌కు సంబంధించిన లేదా సంబంధం లేనివారిపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి.


**"భాజపా పాలిత రాష్ట్రాలలోని లింగ నిష్పత్తి వ్యత్యాసం కలవరపెట్టే స్థాయిలో దిగజారిపోయింది. హిందువులలోనే అత్యధికంగా బాలికల భ్రూణ హత్యలు జరుగుతున్నాయన్న వాస్తవం 2011లో జరిపిన లాన్‌సెట్ అధ్యయనంలో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలలో కోటి 20 లక్షల బాలికల పిండాలను గర్భవిచ్ఛిత్తి ద్వారా తొలగించారు."**

**అత్యాచార ఘటనలు పెరుగుదల :**

2014 నుండి అత్యాచార ఘటనలు పెరుగుదల తీవ్రంగా ఉంది. జాతీయ నేర నమోదు కార్య నిర్వాహక శాఖ వారి 'భారతదేశంలో నేరాలు' నివేదిక ప్రకారం 2010 నుండి 2016 వరకు ఒక లక్షమందికి అత్యాచార ఘటనల శాతం, వాటి వృద్ధి వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

| సంవత్సరం | అత్యాచారాలు | వృద్ధిరేటు |
|---|---|---|
| 2010 | 22,172 | 3.7 |
| 2011 | 24,201 | 4.1 |
| 2012 | 24,926 | 4.3 |
| 2013 | 33,707 | 5.7 |
| 2014 | 36,735 | 6.1 |
| 2015 | 34,631 | 5.7 |
| 2016 | 38,947 | 6.9 |

లైంగిక అత్యాచారాలు ప్రతి సంవత్సరం స్థిరంగా వృద్ధి చెందడాన్ని ఈ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. యుపిఏ పాలన చివరి సంవత్సరాలలో (2012, 2013) పెరిగిన ఈ సంఖ్య ఆ తరువాత మరింత తీవ్రంగా పెరగడాన్ని సూచిస్తున్నది. యునైటెడ్ ప్రోగ్రసివ్ అలయన్స్, నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్‌ల పాలనలో



ఉన్నావోలో బాలికపై అత్యాచారం చేసిన బిజెపి ఎమ్మెల్యే

మూడు సంవత్సరాల సరాసరి చూసినప్పుడు అది 27,613 మరియు 36,778 గాను, వాటి సాపేక్ష వృద్ధి 4.7 మరియు 6.23 గాను ఉంది. అంటే రెండు సంఖ్యలలోను అత్యాచారాలు వృద్ధి 33 శాతంగా ఉన్నది. కలవరపరిచే ఈ ఎదుగుదల నిర్వివాదమైనది. ఈ పెరుగుదల ఎక్కువగా భాజపా పరిపాలిస్తున్న రాష్ట్రాలలో ఉన్నది. స్త్రీలను మగవారి శృంగార వస్తువుగా చూసే దృక్పథం పాతుకుపోయిన భారతదేశపు పాతకాల భూస్వామ్య భావజాలం దీనికి కారణమా? భాజపా పాలిత రాష్ట్రాలలోని లింగ నిష్పత్తి వ్యత్యాసం కలవరపెట్టే స్థాయిలో దిగజారిపోయింది. హిందువులలోనే అత్యధికంగా బాలికల భ్రూణ హత్యలు జరుగుతున్నాయన్న వాస్తవం 2011లో జరిపిన లాన్‌సెట్ అధ్యయనంలో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలలో కోటి 20 లక్షల బాలికల పిండాలను గర్భవిచ్ఛిత్తి ద్వారా తొలగించారు.

లైంగిక అత్యాచారాలలో నిందితులుగా ఉన్నవారిలో అధిక సంఖ్యాకులు భాజపా నాయకులు కావడం కలవరపరచే అంశం. 2016, 2017లలో సంఖ్యలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. 32 సంవత్సరాల స్త్రీ హరక సింగ్ రావత్ తనను భాజపా నాయకుడు వెంకటేష్ మౌర్య బలాత్కరించాడని ఫిర్యాదు చేసింది. 2016లో గుజరాత్‌లోని స్థానిక భాజపా నాయకుడు అశోక్ మక్వాన గోవా – అహ్మదాబాద్ మధ్య ప్రయాణించే ఇండిగో విమానంలో 13 సంవత్సరాల బాలికను లైంగికంగా వేధించినందుకు నిర్బంధంలోని తీసుకోవడం జరిగిందని డెక్కన్ క్రానికల్ తెలిపింది. (హిందూ 2016) మధ్యప్రదేశ్‌లో ఒక గిరిజన బాలిక తనపై జరిగిన లైంగిక వేధింపుల ఫిర్యాదును వెనుకకు తీసుకోవడానికి తిరస్కరించిన కారణంగా స్థానిక బిజెపి నాయకుడు, మరి ఐదుగురు అనుచరులు ఆమెను బలవంతంగా ఎత్తుకొని

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

> **"గడిచిన నాలుగు సంవత్సరాల భాజపా పరి పాలన చట్టాన్ని అమలు చేయటంలో, హేతు వాద తార్కికత మరియు శాస్త్రీయ దృక్పథం లేమితో తిరోగమన మార్గంలో ఉన్నది. ప్రజా స్వామ్యం ముందు గెలుపే లక్ష్యంగా చేస్తున్న ప్రభుత్వ ప్రచార కాండ ఏ మాత్రం నిలువలేదు. ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థలన్నీటినీ కాషాయి కరణం చేసే అన్ని ప్రయత్నాలు న్యాయ వ్యవస్థలో జరుగుతున్న అంతర్గత ఘర్షణలు పెరుగుతున్నాయి."**



కతువాలో నిందితుల్ని శిక్షించాలని ఆందోళన చేస్తున్న ప్రజలు

పోయి సామూహికంగా అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. (డక్కన్ క్రానికల్ 2016) భాజపా కార్పొరేటర్ అనీల్ భోశలే, భాజపా విభాగమైన మీరా–భయందర్ ప్రధాన కార్యదర్శి మరియు మునిసిపల్ కార్పొరేషన్ వార్డు కమిటీ చైర్‌పర్సన్‌లు 44 సంవత్సరాల వివాహిత స్త్రీని బలాత్కరించి అసహజమైన శృంగారం నెరిపారన్న ఆరోపణలతో అరెస్ట్ చేయడం జరిగింది. (టైమ్స్ ఆఫ్ ఇండియా 2017) మధ్యప్రదేశ్ మొరెన లోని సుమావలి గ్రామానికి చెందిన దళిత మహిళను బి.పి.యల్ కార్డు పొందడానికి సహాయపడతాయని మభ్యపెట్టి స్థానిక భాజపా నాయకుడు భోజపాల్ సింగ్, అతని ఇద్దరు అనుచరులను సామూహికంగా అత్యాచారం చేసినఆరోపణతో అరెస్ట్ చేయటం పట్టుబడటం జరిగింది. (హిందూస్థాన్ టైమ్స్ 2017). ఢిల్లీ భాజపా మాజి ఎంయల్ఏ విజయ్ జాలీ గూర్ గావ్‌లోని ఒక రిసార్టులో తనతో బలవంతంగా మధ్య త్రాగించి లైంగికంగా అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదు చేయటంతో ఆయనను అరెస్ట్ చేశారు.(ఇండియాటుడే 2017)

గుజరాత్ భాజపా శాసన సభ్యుడు, ప్రైవేటు యాజమాన్యంలోని పారల్ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన జయేష్ పటేల్ 22 సంవత్సరాల నర్సింగ్ విద్యార్థినిని బలత్కరించినందుకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేరాన్ని తగ్గించడానికి ప్రయత్నించినందుకు మరొక అధికారిని అదుపులోకి తీసుకోవడం జరిగింది (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2016). బాధితులైనవారు అధికార బలం కల వారికి వ్యతిరేకంగా నేరారోపణ చేయడం, ఫిర్యాదును నయోదు చేయించటం ఎంత కష్ట తరమో మనకు ఉన్నావో సంఘటన వెల్లడిస్తుంది.

**స్థిరమైన తిరోగమనం :**

గడిచిన నాలుగు సంవత్సరాల భాజపా పరి పాలన చట్టాన్ని అమలు చేయటంలో, హేతు వాద తార్కికత మరియు శాస్త్రీయ దృక్పథం లేమితో తిరోగమన మార్గంలో ఉన్నది. ప్రజా స్వామ్యం ముందు గెలుపే లక్ష్యంగా చేస్తున్న ప్రభుత్వ ప్రచారకాండ ఏ మాత్రం నిలువలేదు. ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థలన్నీటినీ కాషాయి కరణం చేసే అన్ని ప్రయత్నాలు న్యాయ వ్యవస్థలో జరుగుతున్న అంతర్గత ఘర్షణలు పెరుగుతున్నాయి.

ప్రజాస్వామ్య భవిష్యత్తుపై కలవరం కలిగించే పరిణామాల నేపథ్యంలో న్యాయవ్యవస్థ ప్రజల యొక్క చివరి ఆశగా ఉన్నది. మును పెన్నడు లేని విధంగా నలుగురు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయ మూర్తులు ప్రధాన న్యాయ మూర్తి దీపక్ మిశ్రా యొక్క తీరు గురించిపత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడటం దీనికి ఒక ఉదాహరణ. ఇది ప్రధాన న్యాయమూర్తిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ప్రతిపక్షాలు కోరటానికి అవకాశం కల్పించింది. బిజెపి మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు ఆ ప్రతిపాదనను తిరస్కరించాడు. ఆ విధంగా రాజ్యాంగపు నీతి వైశిష్ట్యాలను క్రమ పద్ధతిలో తీవ్రంగా తగ్గించి వేస్తూ, బాబాసాహెబ్ అంబేద్కర్‌ను రాజ్యాంగ రూప శిల్పిగా ప్రక్షేపిస్తూనే క్రమంగా ఒక స్మృతి చిహ్నంగా చేస్తున్నారు. ఆయన గౌరవార్థం ఏప్రిల్ నెలలో 26 ఆలిపూర్ రోడ్డు, ఢిల్లీలో ఒక గొప్ప జాతీయ స్మారక చిహ్నాన్ని ఆవిష్కరించారు. గాబరాపడిన దళితులు అంబేద్కర్‌ను స్మారక చిహ్నంగామార్చి చేసి, క్రూరంగా అణిచివేసేందుకు నిర్ధేశించిందేమోనన్న విభ్రమలో కూరుకుపోయారు. దీనిని హిందూత్వంలో మహిళలను దేవతా విగ్రహాలుగా చేసి పూజిస్తూ నిజమైన మహిళలను అమానవీయ్యమైన స్థాయికి తొక్కి వేయడంతో సమానంగా పోల్చిచూడవచ్చా?

బిజెపి పాలనలో మరో బలిపశువు తార్కికత, హేతువాద శాస్త్రీయ దృక్పథం. దీనిని ప్రోత్సహించ వలసినదిగా రాజ్యాంగంలో ఆదేశించబడింది. ప్రతి బిజెపి నాయకుడు చిన్న పెద్ద వ్యత్యాసం లేకుండా తర్కరహిత వాదనలను ముందుకు తీసుకు పోవడానికి అపారంగా తోడ్పాటు నందించారు. ప్రధాన మంత్రి దానికి తానే ముందు వరసలో ముందు నిలిచారు. ఆయన 2014లో ఏ విధంగా మాట్లాడారో ఒక సారి జ్ఞాప్తికి తెచ్చుకుంటే – భారతదేశానికి మహాభారత కాలంలోనే ప్రత్యుత్పత్తికి సంబంధించిన జెనిటిక్ సాంకేతిక పరిజ్ఞానం, ప్లాస్టిక్ సర్జరి పరిజ్ఞానం ఉన్నాయని తెలిపారు. ఈ మధ్యనే త్రిపుర ముఖ్యమంత్రి విప్లవదేవ్ మహాభారతకాలంలోనే ఇంటర్‌నెట్ ఉన్నదని చెప్పారు. దానిని రాష్ట్ర గవర్నర్ తథాగత్ రాయ్ కూడా బలపరిచారు. రాష్ట్ర గవర్నర్ అంటే జాతి యొక్క ధర్మాధర్మ విచక్షణను పరిరక్షించవలసిన వాడు. మానవుడు ప్రగతి శీలమైన దిశలో పరిణామం చెందుతున్నరన్న డార్విన్ సిద్ధాంతం పట్ల విశ్వాసం కలవారందరికి ఈ నీతిమాలిన తిరోగమనంతో మతితప్పవచ్చు. అందుచేత సత్య పాల్ సింగ్ డార్విన్ సిద్ధాంతం తప్పని చెప్పినప్పుడు అతనే నిజమనిపిస్తుంది!

**అనువాదం : కందుల శశికుమార్**

**ఈ మాసం ప్రత్యేకం**

# తూత్తుకుడిలో ఏం జరిగింది?

**ఇలంగోవన్ రాజశేఖరన్**



రచయిత ప్రముఖ పాత్రికేయులు

**2018**వ సంవత్సరం, మే 22వ తేదీన, తమ ఇల్లు అని పిలవబడే ఒకే ఒక్క గదిముందు నిలబడి "వనిత" తమ ప్రియాతి ప్రియమైన 18 ఏళ్ల తమ బిడ్డ కోసం గుమ్మంలో ఎదురు చూస్తుంది. దక్షిణ తమిళనాడులోని, తూత్తుకుడి పట్టణంలోని జాలర్లు నివసించే ఆ ప్రాంతంలో తమ ఇద్దరు సోదరులతో దూరం నుండే వస్తున్న కూతురు కనిపించింది. స్నోలిన్ స్కూల్ ఫైనల్ బోర్డు అంటే +2, అంతకు వారం రోజుల ముందే ముగించి, న్యాయశాస్త్రంలో డిగ్రీ చదవాలన్న ఆకాంక్షతో అందుకు సమాయత్త మవుతున్నది. జాలర్ల జీవితంలోని అసమానతల పట్ల, సమస్యల పట్ల, స్నోలిన్‌కున్న దృష్టి, వారి స్థితిగతులు బాగు చేయాలన్న తపన వలన ఆ జిల్లా కలెక్టర్ నుండి "స్టెరిలైట్ ఇండస్ట్రీస్" ని మూయించాలన్న వాగ్దానం తీసుకోవడానికి" కలెక్టరేట్‌ని ముట్టడించాలన్న" పిలుపుకు ముందుకు వచ్చింది. ఆ చిన్న పట్టణంలోని "కాపర్ ప్లాంట్" దుష్ఫలితాలు అనుభవిస్తున్న ప్రజలందరినీ పోగుచేసి ర్యాలీకి ప్రోత్సహిం చింది. ఆ క్రమంలో తమ వదిన ఆమె ఎనిమిది నెలల బిడ్డను సైతం పోరాటం కోసం వెంట తీసుకెళ్లింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్దించిన తర్వాత ఏనాడూ "తమిళనాడు" చూడని రీతిగా పోలీసులు తీసుకున్న నిర్ణయం, తత్ఫలిత చర్య వలన పోలీసుల తుపాకులకు "13 మంది" ప్రాణాలు బలయ్యాయి. "ఎంత దారుణంగా కాల్పులు జరిగాయంటే ప్రతిరోజూ ఆమె బుగ్గలపై ముద్దు ఇచ్చేదాన్ని. కనీసం ఆఖరీ వీడ్కోలుగా ఓ ముద్దు ఆమె మొహంపై ఇవ్వడా నికి కూడా వీలులేనంతగా మొహం బుల్లెట్‌ల వలన ఛిద్రమైపోయింది. దేవదూత మొహంలా ఉండే ఆమె వదనం గుర్తుపట్ట వీలు లేనంతగా పగిలిపోయింది"అంటూ వనిత, ఆమె భర్త ఆపు కోలేనంత దు:ఖంతో కన్నీటి పర్యంతమయ్యారు.

చారిత్రాత్మకమైన ఆ చర్చ్ ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు 500మంది ప్రజలు, మహిళలు, పిల్లలతో సహా గుమి గూడారు. ప్లకార్డులు, నిరసన బోర్డులు, చేతితో రాసిన పోస్టర్లు వారు తీసుకున్నారు.. పరిసర గ్రామాల జనాలు సైతం తమ ప్రాంతం నుండే కలెక్టరేట్ వైపు ప్రయాణమయ్యారు. "ఎ కుమారరెడ్డి పురంలోని" స్టెరిలైట్ కంపెనీ గూర్చి 1990 దశకంలో ప్రారంభమైన "స్టెరిలైట్ వ్యతి రేక ఉద్యమం" మరలా పునరుజ్జీవం పొందింది.

1994 వ సంవత్సరంలో ఆనాటి ముఖ్య మంత్రి "జయలలిత" ప్రతిపక్షాల వ్యతిరేకతను ఖాతరు చేయకుండా, "వేదాంత రిసోర్స్" కు (లండన్ స్టాక్ ఎక్స్చేంజ్" వారి స్టెరిలైట్ ఇండస్ట్రీస్ లో భాగం) శంకుస్థాపన చేసింది. ఆనాటి నుండి స్థానిక ప్రజలు కలుషితమైన గాలి, నీటితో ఎన్నెన్నో ఇబ్బందులకు లోనవుతున్నారు. గత రెండు దశాబ్దాలలో ఎన్నోసార్లు ఈ కంపెనీ వివాదాలలో చిక్కుకుంది. వివాదం అన్న పదా నికి పర్యాయపదంగా ఈ కంపెనీ నిలబడటానికి కారణాలు అనేకం. నియమ నిబంధనలను ఉ ల్లఘించడం, ప్రజారోగ్యాన్ని ఖాతరు చేయక పోవడం, అర్ధరాత్రి విషవాయువులను గాలిలోకి వదిలేసి, స్థానికంగా నివసించే నాలుగు లక్షల ప్రజానీకానికి శ్వాసకు ఇబ్బంది కల్గించి, వారి ప్రాణాలతో చెలగాటమాడటం మొదలగునవి.

కుల మతాల కతీతంగా పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రధాన కారణం వారు ఎదుర్కొం టున్న ప్రాణభయం. ఏ క్షణాన తమ కుటుంబ సభ్యులు తమకు శాశ్వతంగా దూరమవుతారే మోనన్న ఆందోళన. నాడార్ "కులానికి చెందిన జ్యోతి కుమార్. తన మిత్రులతో, ఆ రోజు చర్చి ప్రాంతానికి చేరి నిరసనకారులతో కలిశాడు." 2013లో గ్యాస్ లీక్ అయినప్పుడు ఆస్తమా పేషేంట్ అయిన మా నాన్నగారు పడ్డ అవస్థలు సామాన్యం కాదు.. ఊపిరాడక కొట్టుకుంటున్న ఆయనను సమయానికి ఆసుపత్రికి చేర్చడం వలన, డాక్టర్లు ఇచ్చిన చికిత్స వలన ప్రాణా పాయం నుండి బయటపడ్డారు. ఆ సమయంలో మా నాన్నగారు చెప్పిన మాటలు నాకు బాగా జ్ఞాపకం– అదేమంటే 1996 నుండీ స్టెరిలైట్ వ్యతిరేక ఉద్యమాన్ని.. విభజించు పాలించు" పద్ధతిలో నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. స్టెరిలైట్ వ్యతిరేక ఉద్యమాన్ని రెండు భాగాలుగా చూడాలి 1994 నుండి 1999 వరకూ, 2013 వ సంవత్సరం మార్చి 23 తర్వాత అంటే గ్యాస్‌లీక్ వలన పట్టణ ప్రజలు భయభ్రాంతులైన తర్వాత. ప్రస్తుత పోరాటం గత వంద రోజులుగా జరుగు తున్నది. పట్టణంలోని రెండు ప్రధాన వర్గాలు నాడార్లు, జాలర్లు. నాడార్లు వ్యాపార వేత్తలు.. వీరిపురి మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం కులాల ప్రాతిపదికగా జరుగుతుంది. 1996లో జరిగిన అల్లర్లలో ఇరువురు జాలర్లు మరణించడం అంత సులభంగా మరిచిపోగలిగే విషయం కాదు. మా పోరాటం ఉమ్మడిది. అలాగే లక్ష్యం కూడా స్టెరిలైట్ కంపెనీకి వ్యతిరేకం. ఈ పోరాటంలో ఏ ఒక్కరూ కులాల, వర్గాల ప్రాతిపదికన నష్ట పోవడం జరగకూడదు. కలిసే పోరాడుతాం." అంటూ వ్యాపారస్థుల ప్రతినిధి బాహాటంగా ప్రకటించడం పట్టణంలో ప్రజల ఎదుర్కొంటున్న ఉమ్మడి సమస్యకు ప్రతిబింబం.

**ఉత్సవ వాతావరణం :** ప్రజలందరూ కలగలిసి, పట్టణ వీధుల్లో నడుస్తూ క్రమంగా గుంపు పెద్దదవుతూ ర్యాలీగా ప్రశాంతంగా కలెక్టరేట్ వైపు వెళుతున్నది. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లు ఇవ్వడం, మొబైల్ ఫోన్‌ల ద్వారా సమన్వయం చేసుకుంటూ గుంపు లు గుంపులుగా ముందుకెళ్లడం.. నలుమూలల నుండి ప్రజాసమూహం కలెక్టరేట్ వైపు కదలడం అంతా ఓ ఉత్సవ వాతావరణం నెలకొంది. కుటుంబాలతో సహా తరలి రమ్మనడంతో అలాగే వెళ్లాం.

> **❝ తూత్తుకుడి పరిసర ప్రాంత ప్రజలందరూ 100వ రోజు నిరసన సందర్భంగా కలెక్టరేట్‌ని ముట్టడించాలన్న నిర్ణయం ఏనాడో జరిగింది. కులమతాల కతీతంగా, ప్రజలంతా కలగలిసి తీసుకున్న నిర్ణయం. నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడానికి కారణం పోలీసుల చర్యలే. "నిరసన కారులపై పోలీసు కాల్పులు అమానుషం" అంటూ పిటిఐ ప్రకటించింది.❞**

ర్యాలీ శాంతియుతంగా జరిగే నిరసన కార్యక్రమమని కలెక్టర్‌తో మీటింగ్ ముగిసిన తర్వాత వెళ్లిపోవచ్చని నిర్వాహకులు ప్రజలకు ముందే తెలిపారు. భార్యాబిడ్డలతో ఆడపిల్లలు, పసివాళ్లతో కలసి ప్రదర్శన చేస్తున్న మమ్మల్ని హింసను రెచ్చగొట్టటం కోసం వచ్చామని, ఆరోపణలు చేస్తూ హింసాత్మకంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం? ప్రశాంతంగా జరుగుతున్న ర్యాలీపై పోలీసులు దాడిచేసి వాతావరణాన్ని బీభత్సం చేశారు.

కలెక్టరేట్ ఎదుట కాపర్ స్మెల్టర్ ప్లాంట్‌ను మూసివేయవలసినదిగా నిరసనకారుల ర్యాలీని ఆ రోజు ఉదయం కొన్ని తమిళ ఛానల్స్ జరుపుతున్న లైవ్‌లో చూపించాయి. తర్వాత ఏం జరిగిందో తెలియదు. అర్ధంతరంగా ఆపేశాయి. ప్రజల ప్రశ్నలు నిజమయితే రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు చెప్పినట్లు ఆందోళన కారులు నిజంగా, హింసాత్మకంగా వ్యవహరించి ఉంటే, ఎప్పుడు? ఎలా? అన్నవి స్పష్టంగా తెలిసేవి. ఛానల్స్‌తో లైవ్ కొనసాగితే ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తేటతెల్లమయ్యేవి. ప్రశాంతంగా జరుగుతున్న ప్రదర్శనను హింసాత్మకంగా మార్చింది ఎవ్వరో ప్రజలకు అర్థమయ్యేది.

మే 21 వ తేదీన హఠాత్తుగా పట్టణంలో 144 వ సెక్షన్ పెట్టారు. అయితే ఎక్కడ, ఎంత కాలమన్న దానిలో స్పష్టత లేదు. తొలుతగా దక్షిణ ప్రాంతంలోని తూత్తుకుడి పోలీసు స్టేషన్ పరిధిలో, తర్వాత సిప్‌కాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్టారు. ఆ ప్రాంతంలోనే స్టెరిలైట్ ఇండస్ట్రీస్, కలెక్టరేట్ ఉన్నాయి. మే 22వ తేదీన పోలీసుల బృందం ఒకటి తూత్తుకుడి పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలలోని ర్యాలీ నిర్వాహకులను, చెదిరిపోమ్మని, ఆ ప్రాంతాన్ని విడచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. అంతేగాక పట్టణంలో సమావేశమైన వారిని సైతం వెళ్లిపోమ్మని చెప్పారు. కేవలం గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన వారిని మాత్రమే ముందుకు వెళమని అనుమతినిచ్చారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, ప్రజలలో నిర్వాహకుల పట్ల అపనమ్మకాన్ని పెంచడం కోసం, వారి పట్ల ప్రజానీకంలో ఉన్న సంఘీభావాన్ని చెడగొట్టడానికి పోలీసులు పన్నిన పన్నాగంగా" ఓ సీనియర్ న్యాయవాది అన్నారు.

ఈ నియంత్రణల తర్వాత వివిధ ప్రాంతాల నుండి సాగుతున్న ర్యాలీలో పోలీసులకు, ప్రజలకు మధ్య వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇది కేవలం నిరసన ప్రదర్శన మాత్రమేనని, కలెక్టరేట్ చేరిన తర్వాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగవని తెలియజేస్తూనే ఉన్నారు. జిల్లా కలెక్టరు నుండి స్టెరిలైట్ ప్లాంట్‌పై ఓ స్పష్టమైన హామీ తీసుకోవడానికేనని పదేపదే చెప్పాం. కానీ ఫలితం ఇలా అంటూ పోలీసు కాల్పులలో గాయపడిన 26 సంవత్సరాల బ్రిటాన్ తెలిపాడు.

**కలెక్టర్ గైర్హాజరు:**

జిల్లా కలెక్టరు ఎన్. వెంకటేశ్ ఆ రోజు ప్రధాన కార్యాలయమైన కలెక్టరేట్ పట్టణంలో ఎక్కడా ఆచూకీ లేరు. ఓ సీనియర్ రెవెన్యూ అధికారి ఇచ్చిన సమాచారం ప్రకారం, ఆ రోజు కలెక్టర్ "కోవిల్ పట్టి" పట్టణంలో "జమా బంది" అనగా రెవిన్యూ లెక్కలు సరిచూడడం కోసం వెళ్లారు. పోలీసుల ప్రతాపం నిరసనకారులపై చూపుతున్న వేళ 'తూత్తుకుడి'కి 25 కిలోమీటర్ల దూరాన ఉన్న 'ఒట్టపిడారం' గ్రామంలోని పంచాయతీ ఆఫీసులో కలెక్టర్ ఉన్నారు. నిరసన తీవ్రస్థాయిలోనున్నప్పుడు రెండు పక్షాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రంగా ఉన్నప్పుడు కల్టెకరు వ్యవహరించిన తీరు అది.

తూత్తుకుడి పరిసర ప్రాంత ప్రజలందరూ 100వ రోజు నిరసన సందర్భంగా కలెక్టరేట్‌ని ముట్టడించాలన్న నిర్ణయం ఏనాడో జరిగింది. కులమతాల కతీతంగా, ప్రజలంతా కలగలిసి తీసుకున్న నిర్ణయం. నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడానికి కారణం పోలీసుల చర్యలే. నిరసనకారులపై పోలీసు కాల్పులు అమానుషం" అంటూ పిటిఐ ప్రకటించింది.

విషయాలు స్పష్టంగా, ముందుగానే తెలిసిన కలెక్టరు ఎన్. వెంకటేష్ ఉద్దేశ్య పూర్వకంగానే జిల్లా హెడ్ క్వార్టర్‌లో లేకుండా పాలనా యంత్రాంగాన్ని రెండు రోజులు పోలీసుల చేతుల్లో వదిలారు. అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ఆధ్వర్యంలోని నలుగురు ఇన్స్‌పెక్టర్ జనరల్స్, (ఐజి) ఇద్దరు డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్స్ (డిఐజి) 15 మంది సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పీఎస్), అడిషినల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి) అందరూ కలిసి పట్టణాని పూర్తి హింసాత్మకంగా మార్చేశారు. తిరునల్వేలి కలెక్టర్ సందీప్ నందూరిని, తూత్తుకుడి కలెక్టర్ వెంకటేశ్ నుండి ఛార్జీ తీసుకొమ్మంటూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన తర్వాత మాత్రమే పరిస్థితి అదుపులోకి వచ్చింది. తూత్తుకుడి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి. మహేంద్రన్‌ని అదే రోజు ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగిందితప్ప, సంఘటన జరిగిన నాడు జిల్లా అధికార యంత్రాంగం, కలెక్టర్, సీనియర్ రెవెన్యూ అధికారులు, జిల్లా రెవెన్యూ ఆఫీసర్లు సబ్‌కలెక్టర్, వీరందరూ ఎందుకు లేరో రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

ప్రాణాలు కోల్పోయిన వారిపట్ల జాలి, ప్రభుత్వ చర్యల పట్ల ప్రజాగ్రహాన్ని చవిచూసిన ఎఐఎడిఎంకె (ఆల్ ఇండియా ద్రవిడ మున్నేడ కగజం" ఆధ్వర్యంలోని ప్రభుత్వం అత్యంత ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టివేయబడింది. వెనువెంటనే మే 28న స్టెరిలైట్ ప్లాంట్‌ని మూసివేయమని ఉత్తర్వులిచ్చింది. "ఫారెస్టు అండ్ ఎన్విరాన్‌మెంట్ డిపార్టుమెంట్" నిబంధనలను అతి క్రమించినందువలన మూసివేత ఉత్తర్వులిచ్చినట్లు పేర్కొంది.

అంతేగాక మరో విషయాన్ని కూడా ప్రకటించింది. అదేమనగా, తమిళనాడు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి సూచనల ప్రకారం మే 23 నాటికే ప్లాంట్‌కున్న ఎలక్ట్రిసిటి సరఫరాను నిలుపుదల చేయమని తెలిపిందని, ఉత్తర్వులు అమలు చేయని కారణంగా 1974 వాటర్ యాక్ట్ సెక్షన్ 18 (1) (బి) ప్రకారం, తమిళనాడు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్లాంట్‌ని మూసివేసినట్లు ప్రకటించింది.

మే 29న జరిగిన అసెంబ్లీ సమావేశంలో "స్పెషల్ కాలింగ్ అటెన్షన్ మోషన్"కు సమాధానం ఇస్తూ ముఖ్యమంత్రి" "ఎడప్పాడి కె.

పళనిస్వామి" అనివార్య పరిస్థితుల వలన పోలీసులు కాల్పులు జరపవలసి వచ్చిందని ప్రకటించారు. అయితే చనిపోయిన 13 మంది పోలీసు కాల్పుల్లో చనిపోయినట్లుగా ఆయన ప్రకటించ లేదు. హాస్పటల్‌లో ఇచ్చిన చికిత్సకు వారి శరీరాల నుండి ప్రతిస్పందన లేకచనిపోయినట్లుగా ప్రకటించారు. మాట వరుసకి కూడా పోలీసుల దుశ్చర్యను ప్రస్తావించని ముఖ్యమంత్రి, ప్రతిపక్షమైన ద్రవిడ మున్నేట్ర కగజం (డిఎంకె)న్ని మాత్రం సంఘ వ్యతిరేక శక్తులుగా దుమ్మెత్తి పోశారు.

వాస్తవానికి ర్యాలీ చేసేవారు, వేరు వేరు ప్రాంతాలను కలెక్టరేట్‌కి బయలుదేరుతున్నప్పుడే, పోలీసులు ఆపే ఆరంభంలో ప్రయత్నం చేయడంతో సమస్య యొక్క సూచనలు ఆరంభమయ్యాయి. ఆరంభంలో పోలీసులకు ప్రజలకు మధ్య వాగ్వివాదాలు, అప్పుడప్పుడూ చెప్పులు విసరడాలతో జరిగాయి. ఎప్పుడైతే కొన్ని ప్రాంతాలతో పోలీసులు లాఠీఛార్జీ ఆరంభిం చారో ప్రజలు రాళ్లు విసరడం చేశారు. నిజానికి పొరపాటు పోలీసులదే. నిరసన కారులను నిజంగా చెదరగొట్టాలనుకుంటే కలెక్టరేట్ వరకూ వారిని రానిచ్చేవారు కాదు. వివిడి సిగ్నల్ జంక్షన్ వద్దగానీ, మాదాతూర్ వద్ద గానీ ఆపేసేవారు. 9కి.మీ రానిచ్చి హింసకు పాల్పడ్డారు అని తెలిపాడు. "వంచినాథన్" స్టెరి లైట్ వ్యతిరేక కమిటీకి లీగల్ ఎడ్వైజర్, "మక్కల్ ఉరిమై పాదుక్కాపు మయ్యాయ్" సంస్థ సభ్యుడు అయిన ఆయనపై రకరకాల సెక్షన్‌ల క్రింద 5 కేసులు రిజిస్టర్ చేయడం జరిగింది.

మరికొన్ని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఉదయం 11 గంటలకు తూత్తుకుడి ఎఎస్‌పి సెల్వనాగరిధినమ్ ఆధ్వర్యంలో వివిడి సిగ్నల్ జంక్షన్ వద్ద లాఠీఛార్జీ జరగడంతో ర్యాలీలో తీవ్ర కలకలం రేగింది. అదే ఆఫీసర్ మధ్యాహ్నం మూడు గంటలకు వివిడి జంక్షన్‌కి మూడు కిలోమీటర్ల దూరాన ఉన్న "థెరెశ్ పూరమ్" వద్ద పోలీసు సమాహారానికి ఫైరింగ్ ఆర్డర్లు ఇవ్వడంతో స్థానికురాలు జె. ఝాన్సీరాణి కాల్పుల్లో మరణించింది. అందువలన నిరసన కారులు ఎస్‌పి క్యాంపు ఆఫీసు ముందు చేరి నిరసన వ్యక్తపరచడం, పోలీసులు కాల్పులు కొనసాగించడం జరిగింది. అదే సమయంలో తిరునల్వేలి బైపాస్ వద్ద ర్యాలి చేస్తున్న ప్రజలపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. లాఠీఛార్జి, భాష్పవాయువు ప్రయోగించారు. కలెక్టరేట్ వైపు వెళతున్న వీరిపై పిల్లలు, మహిళలు అన్న విచక్షణ లేకుండా, దౌర్జన్యం జరగడంతో చాలామందికి గాయాలయ్యాయి.

**"అప్పుడు మాకు కాల్పులు జరుగుతున్న శబ్దాలు వినిపించాయి. వీటి తర్వాత వెనువెంటనే పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీఛార్జీ జరపడం జరిగింది. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేవు. కలెక్టరేట్‌ను నల్లటి పొగలు ఆవరించడం, పక్కనే ఉన్న స్టెరిలైట్ వారి రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ని సైతం పొగలు కమ్మడం చూశాం."**



**తూత్తుకుడిలో స్టెరిలైడ్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రజలు**

ఈ సంఘటనతో కోపోద్రిక్తులైన నిరసన కారులలో కొందరు రాళ్లు విసరడం జరిగింది. ఆ విధంగా కలెక్టర్ ఆఫీసు వద్ద పోలీసు కాల్పులు ఆరంభించడానికి ఇది సాకుగా దొరికింది" అంటూ తెలియజేశారు. నిరసన కారుడైన ఓ న్యాయవాది.

**హఠాత్తుగా పోలీసుకాల్పులు**

నిరసనకారుల సమూహాలు పట్టణంలోని పలు ప్రాంతాల నుండి, చుట్టు పక్కల గ్రామాల నుండి రావడాన్ని దిగ్భంధనం చేసినప్పటికీ ఆందోళనకారులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. "కలెక్టరేట్ ప్రధాన ద్వారానికి మూడు వందల మీటర్లు ముందు మమ్మల్ని ఆపేశారు. అప్పుడు మాకు కాల్పులు జరుగుతున్న శబ్దాలు వినిపించాయి. వీటి తర్వాత వెనువెంటనే పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీఛార్జీ జరపడం జరిగింది. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేవు. కలెక్టరేట్‌ను నల్లటి పొగలు ఆవరించడం, పక్కనే ఉన్న స్టెరిలైట్ వారి రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ని సైతం పొగలు కమ్మడం చూశాం. కొన్ని వాహనాలు తగలబడ్డాయి. అయితే నిరసనకారులమైన మేము సమీపానికి సైతం వెళ్లలేదు. ఒక్కసారిగా రక్తపాతం, ప్రజలు నేలకొరగడం కనిపించింది. చావు బతుకుల మధ్యనున్న వారిని, చనిపోయిన వారిని ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లడం చూశాం. దాదాపు నలభై నిమిషాలు అమాయక ప్రజలను వేటాడారు అంటూ బుల్లెట్ గాయమైన 43 సంవత్సరాల "ఎవ్‌లిన్ విక్టరీ" తెలిపారు. ఇది జరిగిన తర్వాత, కలెక్టరేట్ వద్ద పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పాయి. కాల్పుల్లో 9 మంది మరణించారు. స్టెరిలైట్ వ్యతిరేక ఉద్యమంలో ప్రధాన పాత్ర వహించే వీరిద్దరూ, రాడికల్ యూత్ ఫ్రంట్ సభ్యుడు అక్కడిక్కడే మరణించారు. లెక్కకు మిక్కిలిగా నిరసనకారులకు గాయాలు, కాళ్లు చేతులు విరగడం జరిగింది. అనధికార వర్గాల నివేదిక ప్రకారం 11 మంది అక్కడికక్కడే మరణించగా, చాలామందికి బుల్లెట్ గాయాలయ్యాయి. తమిళనాడు ముస్లిం మున్నేట్ర కజగం వారి అంబులెన్స్‌లు సహకరించగా, స్థానికంగా ఉన్న ప్రైవేటు హాస్పటల్ గాయపడిన వారికి చికిత్స చేసింది.

కాల్పుల్లో చంపబడ్డ స్నోలిన్ జాక్సన్ శరీరం హాస్పటల్‌లో ప్రత్యేక పద్ధతి ద్వారా భద్రంగా ఉంచారు. ఎస్. కలియప్పన్ (25) కాల్పులు జరిగిన మరునాడు అన్నానగర్‌లో మరణించాడు. పోస్ట్ మార్టమ్ వద్దంటూ అతని బంధువులు వ్యతిరేకించారు. మధురై జిల్లా ఉ

**"రెండురోజుల హింసను కూలంకషంగా పరిశీలిస్తే ఇది కేవలం పోలీసుల కుమ్మక్కును, అసమర్థతను వెల్లడి చేస్తుంది. ఆందోళనకారులు, నిరసనకారులు చెప్పిన వివరాల ప్రకారం, వాస్తవానికి 'స్టేజ్ మేనేజడ్'గా పోలీసులు వ్యవహరించారు. శాంతియుతంగా నడుస్తున్న ర్యాలీని హింసాత్మకంగా మార్చటానికి ప్రాధాన్యత ఇచ్చారు."**

సిలంపట్టికి చెందిన ఎన్. జయరామన్ (42), పోలీసు కాల్పుల గాయాలకు లోనై మరణిం చటంతో కాల్పుల సంఖ్య 12కి పెంచాడు. 13వ వ్యక్తి "ఇరువాప్పు రమ్'కి చెందిన పి. సెల్వశేఖర్, పోలీసులు గుండెలపై బలంగా గుద్దడం వలన మరణించాడు. తమిళనాడు రాష్ట్ర చరిత్రలో అత్యంత హీనమైన పోలీసు కాల్పుల్లో ఇది అతి పెద్దది. 2011వ సంవత్సరంలో "పరమ్‌కుడి" లో జరిగిన సంఘటనలో '6' గురు దళితులు కాల్చివేయబడ్డారు. 1980వ సంవత్సరంలో తమనల్వేలి జిల్లాలోని "కురిచనకుళం" లో చంపబడ్డ ఎనిమిది మంది రైతులలో ఒకరు దళితుడు.

మే 31వ తేదీన, మృతులసంఖ్యను వివరా లను పొందుపరుస్తూ, డిజిపి తరపున మద్రాసు హైకోర్టుకు లిఖిత పూర్వక నివేదిక అందించ బడింది. అత్యంత శక్తివంతమైన ఆయుధాల నుండి గుర్తుపట్టడానికి వీలులేని విధంగా పోలీ సులు కాల్చిచంపారని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. వారివి ఆరోపణలు కావని, వాస్త వాలని విజువల్స్ చాలా స్పష్టంగా నిరూపించాయి. వనిత, స్నోలిన్‌లను తుపాకి నోట్లో పెట్టి కాల్చిచంపారు. బుల్లెట్ పుర్రె మధ్యలో నుంచీ చొచ్చుకునిపోయి వనిత మొహాన్ని గుర్తించ వీలు లేనంతంగా నాశనం చేసింది. 'నా కూతురుని అత్యంత క్రూరంగా పోలీసులు చంపారు. కనీ సం ఆమె కాళ్లపైనో, గుండెలపైనో కాల్చిఉంటే నా బిడ్డ మొహాన్ని చూసుకునే అవకాశ ముం డేది" అంటూ ఆవేదన వ్యక్తం చేసిందామె తల్లి.

### 28 వ తేదీన – హాస్పటల్‌లో గాయాలలో చేరిన వారి పరిస్థితి

నూతన కలెక్టర్ "సందీప్ నందూరి అధికారిక ప్రకటన ప్రకారం," పోలీసు కాల్పుల్లో 12మంది అక్కడిక్కడే మరణించారు అందులో ఇద్దరు మహిళలు కాగా, ఒకరు గాయాలతో రెండు రోజుల తర్వాత మృతిచెందారు. 19 మందికి తీవ్రగాయాలయ్యాయి. అయితే కాల్పుల వల్ల ఎంతమందికి గాయాలయ్యాయి? అన్న విషయాన్ని ప్రకటించలేదు. కానీ చిన్న చిన్న దెబ్బల వల్ల 83 మంది బాధపడుతున్నట్లు తెలిపారు. పోలీసుల వాదన ప్రకారం పోలీసు బృందంలో 34 మందికి బాగా గాయాల య్యాయి. అందులో 24 మంది పురుషులు, 10 మంది మహిళా కానిస్టేబుళ్లు గాయాలతో తిరునల్వేలి హాస్పటల్‌లో చేరారు. ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల వాహనాలు దాదాపు 100 ధ్వంసమయ్యాయి. వీటిలో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలున్నాయి. మొత్తం నష్టం 1.65 కోట్లు. చనిపోయిన వారి కుటుంబాలకిచ్చిన నష్టపరిహారం 2 లక్షల నుండి 10 లక్షలకు పెంచబడింది. గాయాలు తగిలిన వారికి 1.04 కోట్లు పరిహారంగా అందించబడింది.

రెండు రోజుల హింసను కూలంకషంగా పరిశీలిస్తే ఇది కేవలం పోలీసుల కుమ్మక్కును, అసమర్థతను వెల్లడి చేస్తుంది. ఆందోళన కారులు, నిరసనకారులు చెప్పిన వివరాల ప్రకారం, వాస్తవానికి స్టేజ్ మేనేజడ్"గా పోలీ సులు వ్యవహరించారు. శాంతియుతంగా నడు స్తున్న ర్యాలీని హింసాత్మకంగా మార్చటానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఎంతో మంది పోలీసులు సాధారణ ప్రజల్లాగా తెల్లషర్టులు / ధోతీలు కట్టుకుని సమూహంలో కలిసిపోయారు. అసలు బుల్లెట్లు ఏ దిశ నుండీ వస్తున్నాయో తెలియని పరిస్థితి" అంటూ తృటిలో మరణాన్ని తప్పించు కున్న ఓ నిర్వాహకుడు తెలిపాడు.

వీరి ఆరోపణలు ఆ వాస్తవం కాదని తెలిపే సాక్ష్యాలు లభించాయి. సమాజాన్ని నిర్భాంత పరిచే రీతిలో వీడియో ఒకటి ఇంటర్నెట్‌లో, సోషల్ మీడియాల్లో వైరల్ అయ్యింది. "ముగ్గురూ పోలీసులు టీ – షర్టుల్లో, స్పోర్ట్స్ ప్యాంట్‌లు ధరించి "లాంగ్ రేంజ్ రైఫిల్స్' తో పోలీసు వ్యానుపై నుండీ టార్గెట్ చేయడం, అది కూడా కలెక్టర్‌కి అతి సమీపంలో ఈ దృశ్యం జరగడం గమనార్హం"

"సాధారణ దుస్తుల్లో పోలీసులను, ప్రజల లో కలవనివ్వడం అత్యంత ప్రమాదకరం. ముఖ్యంగా ఇలాంటి సందర్భాలలో ర్యాలీ నడిపే నిర్వాహకులను, మొదటి వరుసులలో నున్న వారిని పోలీసులు పట్టుకుంటారని, వారిపై కాల్పులు జరుపుతారేమోనని అనుమానించాము పోలీసులు ఇలా "టార్గెటెడ్ షూటింగ్ చేస్తారని అస్సలూహించలేదు" అని చెప్పారు "టిఫాన్".

అంతేగాక, పోలీసులు తమ చర్యలను సమర్థించుకున్నారు. వారి దృష్టిలో, ప్రకటనలో, సంఘ వ్యతిరేక శక్తులు కలెక్టరేట్‌లో ప్రవేశించ డానికి ప్రయత్నం చేస్తుంటే, వాళ్లను అదుపు చేయడానికి కాల్పులు జరిపామని చెబు తున్నారు. ఈ నిరసన కార్యక్రమం సందర్భంగా కొంతమంది అధికారుల ప్రాణాలు తీయాలన్న ప్రయత్నం జరుగుతుందని సమాచారం అందిం ది" అంటూ ఓ పోలీసు ఆఫీసరు తెలియజేశారు. ముఖ్యమంత్రి పళనిస్వామిసైతం," బయట నుండీ, గుంపులో ప్రవేశించిన అసాంఘీక శక్తులవలననే ఈ ఘటన జరిగిందని, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టవలసి వచ్చిందని ప్రకటించారు.

వీరి ప్రకటనలకు విరుద్ధంగా, పోలీసులు, జిల్లా అధికార యంత్రాంగం విడుదల చేసిన వీడియో క్లిప్పింగ్‌లలో నిరసనకారులు రాళ్లు విసిరే దృశ్యం తప్ప కలెక్టర్ ఆఫీసులోకి ఎవ్వరూ ప్రవేశించిన దృశ్యాలు లేవు.

జరిగిన సంఘటనపై "నిజ నిర్ధారణ కమిటీ" ఏర్పడింది. నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్‌కి చెందిన ఎ. మార్క్స్" బృంద సభ్యులు.

"ఇది పూర్తిగా కుట్ర స్టెరిలైట్ ఇండస్ట్రీకి వ్యతిరేకంగా ప్రశాంతంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంపై, నిర్వాహకులపై పోలీసులు ఉ ద్దేశపూర్వకంగా చేపట్టిన చర్య. ప్రజాస్వామి కంగా పోరాటం చేసే శక్తులను దోషులుగా నిలబెట్టడానికి, ప్రజాసమస్యలను పక్కదారి పట్టించడానికి, ప్రజలను అసాంఘిక శక్తులుగా ముద్రవేస్తున్నారు. ఇది పూర్తిగా సమాజాన్ని మభ్య పెట్టే ప్రయత్నం. వాస్తవానికి జరిగిన సంఘటనలో పాల్గొన్న ఏ సంస్థ, సభ్యులు విధ్వంస పూరిత చర్యలకు పాల్పడలేదు" అని ప్రకటించారు.

కాల్పుల తర్వాత మరింత దిగజారుతున్న స్థానిక పరిస్థితులలో పోలీసుల వేటను ప్రతిఘటి స్తూ తూత్తుకుడి పట్టణంలోని సామాన్య ప్రజలు, న్యాయవాదులు, ఆందోళనకారులు వ్యాపార

స్థులు అందరూ కలిసి ఒకే బృందంగా తిరిగి పోరాటం ఆరంభించారు. అర్థరాత్రి సమయంలో తలుపులు కొట్టి పోలీసులు కొనసాగించిన వెతుకులాట కార్యక్రమం అక్రమం.. "మే 22 సంఘటన అనంతరం కోపోద్రిక్తులైన పోలీసులతో ఎవ్వరం మాట్లాడే పరిస్థితి లేదు... వారి ప్రవర్తన అత్యంత క్రూరంగా ఉండడం వలన, స్థానిక న్యాయవాదుల సహకారం తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. న్యాయవ్యవస్థను కల్పించుకోమని మేము న్యాయవాదుల ద్వారా అర్థించాం" అంటూ పేర్కొన్నారు. మద్రాసు హైకోర్టు సైతం" చట్టరీత్యా, న్యాయవ్యవస్థ అవసరం కలిగినప్పుడు సామాన్య ప్రజానీకం తరపున న్యాయవాదుల జోక్యం సమర్థనీయం" అంటూ తేల్చిచెప్పింది.

న్యాయవ్యవస్థ సానుకూలంగా స్పందించడం వలన ప్రజలలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎ.డబ్ల్యూ. డబ్ల్యూ తిలక్ అనే సీనియర్ న్యాయవాది ఆధ్వర్యంలో తూత్తుకుడి బార్ అసోసియేషన్ న్యాయవాదుల బృందం, అకారణంగా బంధించిన అమాయక యువతను, గుట్టు తెలియని ప్రదేశాలలో బంధించి థర్డ్ డిగ్రీ ఉపయోగించి పోలీసులచే హింసించబడిన వారందరినీ బెయిల్ మీద బయటకు తీసుకు వచ్చింది. 16 సంవత్సరాల నుండి 28 సంవత్సరాల మధ్య నున్న వీరిని, న్యాయ వ్యవస్థకు అప్పగించారు. రెండురోజులు ఉండిపోయిన వీరిని కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన తర్వాత విడిచిపెట్టారు. అనధికారికంగా, చట్ట వ్యతిరేకంగా వీరిని నిర్బంధించినందుకు మే 23న న్యాయవాదుల బృందం "చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ "భగవతి అమ్మాల్"ని ఆశ్రయించారు.

సమస్య తీవ్రతను గమనించిన ఛీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ వెనువెంటనే "విలాతికులం" మేజిస్ట్రేట్, "కాలిముత్తువేల్ని" సెర్చ్ ఆఫీసర్గా నియమించి, ఏయే పోలీస్ స్టేషన్లలో యువత నిర్బంధించబడిందని ఆరోపణలు వచ్చాయో, అక్కడకు వెళ్లమని ఆదేశించారు. అయితే, "కాలిముత్తు వేల్" ఆయా స్టేషన్లకు వెళ్లకముందే పోలీసులు 95 మంది డిటెన్యూలను పోలీసు ఫైరింగ్ రేంజ్ ఉన్న "వల్లనాడు" గ్రామానికి తరలించారు. పోలీసుల ఈ చర్యను జ్యుడిషియల్ ఆఫీసర్ తప్పు పట్టి చట్ట వ్యతిరేక చర్యగా పేర్కొనగా, 30 మందిని వెనువెంటనే విడుదల చేశారు. తర్వాత ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 147,148, 353, తమిళనాడు పబ్లిక్ ప్రాపర్టీ

> **"స్టెరిలైట్ ఇండస్ట్రీ వలన తమ కుటుంబాలకున్న ప్రాణహాని పట్ల వారి ఆందోళన స్పష్టమైంది. "రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన బాధ్యత మమ్మల్ని కాపాడటం. కానీ ఆ విషయంలో విఫలమైంది. మేం విపత్తుల మధ్య జీవిస్తున్నాం. ఈ ప్రాంతం మరో భోపాల్లా అవుతుందని భయపడుతున్నాం. కాపాడాల్సిన ప్రభుత్వమే కాటేసింది"అంటూ ఆవేదన వ్యక్తపరిచారు."**

చట్టం 1992లోని సెక్షన్ 3 అండ్ 4 ల ప్రకారం కేసులు నమోదు చేసి, వారిని తిరిగి పోలీసు స్టేషన్లలో పెట్టారు. మే 24న వారిని బృందాలుగా కోర్టులో ప్రవేశపెట్టారు. లాయర్లు బెయిల్ పిటిషన్లు వేయగా మేజిస్ట్రేట్ "నారుహాసిని" విచారణ చేపట్టి, ప్రతి ఒక్కరిని నిశితంగా విచారించి, అర్థరాత్రి అయినప్పటికీ లెక్కచేయకుండా వారిని బెయిల్పై విడుదల చేశారు.

అదే సమయంలో లాయర్లు మరో అంశాన్ని కూడా జ్యుడిషియల్ ఆఫీసర్ దృష్టికి తెచ్చారు. డిటెన్యూలుగా 'నిర్బంధించబడ్డ యువతను పోలీసులు క్రూరంగా హింసించటం, వైద్య పరీక్షలకు అనుమతించకపోవడం, జరిగిన హింసకు సాక్ష్యాలు లేకుండా చేయడమేనని తెలుపుతూ యువకుల శరీరాలపై గాయాలను చూపారు. యువతను, న్యాయవాదుల బృందం వైద్యపరీక్షలకు తీసుకువెళ్లగా, డ్యూటీలోనున్న వైద్యులు వారికయిన గాయాల తీవ్రతను రికార్డు చేయలేదని, ఇది ఉద్దేశపూర్వక చర్యని తెలియజేశారు. దీనికి ప్రతి స్పందనగా జ్యుడీషియల్ ఆఫీసర్లు, పోలీసు స్టేషన్లు, తూత్తుకుడి గవర్నమెంటు కాలేజీ హాస్పటల్ను సందర్శించి రికార్డులు పరిశీలించి, యువతకు వైద్య సహాయం అందే దిశగా చర్యలు తీసుకున్నారు.

"పోలీసు కాల్పులు, ప్రశ్నిస్తున్న స్వరాలను అణచివేయడానికే! ప్రభుత్వ వ్యతిరేక చర్యగా దీనిని చూసే ముందు, ప్రజారోగ్య సంరక్షణ వహించాల్సిన ప్రభుత్వం కంపెనీకున్న గత చరిత్రను పరిశీలించవలసింది. చట్టవ్యతిరేక కార్యక్రమాలతో, చట్టాల ఉల్లంఘనలతో వ్యవహరిస్తున్న ఫ్యాక్టరీ పట్ల ప్రజల వ్యతిరేకత అత్యంత సహజం. ఈ ఫ్యాక్టరీ తమ జీవితాలతో, ప్రాణాలతో చెలగాడుతుందన్న భావన ప్రజలలో ఎంతో కాలంగా నెలకొని ఉంది". అంటారు మార్క్స్. "నేషనల్ అలియన్స్ ఆఫ్ పీపుల్స్' ఎస్ మూవ్మెంట్" న్యూఢిల్లీ వారి ప్రకటన ప్రకారం" ఇది ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులపై అత్యంత పాశవికమైన మొరటు దాడి".

ఇలాంటి అత్యంత దురదృష్టకర సంఘటన తర్వాత తూత్తుకుడి పట్టణ ప్రజలు భయంకోరల్లో చిక్కుకోవడం చాలా సహజ పరిణామం. ఈ వార్తను కవర్ చేయడానికి వెళ్లిన ఈ పత్రికా ప్రతినిధి కలిసిన కుటుంబాలు, చనిపోయిన, గాయపడిన తమ ప్రియతముల పట్ల దు:ఖంతో, భయంతో కొట్టుమిట్టాడడం కనిపించింది. స్టెరిలైట్ ఇండస్ట్రీ వలన తమ కుటుంబాలకున్న ప్రాణహాని పట్ల వారి ఆందోళన స్పష్టమైంది. " రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన బాధ్యత మమ్మల్ని కాపాడటం. కానీ ఆ విషయంలో విఫలమైంది. మేం విపత్తుల మధ్య జీవిస్తున్నాం. ఈ ప్రాంతం మరో భోపాల్లా అవుతుందని భయపడుతున్నాం. కాపాడాల్సిన ప్రభుత్వమే కాటేసింది". అంటూ ఆవేదన వ్యక్తపరిచారు. బుల్లెట్ వలన ఎడమ కాలిపై గాయమైన 19 సంవత్సరాల ముత్తుకుమార్.

తూత్తుకుడి ప్లాంట్ వలన బాధలుపడ్డ ప్రజానీకం తమ నిరసనను తెలిపినందుకు ఫలంగా విపరీతమైన కోలుకోలేని నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వలన అనుభవించింది. సుదీర్ఘంగా జరిగిన పోరాటం హింసతో ముగియడంతో పాటుగా, సమాజంలో ఓ మేల్కొలుపు తెచ్చింది. అదే ఫ్యాక్టరీల వలన మనుషులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలియజేయడం సముద్రతీర ప్రాంతంలోని ప్రత్యేక వాతావరణం, పర్యావరణ పరిరక్షణ గురించి స్థానిక ప్రజలు ఎంతగానో క్షోభ పడుతున్నారు. ఇలాంటి సున్నిత అంశాలను, పరిశీలించి ప్రజల ప్రాణాల పట్ల జాగరూకత వహించాల్సిన ప్రభుత్వం, నిర్లక్ష్యవైఖరికి తెరపడటం అది కూడా విపరీతమైన ప్రాణనష్టం తర్వాత జరగడం అత్యంత బాధాకరం, దురదృష్టకరం.

**అనువాదం: డాక్టర్ దుట్టా శమంతకమణి**

పర్యావరణం

# ప్రమాదాలు పెరుగుతున్నాయి

**పి. దక్షిణామూర్తి**



రచయిత మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు

**ప్రతి** ఏటా జనవరిలో దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యు.ఇ.ఎఫ్.) సమావేశాలు ఇటీవలనే ముగిసాయి. ప్రపంచం నలు మూలలా ఉన్న పెట్టుబడిదార్లు పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడి దారీ ఆర్థికవేత్తలు, బహుళ జాతి కంపెనీల అధిపతులు, దేశాధినేతలు, పెట్టుబడి కోసం తహతహలాడే వివిధ దేశాల ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులూదావోస్‌లో సమావేశమై ఈ ప్రపంచాన్ని ఎలా ఉద్ధరించాలో తలమునకలై తీవ్రంగా చర్చించారు!

తీవ్ర ఆర్థిక సంక్షోభాలు, ఆర్థికమాంద్యాలు పెట్టుబడిదారీ విధానం యొక్క సహజ లక్షణాలనీ, అయినా అటువంటి క్లిష్ట సంక్షోభాలను తమ ఉపాయాలతో అధిగమిస్తామనీ కూడా వారు శెలవిచ్చారు!! పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థకు కొన్ని తక్షణ మౌలిక సంస్కరణలు చేస్తే చాలనీ, ఈ సంస్కరణలకు ఆయా దేశాలు పరస్పరం సహకరించుకోవాలనీ ప్రజలు కూడా కొన్ని ఇబ్బందులున్నా సర్దుకొనిపోవాలనీ ఎప్పటిలాగే ఈ సమావేశాలు కూడా తేల్చేశాయి!

పెట్టుబడిదారీ విధానం విసిరే సవాళ్ళను ఎదుర్కోవాలంటూనే 2017వ సంవత్సరం కూడా అన్ని సంవత్సరాల్లాగానే అత్యంత అనిశ్చితితో, అభద్రతతో నడిచిందనీ, ప్రస్తుత పెట్టుబడిదారీ ప్రపంచం ఎదుర్కొంటున్న నాలుగు తీవ్రమైన ప్రమాదాల గురించిన ఒక నివేదికను కూడా 2018 దావోస్ సమావేశాల సందర్భంగా విడుదల చేసారు. గ్లోబల్ రిస్క్స్ పెర్‌సెప్షన్ సర్వే (జి.ఆర్.పి.ఎస్.) పేరిట విడుదలైన ఈ సర్వే రోజురోజుకీ ప్రపంచవ్యాప్తంగా తీవ్రమౌతున్న ఆర్థిక అసమానతలు, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత రాజకీయ పరిస్థితులు, పర్యావరణానికి పెనుముప్పు మరియు కంప్యూటర్ ఆధారిత (సైబర్) ప్రమాదాలు, నేరాల గురించి అత్యంత ఆసక్తికరమైన విషయాలు చర్చించడమే కాక పొంచి వున్న ప్రమాదాల గురించి ప్రపంచ మానవాళిని హెచ్చరించింది కూడా.

**తీవ్రమౌతున్న ఆర్థిక అసమానతలు :** ప్రపంచ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ.) యొక్క అంతర్జాతీయ వేతనాల రిపోర్టు ప్రకారం 2012వ సంవత్సరం నుండి కార్మికుల నిజ వేతనాల తగ్గుదల అతి తీవ్రంగానూ, వేగంగానూ జరుగుతోంది. ఉమ్మడి బేరసార హక్కుల సాధనకు కృషి చేయడం ద్వారా మాత్రమే కార్మికులు మెరుగైన ఆదాయాలు పొందగల్గుతారని కూడా ఆ రిపోర్టు సూచించింది. ప్రపంచ ద్రవ్య సంస్థ (ఐ.ఎం.ఎఫ్) కూడా ఆదాయ అసమానతలు అతి తీవ్రంగా ఉన్నాయనీ ప్రపంచంలోని 53 దేశాల్లో ఈ అసమానతలు పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తోందనీ పేర్కొంది. కొద్ది మంది చేతుల్లోనే సంపదంతా కేంద్రీకృతమవడం, పేదవారు ఇంకా దారిద్ర్యంలోకి కూరుకుపోవడం, వ్యక్తిగత అప్పులు ఎక్కువ అవడం, పలు దేశాల ప్రభుత్వాలు పెన్షన్లలో కోత విధించడం వంటి పరిణామాలు మరింత తీవ్ర ఆర్థిక సంక్షోభానికి సూచికలని, సామాన్య ప్రజల్లో వ్యవస్థ పట్ల తీవ్ర అసంతృప్తికి, నిరాశకు కారణాలవుతాయని కూడా వివిధ రిపోర్టులు తెలియజేస్తున్నాయి. నాలుగో పారిశ్రామిక విప్లవం వైపు ప్రపంచం వేగంగా అడుగులేస్తోందని, అన్నిరంగాలు "ఆటోమేషన్" అవుతున్నాయని, విపరీతమైన ఆటోమేషన్ ఉద్యోగాలను ఊడగొట్టి ఆదాయ అసమానతలు తీవ్రమవడానికి కారణమవుతాయనీ రాబోయే పదేళ్ళలో ప్రపంచం ఎదుర్కొనే పది అతి పెద్ద సవాళ్ళలో ఆదాయ, సంపదల్లో వ్యత్యాసం మూడవదిగా ఉంటుందని కూడా ఈ సర్వే తెల్పింది.

**అనిశ్చిత రాజకీయ పరిస్థితులు :** ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో మితవాదుల ప్రాబల్యం పెరిగిపోతోందనీ, దీని కారణంగా ఆయా సరిహద్దు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయని ఈ సర్వే ఆందోళన వ్యక్తం చేసింది.

తమ చరిష్మా (ఆకర్షణ)తో తామే గొప్ప అనే నినాదంతో, ఒక కొత్త "జాతీయవాద" సిద్ధాంతాన్ని తెరపైకి తీసుకొనివచ్చి ప్రజల్ని రెచ్చగొట్టి తమ రాజకీయ పబ్బం గడుపుకొనే నాయకుల ప్రాబల్యం పెరగడం మనం గమనిస్తూ ఉన్నాం. "అమెరికా ఫస్ట్" అనే నినాదం ఇవ్వడం ద్వారా జాత్యాంహకార భావనల్ని ప్రేరేపించి తెరపైకొచ్చిన డోనాల్డ్ ట్రంప్ మొదలుకొని రష్యా, జపాన్, టర్కీ సౌదీ అరేబియా, ఫిలిప్పైన్స్ లాంటి పలు దేశాల్లో ఇటువంటి పోకడలు పెచ్చరిల్లడం వివిధ దేశాల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు కారణాలవుతున్నాయి. ఇటువంటి ఉద్రిక్త, అనిశ్చిత పరిస్థితులు 2017వ సంవత్సరంలో చాలా ఎక్కువగా జరిగాయని కూడా ఈ సర్వే గుర్తించింది. తన దగ్గరున్న అణ్వాయుధాలను ఉత్తర కొరియా ప్రయోగిస్తుందనే ఆందోళన మరియు సిరియాలోనూ, ఎమెన్‌లోనూ నెలకొన్న పరిస్థితుల కారణాన సరికొత్త భయాలు ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. రాబోయే సంవత్సరంలో కూడా ఇటువంటి పరిస్థితులు ఉండటమే కాక ఇంకా తీవ్రమౌతాయని కూడా ఈ సర్వే గుర్తించి హెచ్చరించింది.

వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యు.టి.ఒ.) వంటి అంతర్జాతీయ సంస్థలు నిర్వీర్యమయ్యే క్రమం ప్రారంభమైందని, అంతర్జాతీయ ఒడంబడి కలను, ఒప్పందాలను ఉల్లంఘించడం, బేఖా తరు చేయడం అటువంటి ఒప్పందాలను రద్దు చేసుకోవడం కూడా మొదలైందనీ, తమకున్న మిలటరీ శక్తితో ఇతరులను శాసించవచ్చని కొన్ని శక్తివంతమైన దేశాలు బలంగా నమ్ముతున్నాయని కూడా ఈ సర్వే తేల్చి చెప్పింది. యూరోపియన్ యూనియన్ (ఇ.యూ) నుండి బ్రిటన్ నిష్క్రమణ (బ్రెగ్జిట్), వాతావరణ మార్పులను కట్టడి చేయడానికి

> **❝ జర్మనీ దేశ పరిశోధకులు గుర్తించిన విధంగా, పర్యావరణానికి తద్వారా మానవునికి వివిధ రూపాల్లో మేలుచేసే కీటక జాతులు 27 సంవత్సరాల్లో 75 శాతం అంతరించి పోవడం పర్యావరణ పరంగా అతిపెద్ద ఉపద్రవానికి సూచిక. 1970-2012 సంవత్సరాల మధ్య, ఈ భూమి మీదున్న 58% వెన్నెముక కల్గిన జీవజాతుల సంఖ్య కనిష్ఠ స్థాయికి తగ్గిపోయాయని కూడా ఒక అంచనా తెలియజేస్తోంది. ❞**

ఉద్దేశించిన పారిస్ ఒప్పందం నుండి అమెరికా ఏకపక్షంగా వైదొల గడం, పన్నెండు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్యానికి ఉద్దేశించిన ట్రాన్స్ పసిఫిక్ పార్ట నర్‌షిప్ అనే ఒప్పందం నుండి కూడా అమెరికా వైదొలగడం మొదలైన సంఘటనలు అంత ర్జాతీయ ఒప్పందాలను కూడా లెక్కచేయక పోవడానికి సూచికలని మనం గమనించవచ్చు. తనకు అనుకూలంగా లేని ఒప్పందాల నుండి ఏకపక్షంగా వైదొలగిన అమెరికా ఇతర దేశాల మీద మాత్రం తన పెత్తనాన్ని, ఆధిపత్యాన్ని కొనసాగిస్తూండటం కూడా చూడవచ్చు. ఇరాన్ దేశ అణు కార్యక్రమాన్ని కట్టడి చేసే జాయింట్ కాంప్రెహెన్సివ్ ప్లాన్ ఆఫ్ ఏక్షన్ (జె.సి.పి.ఎ. )ను ఇరాన్ అమలు పరుస్తున్నా కూడా ఆ దేశం అటువంటి ప్లానును ఉల్లంఘిస్తోందంటూ చిర్రుబుర్రులాడటం డోనాల్డ్ ట్రంప్ మరియు అమెరికా యొక్క అహంకారానికి నిదర్శనం కాదా అని ఇరాన్ దేశం ప్రశ్నిస్తోంది. వాణిజ్య ఒప్పందాలను ఉల్లం ఘిస్తూన్న ధనిక దేశాలు, ఒప్పందాలకు భిన్నంగా రక్షణాత్మక విధానాలను అవలంబిస్తూ ఇతర దేశాల ఉత్పత్తుల మీద ఆంక్షలు విధించడం ద్వారా వారి ఆర్థిక వ్యవస్థ లను బలహీన పరుస్తున్నాయి. ఇటువంటి వాణి జ్య ఒప్పందాల వలన తలెత్తిన వివాదాలను పరిష్కరించాల్సిన ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యు.టి.ఒ. )ను ఉద్దేశపూర్వకంగానే క్రమంగా బలహీనపడేట్లు చేయడం, వివిధ దేశాల మధ్య మిలిటరీ టెన్షన్లు మైనారిటీ జాతులకు చెందిన ప్రజల వలసలు కూడా రాబోయే సంవత్సరాల్లో ఇంకా తీవ్రమై అనిశ్చిత పరిస్థితులు రాజ్యమేలుతాయని కూడా ఈ సర్వే తేల్చిచెప్పింది.

**తీవ్రమౌతున్న పర్యావరణ సమస్యలు**

గాలి, నీరు, భూమి కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, కాలుష్యాన్ని కట్టడి చేయడానికి, వాతావరణ మార్పులను నియంత్రణ చేయడానికి ఉద్దేశించిన చర్యలు సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రపంచదేశాలు ఘోరంగా విఫలమవుతున్నాయని ఈ సర్వే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2017వ సంవత్సరంలో అట్లాంటిక్ సముద్రంలో సంభవించిన అసాధారణమైన హార్వే, ఇర్మా మరియు మారియా లాంటి తుఫానుల వల్ల తీవ్ర నష్టం జరిగిన విషయం తెల్సిందే. ఇటువంటి తీవ్ర ప్రకృతి విపత్తులు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో జరిగాయి. ఇటువంటి అతివృష్టి పరిస్థితుల వల్ల పెద్ద ఎత్తున ప్రాణనష్టం, ఆస్థినష్టం జరగడమే కాకుండా పెద్ద ఎత్తున ప్రజలు తమ



కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలు

ప్రాంతాలను వదిలి వేరే ప్రాంతాలకు వలస వెళ్ళడం కూడా జరుగుతోంది. మరోప్రక్క భూగోళం రోజురోజుకీ వేడెక్కిపోతోంది. 2016వ సంవత్సరం అత్యంత వేడి సంవత్సరంగా రికార్డుకెక్కితే 2017వ సంవత్సరానికి మూడవ ర్యాంకు లభించింది. అంతేకాకుండా అడవుల్లో కార్చిచ్చులు కూడా ఏడాదికేడాది పెరిగిపోతున్నాయని కూడా గుర్తించవచ్చు. ఇటువంటి కార్చిచ్చుల వలన అడవుల్లో నివశించే ప్రజలు, జంతువులు, వృక్షజాతులు పెద్దఎత్తున మరణించడమే కాక, అంతరించిపోవడం జరుగుతూ పర్యావరణ సమస్యలు మరింత పెరుగుతున్నాయి.

రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేడిగాలుల తీవ్రత వ్యవసాయరంగంపై తీవ్ర ప్రతికూలతను చూపుతున్నాయి. ఐక్యరాజ్య సమితి (యు.ఎన్.ఒ.)కి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (ఎఫ్.ఎ.ఒ.) యొక్క అంచనా ప్రకారం ప్రపంచ ప్రజల ఆహారపు అవసరాల్లో 75 శాతం కేవలం 12 వృక్ష జాతులు, 5 జంతుజాతుల నుండే లభిస్తోంది. ఊహించని విధంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వరదలు వంటి పరిస్థితుల వలన మొక్కజొన్న వంటి ప్రధానమైన ఆహారపంటను అత్యధికంగా పండించే చైనా మరియు అమెరికా దేశాల దిగుబడి గణనీయంగా తగ్గిపోవడం వలన తీవ్రమైన ఆహార కొరత ఏర్పడి కరువుతో అల్లాడిపోవాల్సి ఉంటుంది. జర్మనీ దేశ పరిశోధకులు గుర్తించిన విధంగా, పర్యావరణానికి తద్వారా మానవునికి వివిధ రూపాల్లో మేలుచేసే కీటక జాతులు 27 సంవత్సరాల్లో 75 శాతం అంతరించిపోవడం పర్యావరణ పరంగా అతిపెద్ద ఉపద్రవానికి సూచిక. 1970–2012 సంవత్సరాల మధ్య, ఈ భూమి మీదున్న 58% వెన్నెముక కల్గిన జీవజాతుల సంఖ్య కనిష్ఠ స్థాయికి తగ్గిపోయాయని కూడా ఒక అంచనా తెలియజేస్తోంది. 29.7 మిలియన్ హెక్టారుల విస్తీర్ణంలోని అడవులు ఒక్క 2016వ సంవత్సరంలోనే అంతరించి పోయాయి. ఇది న్యూజిలాండ్ దేశ వైశాల్యానికి సమానం. ఇది అంతకుముందు ఏడాది అంటే 2015వ సంవత్సరానికింటే 50 శాతం ఎక్కువ. వ్యవసాయానికి, గనుల తవ్వకానికి, చమురు, సహజవాయువుల వెలికితీతకు, ప్రజల ఆవాసాలకి అడవులను యథేచ్ఛగా నరుకుతూ పోతూండటం వలన పర్యావరణ సమతౌల్యం తీవ్రంగా దెబ్బ తింటోంది. తొంభై శాతం ప్రపంచ జనాభా విపరీతమైన వాయు కాలుష్యంలో తమ బ్రతుకు వెళ్ళదీస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔఎఉ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో కనీసం 10 శాతం వాయు కాలుష్యం వలనే అని కూడా వివిధ రిపోర్టులు తెలియజేస్తున్నాయి. బీదదేశాల్లోని ప్రజలే ఎక్కువగా దీని బారిన పడ్తున్నారు. 2017 నవంబరులో ఢిల్లీ నగరంలో వాయు కాలుష్యం డబ్ల్యు.హెచ్.ఒ. నిర్దేశించిన పరిమితులకన్నా 11 రెట్లు అధికంగా ఉండటంతో "హెల్త్ ఎమర్జెన్సీ"ని ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం.

ప్రముఖ మెడికల్ జర్నల్ "లాన్‌సెట్"

**"పెట్టుబడిదారీ విధానంలో లాభమే పరమావధిగా విపరీతమైన సరుకుల ఉత్పత్తి చేయ డం, ఆ క్రమంలో మితిమీరిన పారిశ్రామికీ కరణ, ఆ సరుకుల అమ్మకాల కోసం నిరంతరం మార్కెట్‌లను వెతుకుతూపోవడం, కొత్త మార్కెట్ల సృష్టి, రోజు రోజుకీ పెరుగుతున్న ప్రపంచ జనాభా, పెరుగుతున్న జనాభాకి తగిన సౌకర్యాలు కల్పించలేకపోవడం, సహజంగా వచ్చే వాతా వరణ మార్పులు వగైరాలన్నీ కూడా ఇటువంటి పర్యావరణ విధ్వం సానికి కారణమవుతున్నాయి."**

అక్టోబరు 2017 సంచికలో నీరు, మట్టి కాలుష్యాన్ని గురించి తన కమీషన్ రిపోర్టులో ప్రస్తావిస్తూ అట్టి కాలుష్యం కారణంగా వ్యాధుల బారిన పడి మరణించేవారి సంఖ్య ఏడాదికేడాది ఆందోళన కలిగించే స్థాయిలో పెరుగుతోందని ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కూడా కాలుష్యం అతిపెద్ద భారాన్ని మోపుతోందని తెలిపింది. ప్రపంచ మానవాళికి మరొక ముప్పు ప్లాస్టిక్ ద్వారా ఎదురవుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలో కలవడం ద్వారా ఈ ముప్పు వస్తోంది. ప్రతిఏటా అదనంగా 80 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలో కలుస్తున్నాయని అంచనా. నీటిద్వారా అవి మనిషి శరీరంలో ప్రవేశించి వ్యాధులకు కారణమవుతున్నాయి. అతి సూక్ష్మమైన పీచు వంటి ప్లాస్టిక్ వ్యర్థాలు 83% పైగా ట్యాప్ వాటర్ (కుళాయినీళ్ళు)లో ఉంటా యనీ అవి పురుగుమందులు లేదా లోహ అవ శేషాలతో చేరి విషతుల్యం అవడం వలన కేన్సర్ వంటి రోగాలు పెరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. చేపలు, రొయ్యల లాంటి సముద్ర ఉత్పత్తులు తినేవారు ప్రతిఏటా 11,000 సూక్ష్మ ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్నట్లేనని ఒక అధ్యయనం తెలియజేస్తోంది.

ఇంకొక అత్యంత ఆందోళన కల్గించే అంశం వాతావరణంలో పెరుగుతున్న కార్బన్ డయాక్సైడ్ (సి.ఒ.-2) సాంద్రత గురించి వ్యక్తమవుతోంది. ఇది పరిమిత స్థాయిలను మించి మరీ ఎక్కువగా అంటే 403 పార్ట్సుపర్ మిలియన్‌గా 2017లో నమోదైంది. పెరుగు తున్న సముద్ర ఉష్ణోగ్రతల కారణంగా విష పూరిత కార్బన్ డయాక్సైడ్‌ను తనలో ఇముడ్చు కొనే, పీల్చుకొనే తమ సహజ స్వభావాన్ని సముద్రాలు క్రమేపీ కోల్పోతున్నాయని కూడా అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

పెట్టుబడిదారీ విధానంలో లాభమే పర మావధిగా విపరీతమైన సరుకుల ఉత్పత్తి చేయ డం, ఆ క్రమంలో మితిమీరిన పారిశ్రామికీ కరణ, ఆ సరుకుల అమ్మకాల కోసం నిరంతరం మార్కెట్‌లను వెతుకుతూపోవడం, కొత్త మార్కెట్ల సృష్టి, రోజురోజుకీ పెరుగుతున్న ప్రపంచ జనాభా, పెరుగుతున్న జనాభాకి తగిన సౌకర్యా లు కల్పించలేకపోవడం, సహజంగా వచ్చే వాతావరణ మార్పులు వగైరాలన్నీ కూడా ఇటు వంటి పర్యావరణ విధ్వంసానికి కారణమవు తున్నాయి. పర్యావరణ మార్పుల వలన సంభ వించే విపరీత పరిణామాలను నియంత్రించా లంటే ప్రపంచ మానవాళి మొత్తం ఏకమయి పరిష్కారాలను వెతకాలి. భూతాపాన్ని తగ్గించే లక్ష్యంతో ఏర్పడిన "పారిస్ ప్రొటోకాల్" లాంటివి మరిన్ని రావాలి.

ఎటువంటి భేషజం లేకుండా అభివృద్ధి చెందిన దేశాలు, ధనిక దేశాలు, పారిశ్రామిక దేశాలు నిష్పాక్షికంగా కృషి చేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. ఆ దిశగా ప్రపంచ మేధో వర్గం ఆలోచన చేయాలి.

**సైబర్ నేరాలు - ప్రమాదాలు**

ప్రపంచ వ్యాపితంగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆధారిత సైబర్ నేరాలు, ఘోరాలు, మోసాలు ఎక్కువవుతున్నాయి. సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను నాశనం చేసే మరొక కొత్తరకం సాఫ్ట్‌వేర్‌లు సృష్టించే విధ్వంసం అంతా ఇంతాకాదు. వీటినే మాల్‌వేర్స్ అంటున్నారు. ఒక్క 2016వ సంవత్సరంలోనే 35.7 కోట్ల కొత్త "మాల్‌వేర్స్" సృష్టించబడ్డాయని అంచగా.


బ్యాంకింగ్ లేదా ఆర్థిక సంస్థల కంప్యూ టర్లలోకి చొరబడి ఖాతాదారుని ఎకౌంట్ వివరా లను తస్కరించే "బ్యాంకింగ్ ట్రోజన్స్" అనే మాల్‌వేర్లు కూడా అభివృద్ధి చేయబడ్డాయి. ఇటువంటి బ్యాంకింగ్ ట్రోజన్స్ 500 డాలర్లకి కూడా లభ్యమవుతుండడం అత్యంత దిగ్భ్రాంతి కలుగచేస్తోంది. ఒక్క 2016వ సంవత్సరంలోనే 400 కోట్ల రికార్డులు సైబర్‌దాడులకు బలయ్యా యని కంపెనీలు గగ్గోలు పెడితే 2017లో అవి చాలా రెట్లు పెరిగి ఉంటాయని భావిస్తున్నారు. ఇటువంటి సైబర్ దాడుల నుండి రక్షించుకో వడం కోసం కంపెనీలు విపరీతంగా ఖర్చు చేస్తున్నాయని పలు రిపోర్టులు తెలియ జేస్తున్నాయి. 7 దేశాల్లోని 254 కంపెనీలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని సైబర్ దాడుల నుండి రక్షించుకోవడానికి ఒక్క 2017వ సంవత్సరంలోనే ఒక్కొక్క కంపెనీ 11.7 మిలియన్ పౌండన్లు అదనపు ఖర్చు చేసాయి. ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 27.4 శాతం ఎక్కువ. వచ్చే ఐదేళ్ళలో ఈ ఖర్చు 8 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా. కంపెనీలు లేదా వ్యవస్థల యొక్క సమాచా రాన్ని (డేటా)ని తస్కరించి మరల ఆ డేటాని ఇవ్వడానికి డబ్బు (రాన్‌సమ్)ని డిమాండ్ చేసే "రాన్‌సమ్‌వేర్" అనే మాల్‌వేర్స్ కూడా ఇటీవలి కాలంలో ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. "వన్నా క్రై" అనే రాన్‌సమ్‌వేర్ 150 దేశాల్లోని 3 లక్షల కంప్యూటర్లలోకి చొరబడి విధ్వంసం సృష్టిస్తే "పెట్యా" 'నాట్‌పెట్యా'వంటి మాల్‌వేర్స్ పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలకు అంతులేని నష్టాలను కలుగజేసాయి. దీంతో మెర్క్, ఫెడెక్స్ వంటి దిగ్గజ కంపెనీలు ఒక్కొక్కటీ 30 కోట్ల డాలర్ల త్రైమాసిక నష్టాలను నమోదు చేసాయి. ప్రభు త్వ విభాగాలు, రైల్వేలు, బ్యాంకులు, టెలికమ్యూ నికేషన్ కంపెనీలు, కార్ల కంపెనీలు, విద్యుత్ కంపెనీలు, హాస్పిటల్స్ మొదలైన వాటి సాఫ్ట్ వేర్స్‌ను "వాన్నక్రై" ఒక పట్టు పట్టింది. ఉక్రెయిన్ దేశ విద్యుత్ వ్యవస్థ మీద సైబర్ దాడుల కారణంగా 30 విద్యుత్ సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాకి అంతరాయం కల్గి 2,30,000మంది ప్రజలు అంధకారంలో మగ్గారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బంగ్లాదేశ్ యొక్క మెసేజింగ్ నెట్‌వర్క్ మీద దాడి చేయడం ద్వారా 81 మిలియన్ డాలర్ల చోరీకి పాల్పడ్డారు. మన దేశంలో కూడా బ్యాంక్ అక్కౌంట్స్ మీద ఇటు వంటి దాడులే జరిగిన విషయం మనకు తెలి సిందే. అణువిద్యుత్తు ప్లాంట్ల మీద, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే విమాన వ్యవస్థ మీద కూడా ఈ తరహా వేలాది దాడులు జర గడం అటువంటి వ్యవస్థల భద్రత మీద అను మానాలకు తావిస్తోంది. ఈ తరహా దాడులు ఇంకా చాలా వ్యవస్థల మీద తన ప్రతాపాన్ని కొనసాగించటమే కాక పెంచుతూందని వస్తున్న వార్తల నేపథ్యంలో అంతా కంప్యూటర్ ఆధారి తంగానే విస్తరించుతుందని చెప్తూన్న నాలుగో పారిశ్రామిక విప్లవం ఎన్ని ప్రమాదాలను మోసు కొస్తుందనే ఆందోళన సర్వత్రా నెలకొని ఉంది.

❋

నివాళి

# శ్రామికవర్గ మేధావి అశోక్ మిత్రా



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త

**ప్రభాత్ పట్నాయక్**

**20**18 సంవత్సరం మే 1వ తేదీనాడు అశోక మిత్రా మరణించాడు. దేశంలోని వామపక్ష మేధావులలో ఆయన అగ్రగణ్యుడు. కార్మికవర్గం కోసం అత్యంత నిబద్ధతతో ఆయన చేసిన కృషిని అందరూ అభినందిస్తారు. 1928 ఏప్రిల్10వ తేదీనాడు ఆయన అవిభక్త బెంగాల్‌లో తూర్పు ప్రాంతంలో జన్మించాడు. ఆయన చాలా తెలివైన విద్యార్థి. ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలోకి ఆకర్షింపబడి స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకర్త అయినాడు. దేశ విభజన తరువాత ఆయన తూర్పు పాకిస్థాన్‌లోనే ఉన్నాడు. భారతదేశంలో జరిగిన ప్రగతిశీల విద్యార్థుల అంతర్జాతీయ సమావేశంలో ఆయన పాకిస్థాన్ ప్రతినిధిగా కూడా పాల్గన్నాడు. అక్కడే ఆయన కిట్టీ బూవ్లా(ఆ తరువాత మీనన్)ను, భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో ఆ తరువాత ప్రముఖులయిన చాలామందిని కలిశాడు. అయితే ఢాకా విశ్వవిద్యాలయంలో తాను చదువుతున్న అర్థశాస్త్రంలో ఎమ్ఏని పూర్తిచేయకుండానే ఆయన భారతదేశానికి వలనగా రావలని వచ్చింది. ఢాకా విశ్వవిద్యాలయంలో తన ఉపాధ్యాయుడుగావున్న ఏకె దాస్‌గుప్తా కూడా భారతదేశానికి తరలివచ్చి బెనారస్ విశ్వవిద్యాలయంలో చేరటంతో అంతిమంగా అశోక్ మిత్రాను ఆ విశ్వవిద్యాలయంలో ఎమ్ ఏ పరీక్ష రాయటానికి అనుమతించారు.

ప్రముఖ మార్క్సిస్టు మేధావి ప్రొఫెసర్ డిపి ముఖర్జీ ఆహ్వానం మేరకు అశోక్ మిత్రా లక్నో విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడిగా చేరాడు. అక్కడే ఆయనకు ఫిరోజ్ గాంధీ, లక్నో విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గావున్న ఆచార్య నరేంద్ర దేవ్ వంటి అనేకమంది ప్రముఖులతో పరిచయం ఏర్పడింది. ప్రముఖ సోషలిస్టు అర్థశాస్త్రవేత్త జాన్ టిన్‌బర్జన్ పర్యవేక్షణలో ఆయన నెదర్‌లాండ్స్‌లో తన డాక్టరేట్ పూర్తిచేశాడు. జాన్ టిన్‌బర్జన్‌కు ఆ తరువాత నోబెల్ ప్రైజ్ వచ్చింది. ఆదాయ పంపిణీ సిద్ధాంతంలో ఒక సంక్లిష్ట సమస్య మీద అశోక్ మిత్రా తన డాక్టరేట్‌ను సమర్పించాడు. అదేమంటే సాముదాయిక గుత్త (ఒలిగోపొలిస్టిక్) పరిస్థితులలో పెట్టుబడిదారులు 'ధరలను నిర్ధారించగల' స్థితిలో ఉంటారు. డబ్బురూపంలోని వేతనాలలో చేసే పెరుగుదలను ఒకవేళ పెట్టుబడిదారులు ధరలను పెంచటం ద్వారా 'సమం' చేసినప్పుడు వేతనాల వాటాను పడిపోకుండా కార్మిక సంఘాలు ఎలా కాపాడగలుగుతాయి? కార్మిక సంఘాలు అలా చేయజాలనప్పుడు వాటి అస్థిత్వాన్ని పెట్టుబడిదారులు ఎందుకు వ్యతిరేకిస్తారు? ముందుగా కాలెస్కీ లేవనెత్తిన ఈ సంక్లిష్ట ప్రశ్నకు మిత్రా చాలా తెలివైన సమాధానాన్ని ఇచ్చాడు. అదేమంటే కార్మిక సంఘాల కార్యాచరణతో మార్కెట్ నిర్మాణం ప్రభావితమౌతుంది. ఈ సమాధానం అశోక్ మిత్రాకు అంతర్జాతీయ కీర్తిని తీసుకొచ్చింది. దీని పర్యవసానంగా ఆవిర్భవించిన సిద్ధాంతాన్ని చాలామంది 'కాలెస్కీ-మిత్రా పంపిణీ సిద్ధాంతం' అని పిలిచారు.

భారతదేశానికి తిరిగివచ్చిన తరువాత భారత ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ ధరల కమిషన్‌కు చైర్మన్‌గా చేరాడు అశోక్ మిత్రా. ఆ తరువాత ఆర్థిక మంత్రిత్వ శాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా చేరాడు. అశోక్ మిత్రావంటి మేధావులు కమ్యూనిస్టు ప్రభుత్వంలో పనిచేయటం ఏమిటని కొందరు ఆశ్చర్యపోయారు. అయితే ఆయన ఇవన్నీ పార్టీ అనుమతితోనే చేశాడు. తన కమ్యూనిస్టు భావాలను, సిపిఐ(ఎం) పట్ల ఆయనకున్న అభిమానాన్ని ఆయన ఎన్నడూ దాయలేదు. అయినప్పటికీ ఆయనను ప్రభుత్వంలోకి తీసుకోవటానికి కారణం అప్పట్లో ఇందిరా గాంధీ 'వామపక్ష ధోరణి'తో ఉండటమే. దాని వ్యక్తీకరణే బ్యాంకుల జాతీయాకరణ.

అయితే ఆమె వామపక్షాలపై దాడిచేసి పశ్చిమ బెంగాల్‌లో అర్ధ ఫాసిస్టు హింసాకాండను ఆరంభించగానే అశోక్ మిత్రా తన ప్రభుత్వ పదవికి రాజీనామా చేసి తన ప్రఖ్యాత గ్రంథం టర్మ్స్ ఆఫ్ ట్రేడ్ అండ్ క్లాస్ రిలేషన్స్‌కు సంబంధించిన పనిలో నిమగ్నమయ్యాడు. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఆయన 'కలకత్తా డైరీ' పేరుతో రాసిన కాలమ్ సిపిఐ(ఎం)ను సమర్థించటమే కాకుండా ఇందిరా గాంధీ, సిద్ధార్థ రేల టెర్రర్ ఎత్తుగడలను తీవ్రంగా ఎండగట్టేది. ఆ చీకటి రోజుల్లో ఈ కాలమ్ నాతోసహా వేలాది పాఠకులను ఉత్తేజపరిచేది. దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించినప్పుడు పశ్చిమ బెంగాల్ పార్టీ నాయకుల సలహామేరకు ఆయన విదేశాలలో ప్రవాసిగా ఉండి దేశంలో జరుగుతున్న అరాచకాలను గురించి విదేశీ జర్నల్స్‌లో రాసేవాడు. ఈ సందర్భంగా ఆయన లండన్ నుంచి వెలువడే ద ఎకనామిస్టు పత్రికలో రాసిన 'సంపాదకుడికి లేఖ'కు చాలా ప్రాధాన్యత ఉన్నది. ఎందుకంటే ఆ ఉత్తరంతో లండన్‌లోని భారత హైకమిషనర్‌కు కోపమొచ్చింది. ఆయన అందుకు ప్రతిగా అనేక 'ప్రతి లేఖలను' రాయించాడు. ఎమర్జన్సీని ఎత్తివేసిన తరువాత 1977వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అశోక్ మిత్రా పశ్చిమ బెంగాల్‌లోని రాస్‌బేహారి నియోజకవర్గం నుంచి సిపిఐ(ఎం) మద్దతుతో గెలిచాడు. జ్యోతిబసు నాయకత్వంలో ఏర్పడిన మొదటి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఆయన ఆర్థిక, అభివృద్ధి, ప్రణాళికా మంత్రిగా చేరాడు. ఆ ప్రభుత్వం అనేక లక్ష్యాలను చేరుకోగలిగింది. ఆ లక్ష్య సాధనలో అశోక్ మిత్రా విశేషంగా

> **❝ ఇదంతా కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలను హేతుబద్ధం చేయాలనే డిమాండ్‌తో దేశానికి పశ్చిమ బెంగాల్ నాయకత్వం వహిస్తున్న కాలంలో జరిగింది. జ్యోతిబసు మద్దతుతో అశోక్ మిత్రా కాంగ్రేసేతర రాష్ట్ర ప్రభుత్వాలను వామపక్ష ప్రభుత్వం తరపున సమీకరించటం జరిగింది. ఆ క్రమంలో ముఖ్యమంత్రులతో అనేక సమావేశాలు జరిగాయి. ❞**

కృషిచేశాడు. గ్రామీణ పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం కనీసం మూడు ప్రధాన విజయాలను సాధించింది. గతంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు ప్రారంభించిన భూపంపిణీ ప్రక్రియను దున్నేవాడికే పంట దక్కాలనే ఉద్దేశంతో కౌలుదార్ల పేర్లను 'ఆపరేషన్ బర్గా' కార్యక్రమం కింద నమోదు చేయటం ద్వారా తిరిగి ప్రారంభించింది. అంటే కౌలు రైతులు పంటలు పండించిన తరువాత ఆ పంటను భూస్వాములు కైవసం చేసుకోకుండా ఉండటానికి ప్రభుత్వం అలా చేసింది. భూస్వామి తన కౌలు తీసుకున్నప్పుడు కౌలుదారుకు ఒక రసీదును ఇవ్వవలసి ఉంటుంది. కౌలుదారు ఆ రసీదును చూపి బ్యాంకుల నుంచి అప్పు తీసుకుంటాడు. ఆ విధంగా భూమిపై కౌలుదార్ల హక్కులను నమోదుచేసి గ్రామీణ పశ్చిమబెంగాల్‌లో వర్గాల బలాబలాల సమతౌల్యాన్ని సమూలంగా మార్చివేసింది. అంతేకాకుండా వ్యవసాయానికి, సాగునీటికి, గ్రామీణ సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచారు. దీనిలో మిత్రా ఫైనాన్స్ నిర్వహణ పాత్ర చాలా ఉన్నది. వలస పాలన కాలం నుంచి సుదీర్ఘకాలం పాటు రాష్ట్రంలో స్తబ్దంగావున్న వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశారు. వలస ప్రభుత్వ పాలనలో నీటిపారుదలపై పెట్టిన పెట్టుబడులపై తగిన ఆదాయం రాకపోవటంతో ఆ స్తబ్దత ఏర్పడింది. దాని పర్యవసానంగా నీటిపారుదల రంగం పూర్తిగా ఉపేక్షింపబడింది. ఆ ఉపేక్షను వామపక్ష ప్రభుత్వం అధిగమించింది. పశ్చిమ బెంగాల్‌లో వ్యవసాయరంగ వృద్ధిరేటు ఒక దశాబ్దం పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువగా ఉన్నది. అనేకయేండ్ల పాటు ఎవరూ పట్టించుకోని పంచాయతీరాజ్ వ్యవస్థకు గణనీయంగా వనరులను, నిర్ణయాధికారాలను ఇవ్వటంలో బెంగాల్ దేశంలోనే ఒక నూతన వరవడిని సృష్టించింది. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా వ్యవసాయానికి, రైతాంగ సమస్యలకు వామపక్ష ప్రభుత్వం చాలా ప్రాధాన్యత ఇచ్చింది. ఇదంతా కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలను హేతుబద్ధం చేయాలనే డిమాండ్‌తో దేశానికి పశ్చిమ బెంగాల్ నాయకత్వం వహిస్తున్న కాలంలో జరిగింది. జ్యోతిబసు మద్దతుతో అశోక్ మిత్రా కాంగ్రేసేతర రాష్ట్ర ప్రభుత్వాలను వామపక్ష ప్రభుత్వం తరపున సమీకరించటం జరిగింది. ఆ క్రమంలో ముఖ్యమంత్రులతో అనేక సమావేశాలు జరిగాయి. అటువంటి ఒక సమావేశం శ్రీనగర్‌లో కూడా జరిగింది. ఇందిరాగాంధీ హత్య జరిగిన తరువాత ఈ సమస్య వెనుకపట్టుపట్టినా భారత రాజకీయాలలో ప్రముఖ స్థానంలో కొనసాగింది. విద్యావిధానానికి సంబంధించిన విషయంపై వామపక్ష ప్రభుత్వం నుంచి అశోక్ మిత్రా 1986 సంవత్సరంలో రాజీనామా చేశాడు. బూర్జువా మీడియా ఊహించినట్టు కాకుండా ఆయన పార్టీతో దగ్గరి సంబంధాలను కొనసాగించాడు. 1990వ దశకంలో నయావుదారవాద ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన తరువాత ఆయన సీపీఐ(ఎం) మద్దతుతో రాజ్యసభకు ఎన్నికయ్యాడు. నయావుదారవాద విధానాలను చీల్చిచెండాడటంలో ఆయన తన పాత్రను పోషించాడు. ఆయన మాట్లాడుతుంటే అందరూ వినమ్రపూర్వకంగా వినేవారు. ఆయన వాణిజ్యం, పరిశ్రమలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి చైర్మన్ అయ్యాడు. ఆ కాలంలో అంతర్జాతీయ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో)లో భాగంగా అమెరికా, ఐరోపాకు చెందిన అభివృద్ధిచెందిన దేశాలు నూతన అంతర్జాతీయ ఆస్తి హక్కుల వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థమీద రుద్దటానికి చేసిన ప్రయత్నానికి వ్యతిరేకంగా ఆయన పోరాడాడు.

అశోక్ మిత్రా బెంగాలి, ఇంగ్లీష్ భాషలలో మంచి రచయిత. ఆయన రాసిన బెంగాలీ వ్యాసాలకు సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. వివిధ కాలాలలో నౌ, ఎకనామిక్ వీక్లీ, దాని తరువాత రూపమైన ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, ద టెలిగ్రాఫ్ పత్రికలలో ఆయన ఆంగ్లంలో రాసిన వ్యాసాలను అనేక వేలమంది చదివారు. అవి జ్ఞానానికి, వైవిధ్యానికి, విశ్లేషణకు వనరుగా ఉన్నాయి. ఆయన రాసిన ఒక వ్యాసం నాకు బాగా గుర్తుంది. మూడవ ప్రపంచ దేశాలలో జాతీయవాదాన్నీ, కమ్యూనిజాన్నీ నాశనం చేయాలనే ఉద్దేశంతో అమెరికన్లు కావాలనే ఇస్లామిక్ మతమౌఢ్యాన్ని ఎలా ప్రోత్సహిస్తున్నారనే విషయం గురించి సవివరంగా సాక్ష్యాధారాలతో ఆయన విశ్లేషించాడు. నేటి ప్రపంచం అమెరికా సృష్టించిన రాక్షసితో ఎలా సతమతమౌతున్నదో మనం చూస్తూనే ఉన్నాం.

అశోక్ మిత్రా అత్యంత వివేకవంతుడు. దయగలవాడు. తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, వాటికోసం పోరాడటానికి సంసిద్ధంగా ఉండే వాడు. అయితే ఆయనకు ఎవరిపట్లా ద్వేషం ఉండేదికాదు. ఆయన వామపక్షానికి ఒక స్తంభంలాగా మద్దతిచ్చేవాడు.


**అనువాదం: నెల్లూరు నరసింహారావు**
**సెల్: 8886396999**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

సందేహాలు
సమాధానాలు



# వామపక్షాల ఐక్య కార్యాచరణ అవసరం

- బి.వి.రాఘవులు

**బివి రాఘవులు గారికి**

**కమ్యూనిస్టు గ్రూపులను కలపవలసిన చారిత్రక బాధ్యత, తక్షణ అవసరం ప్రస్తుత భారతదేశ పరిస్థితులలో ఏర్పడినది. హిందూత్వశక్తులు వారి భావజాలంతో దేశప్రజలను కబళిస్తున్న ఈ పరిస్థితులలో లౌకిక వాదులను కలుపుట అనే పేరుతో ఉనికిని కోల్పోతున్న కాంగ్రెస్ వారికి మనద్వారా అంటే కమ్యూనిస్టుల ద్వారా జీవం పోయవద్దు. కమ్యూనిస్టు గ్రూపులను కలుపుటకు మార్క్సిస్టు మేధావులైన మీకు ఎక్కువ బాధ్యత ఉంది. ఇన్ని గ్రూపులు భారతదేశంలో ఏర్పడటానికి కారణం మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ అయిన మీరు. అందువల్ల తక్షణం భారతదేశంలో ఉన్న అన్ని కమ్యూనిస్టు గ్రూపులను కలిపి భారత ప్రజలకు కాంగ్రెసేతర, బిజెపియేతర రాజకీయ ప్రత్యామ్నాయాన్ని అందించుటకు అవకాశం ఏర్పడుతుందని భావిస్తూ ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.**

**ఇట్లు**
**దొంతా కృష్ణ**
**ఎపి కౌలు రైతు సంఘ కార్యదర్శి**
**పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి.**

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీలుగా అనేక పార్టీలు చలామణి అవుతున్నాయి. సిపిఐ– సిపిఐ(ఎం)లేగాక మార్క్సిస్టు – లెనినిస్టు పార్టీల పేరుతో పదుల సంఖ్యలో ఉన్నాయి. అప్పుడప్పుడు ప్రధాన పార్టీల నుండి చీలిపోయి కొంతమంది కొత్త పార్టీలను పెట్టుకుంటున్నారు. ఈ రకంగా చీలిపోకుండా కమ్యూనిస్టు పార్టీలన్నీ కలిసి ఒకే పార్టీగా ఉంటే బాగుంటుందని అనేక మంది కమ్యూనిస్టు వామపక్ష శ్రేయోభిలాషులు ఆకాంక్షను వ్యక్తం చేస్తుంటారు. ఈ ఆకాంక్షలో నిజాయితీని అందరూ గమనించాలి. అయితే కమ్యూనిస్టు పార్టీల్లో చీలికలు వ్యక్తుల వలనో, పదవి వ్యామోహాల వలనో జరుగుతుంటాయని అనేకమంది భావిస్తుంటారు. కానీ వివిధ దేశాల్లో, మన దేశం యొక్క అనుభవం ఈ అభిప్రాయం సరైంది కాదని వెల్లడిస్తుంది. సామాజిక జీవితంలో వుండే వైరుధ్యాలు, సంక్లిష్టతలు, వర్గ పోరాటంలో ఉండే ఆటుపోట్లు, పాలకవర్గాల ప్రభావాలు తదితరాలన్నీ ఉద్యమాల్లోనూ, కమ్యూనిస్టు పార్టీలోనూ భిన్నాభిప్రాయాలను సృష్టించడంలో, కొన్ని సందర్భాల్లో చీలికలను తేవడానికి దోహదం చేస్తాయి. అలాగే వర్గ పోరాట పరిస్థితులు అనేక సందర్భాల్లో విడి విడిగా, ముక్క చెక్కలుగా ఉన్న ఉద్యమ శక్తులను ఒక చోటకు చేర్చి కదంతొక్కి ఐక్యం కూడా చేస్తుంటాయి. ఈ అంశాలను గమనంలో ఉంచుకోకపోతే వస్తుగతంగా ఆలోచించకుండా నిరాశకు గురవుతాము.

ప్రస్తుతం భారతదేశంలో కమ్యూనిస్టు, వామపక్ష ఐక్యత చాలా అవసరం అనేదానిలో సందేహం లేదు. అందుకోసం అన్ని వైపులా ప్రయత్నం జరగాల్సి వుంది. సిపిఐ(ఎం) వైపు అటువంటి కృషి శాయశక్తులా జరుగుతున్నది. అయితే ఉద్యమాల్లో, పోరాటాల్లో, రాజకీయ రంగంలో ఈ శక్తుల మధ్య ఐకమత్యాన్ని సాధించడం తక్షణ అవసరం. బిజెపి, సంఘపరివార్ శక్తులు మతోన్మాద తీవ్రతను పెంచుతున్న నేపథ్యంలో లౌకిక శక్తులను సమీకరించి మతోన్మాదాన్ని వెనక్కి కొట్టాలన్న వామపక్షాల ఐక్యత ,ఐక్య కార్యాచరణ ఎంతో అవసరం. ఈ కార్యాచరణలో నుండేసైద్ధాంతిక, రాజకీయ విషయాల మీద వ్యత్యాసాలను తగ్గించుకొని ఉమ్మడి అవగాహనకు రావడం సాధ్యమవుతుంది. అటువంటి ఉమ్మడి అవగాహన పెరిగే కొద్దీ సారూప్య భావాలు కలిగిన పార్టీలు కలిసిపోయే సందర్భం కూడా వస్తుంది. అటువంటి పరిణామం మన దేశంలో కూడా జరగాలి. అది ఉద్యమంలో నుండే ఆవిర్భవించాలి. అటువంటి ప్రయత్నం అన్ని వైపుల నుండి జరగాలి. సిపిఐ(ఎం) అందుకు ఎప్పుడూ కృషి చేస్తుంది.

బిజెపి సంఘపరివార్ శక్తుల్ని వెనక్కి కొట్టడం దేశ సమగ్రతను, సమైక్యతను, ప్రజల ఐక్యతను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం విప్లవోద్యమానికి ఎంతో అవసరం. ఇందుకోసం వామపక్ష ప్రజాతంత్ర శక్తులతోపాటు లౌకిక శక్తులను కూడా మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమాల్లోకి సమీకరించాల్సిన అవసరం వుంది. ఈరోజు దేశంలో లౌకిక శక్తులంటే ఒక వామపక్షాలే కాదు. బిజెపి సంఘపరివార్ శక్తులకు వ్యతిరేకంగా ఉండే అనేక బూర్జువా, భూస్వామ్య పార్టీల వెనక కూడా లౌకిక శక్తులున్నాయి. విశాలమైన ఉద్యమాల్లోకి ఆ శక్తులను కూడా సమీకరించుకొని మతోన్మాదాన్ని బలహీనపర్చడం జరగాలి. అందుకే లౌకికవాద పరిరక్షణ కోసం అన్ని శక్తులను ఉద్యమాల్లోకి సమీకరించాలని వామపక్షాలు భావిస్తాయి. అయితే దీనర్థం కాంగ్రెస్ యొక్క బడా బూర్జువా వర్గ స్వభావాన్ని గానీ, ప్రాంతీయ పార్టీల బూర్జువా, భూస్వామ్య వర్గ స్వభావాన్ని గానీ విస్మరించాలని కాదు. వాటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే రాజకీయంగా వాటిపట్ల నిశితంగా, స్వతంత్రంగా వ్యవహరిస్తూనే, లౌకిక వాద పరిరక్షణ కోసం జరిగే ఉద్యమాల్లో కలిసి పనిచేయాలన్నదే సారాంశం. అందువలన కాంగ్రెస్‌ను బ్రతికించి బలపర్చాలనే ఉద్దేశం సిపిఐ(యం)కు లేదు.

**ప్రజాశక్తిలో పనిచేస్తున్న ఆగ్జిలరీ సభ్యులకు జరిగిన అవగాహనా**

## తరగతులలో వచ్చిన ప్రశ్నలు

**జాతీయస్థాయిలో సిపిఎం వైఖరి ఏమిటి? సిపిఎంతో కలిసిపోయే పార్టీలు ఏవి? (రజనీకాంత్, కమల్‌హాసన్ పార్టీల పట్ల మన వైఖరి.)**

జాతీయ స్థాయిలో సిపిఐ(యం) అనుసరించాల్సిన రాజకీయ ఎత్తుగడల విధానాన్ని హైదరాబాదులో జరిగిన పార్టీ 22వ అఖిలభారత మహాసభ నిర్ణయించింది. మతోన్మాదాన్ని దేశ రాజకీయాల్లో శాశ్వతంగా స్థిరపర్చాలని, కార్పొరేట్ శక్తులకనుగుణంగా సరళీకరణ విధానాలను వేగవంతం చేయాలని ప్రయత్నిస్తున్న బిజెపిని, దానికి చోదకశక్తిగా వున్న సంఘ్‌పరివార్‌లను ఓడించడం ప్రధాన కర్తవ్యంగా మహాసభ పేర్కొన్నది. ఇందుకోసం బహుముఖంగా ఉద్యమాలను, పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపిచ్చింది. అఖిలభారత స్థాయిలో కాంగ్రెస్‌తో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసిన మహా గట్బంధన్‌లు గానీ, తృతీయ ప్రత్యామ్నాయాల నిర్మాణం గానీ కాకుండా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేయడంపై రాజకీయ కృషిని వికేంద్రీకరించాలని పార్టీ నిర్ణయించింది. వివిధ రాష్ట్రాల్లో పై కర్తవ్యాలను సాధించేదానికి అనువైన శక్తుల్ని, సంస్థలను గుర్తించి ఉద్యమాల్లోకి సమీకరించాలని పిలుపిచ్చింది. ఇటువంటి కృషికి కొత్తగా రంగంలోకి వస్తున్న రాజకీయ శక్తులు తోడ్పడితే అటువంటి వారిని ఉద్యమాల్లోకి, రాజకీయ పోరాటంలోకి ఆహ్వానిస్తాం. ఉదాహరణకు తమిళనాడులో రజనీకాంత్, కమల్‌హాసన్‌లు, ఆంధ్రాలో పవన్‌కళ్యాణ్, తెలంగాణాలో కోదండరామ్ వంటి వారు పార్టీలను పెట్టి రాజకీయ రంగంలోకి దిగుతామని ప్రకటించారు. వారి విధానాలు వామపక్ష ప్రజాతంత్ర శక్తుల పురోగమనానికి తోడ్పడే పద్ధతిలో, మతోన్మాదాన్ని ఎదుర్కొనే పద్ధతిలో ఉంటే తప్పకుండా వారితో రాజకీయంగా కలిసి పనిజేయడానికి సిద్ధంగా వున్నది. ఏ వ్యక్తి అయినా, ఏ సంస్థకు సంబంధించైనా పార్టీ ఈ వైఖరినే తీసుకుంటుంది. ఇటువంటి శక్తులతో కలిసి పనిచేస్తే మనం బలహీనపడతామేమోనన్న సందేహం కొంత మందికి కలుగుతున్నది. విధానాలతో నిమిత్తం లేకుండా అవకాశవాదంతో మనం వ్యవహరిస్తే తప్పకుండా నష్టం జరుగుతుంది. ఈ అంశాన్ని గత అనుభవం నుండి నేర్చుకొని అటువంటి ఊగిసలాటలకు తావులేకుండా ప్రజల ప్రయోజనం, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల యొక్క ప్రయోజనాన్ని ముఖ్యమైన కొలబద్దగా పెట్టుకొని ఇతర పార్టీలతో వ్యవహరించ దలచుకున్నాం. అయితే వామపక్షాలు మినహా మిగతా ఏ శక్తులతోనూ ఉద్యమాల్లోగానీ, ఎన్నికల్లోగానీ, రాజకీయ అంశాల్లోగానీ కలవకూడదనుకోవడం ఒంటెత్తువాదం అవుతుంది. ఇప్పటికీ విశాలమైన ప్రజానీకం వామపక్షేతర శక్తుల వెనుకనే సమీకరించబడి ఉన్నారు. అటువంటి ప్రజలతో సంబంధాలు పెట్టుకొని వారిని ఉద్యమాల్లోకి సమీకరించాలంటే విధానాల ప్రాతిపదికమీద విశాలమైన ఐక్యతను ఉద్యమాల్లో సాధించాల్సి వుంటుంది.

**ఒన్ బెల్ట్ ఒన్ రోడ్ సిల్క్‌రూట్ ఆహ్వానాన్ని భారత్ తిరస్కరించి, రెండు నెలల అనంతరం చైనాతో రహస్యచర్చ సాగించడాన్ని ఏమనుకోవాలి. అనధికార చర్చలతో దేశానికి ఎలాంటి ప్రయోజనం చేకూరనుందో వివరించగలరు.**

చైనా – భారతదేశాల మధ్య సుహృద్భావం, స్నేహం బలపడడం ఇరుదేశాల అభివృద్ధికి ఎంతో అవసరం. ఈ మధ్యకాలంలో జరిగిన కొన్ని పరిణామాలు అందుకు తోడ్పడేవిగా వున్నాయి. డోక్లాంలో ఉద్రిక్తతలను సర్దుబాటు చేసుకోవడంగానీ, ఉభయ దేశాల అధినేతలు అనధికార చర్చలను పెంపొందించడం గానీ, పరస్పరం వ్యాపారం అభివృద్ధి చేసుకునేందుకు నిర్ణయాలు తీసుకోవడం గానీ మంచి పరిణామాలు. అయితే అమెరికాకు భారతదేశం వ్యూహాత్మక భాగస్వామిగా మారడం, ఇరుదేశాల మధ్య సఖ్యత ఇంకో మెట్టుకు పురోగమించడానికి ఆటంకమయ్యే అవకాశం వుంది. ఇరు దేశాల మధ్య తంపులు పెట్టడానికి అమెరికా ఏ చిన్న అవకాశాన్ని వదులుకోదు. అటువంటి ప్రయత్నాల పట్ల ఇరు దేశాలు అప్రమత్తంగా ఉండి స్నేహ సహకారాలు పెంపొందించుకోవాలని సిపిఐ(ఎం) అభిప్రాయం.

**ఓ వైపు సిరియాలో అమెరికా వేలుపెడుతూ, అదే తరహాలో ఉత్తర కొరియాతో శాంతి ఒప్పందం, అణ్వాయుధాల తగ్గింపు పేరుతో, నాటకాలాడుతూ ఇరాన్‌తో శాంతి ఒప్పందం నుంచి బయటికి రావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి**

ఉత్తర కొరియా – అమెరికా అణు అణ్వాయుధాలపై ఒడంబడిక జరగడం ప్రపంచ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామం. ఉత్తర కొరియాను ఒంటరిపాటు చేసి ఆర్థికంగా దిగ్బంధనం చేసి లొంగదీసుకోవాలనే అమెరికా ప్రయత్నానికి ఇదొక ఎదురుదెబ్బ. కొరియా ప్రాంతంలో ఉత్తర కొరియా – దక్షిణ కొరియాల మధ్య సంబంధాల మెరుగుదలకు కొరియాల ప్రజల ఆకాంక్షలకు తోడ్పడే విధంగా ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడికలను అమెరికా ఎంత చిత్తశుద్ధితో అమలు చేస్తుందో ఇప్పుడే చెప్పలేం. రాబోయే పరిణామాల కోసం మనం వేచి చూడాలి.

**పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా సిపిఎం మూడో స్థానానికి పడిపోయింది. ఎపిలో పవన్‌కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకుంటే మనం నష్టపోయే అవకాశం ఉంటుందేమోనని సందేహిస్తున్నాను.**

పశ్చిమ బెంగాల్‌లో సిపిఐ(ఎం)ను, వామపక్షాలను బలహీనం చేసి వెనక్కి కొట్టాలని అటు తృణముల్ కాంగ్రెస్, ఇటు బిజెపి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నాయి. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, వర్గ ఐక్యతను దెబ్బదీసి మన శ్రేణులను చెదరగొట్టాలని ప్రయత్నం చేస్తున్నాయి. కనీవినీ ఎరుగనంత నిర్బంధాన్ని ప్రయోగించి సాధారణ పార్టీ కార్యకలాపాలను కూడా నిర్వహించుకోవడానికి సాధ్యంగాని పరిస్థితులను తృణమూల్ ప్రభుత్వం సృష్టిస్తున్నది. వీటన్నింటి మూలంగా ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా వ్యవహరిచలేని పరిస్థితి, పార్టీ బహిరంగంగా పాల్గొనలేని స్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి ఎన్నికల్లో మన ఓటింగ్‌పై ప్రభావం చూపింది. అందువల్ల మన ఓటింగ్ శాతం కొంత మేర తగ్గింది. అయితే ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు పార్టీ ప్రయత్నిస్తున్నది. ప్రజలతో సంబంధాలు తెగిపోకుండా ఉద్యమాలు, పోరాటాల ద్వారా మన ప్రజా పునాదిని పునరుద్దరించుకునే ప్రయత్నం చేస్తున్నది. ఈ కృషి ఫలప్రదం కావడానికి కొంత సమయం పడుతుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌తో అవగాహనకు రావడం పొరపాటని పార్టీ భావించింది. అటువంటి రాజకీయ లోపాలు జరగకుండా ముందుకు పోయేందుకు పార్టీ నిర్ణయించుకున్నది.

# న్యాయవ్యవస్థపై పెత్తనానికి కేంద్రం కుట్ర

(13వ పేజీ తరువాయి)

పూర్తిగా వేరుచేయలేము," అని నొక్కి చెప్పడం ఎంతో సమంజసంగా ఉంది.

**భర్తీ చేయని ఖాళీలు**

సుప్రీంకోర్టులో ఉండవలసిన 31 మంది జడ్జిలకుగాను ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తితో సహా 24 మంది మాత్రమే ఉన్నారు. కేరళ నుండి వచ్చిన కురియన్ జోసెఫ్‌తో సహా ఈ ఏడు నలుగురు న్యాయమూర్తులు పదవీవిరమణ చేయనున్నారు. ముగ్గురు వచ్చే రెండు నెలలోనే పదవి విరమణ చేయనున్నారు. అంటే కేంద్రం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వద్ద లేవ నెత్తిన అంశాలన్నిటిని సుప్రీంకోర్టు కొలీజియం నెరవేర్చగలదు. అంతలోపల ఎంపిక చేయ బడిన కే ఎం జోసెఫ్ పేరును కొలీజియంతిరిగి పంపుతుందా, కేంద్రం అతనిని సుప్రీంకోర్టు జడ్జిగా నియమిస్తుందా లేదా వేచి చూడవలసి ఉంది. సుప్రీంకోర్టు సెకెండ్ జడ్జెస్ కేసులో ఇచ్చిన తీర్పునను సరించి మళ్ళీ గనక కొలీజి యం జోసెఫ్ పేరును పంపితే కేంద్రం ఆమో దించి తీరాలి. ఆ రకంగా నిజాయితీ పరుడైన జస్టిస్ జోసెఫ్‌ని ఆమోదించకుండా ఉండడానికి కారణం ఆయన ఉత్తరాఖండ్ విషయంలో ఇచ్చి న తీర్పేనని అనుమానం రాకుండా ఉండాలన్నా కేంద్రం తన వ్యతిరేకత నుండి వెనక్కు తగ్గాలి. ఈ ప్రపంచంలో ఏ దేశంలో నయినా జడ్జీల నియామకం విమర్శలకు తావీయకుండా జరగడం లేదు. అయితే ఇంగ్లాండ్‌లో అమలవు తున్నట్టు, సంస్థాగత యంత్రాంగం ద్వారా దర ఖాస్తులను స్వీకరించడం, దరఖాస్తు దారులతో ముఖాముఖీలు నిర్వహించడం, అర్హతల ఆధా రంగా నియామకాలు చేయడం, వైవిధ్యాలకు ప్రాధాన్యత నివ్వడం వంటి పద్ధతులు భారతదేశ పరిస్థితులకు ప్రయోజనకరంగా ఉంటాయి. కొలీజియం పద్ధతిలో జడ్జీల నియామకం చేయ డం వలన కేంద్రానికి కొలీజియంకి వైరుధ్యాలు తలెత్తడం, అత్యున్నత న్యాయస్థానం విలువ, వైవి ధ్యం దెబ్బతినడం అత్యంత దురదృష్టకరం. కొలీజియం జస్టిస్ జోసెఫ్ నియామకాన్ని తిరిగి పరిశీలిస్తున్న నేపథ్యంలో దాని ప్రభావం భారత దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రతపైన, వైవిధ్యతపైన ఎలా ఉంటుందో అన్న అంశం గమనించాల్సింది.

అనువాదం : కె. ఉషారాణి

# పోరాటాల ద్వారానే మతోన్మాదాన్ని ఓడించగలం

(9వ పేజీ తరువాయి)

పక్షాలతో సహకరించవచ్చు. అవగాహనతో పనిచేయ వచ్చు' అని 2.90 పేరాలో ఉంది. అయితే 2.115లో 'అటువంటి సహకారం ఉండ కూడదు' అన్నట్లు అర్థం వస్తుంది. ఈ వైరు ధ్యాన్ని పరిష్కరించే దానికోసం 2.90లోని పేరా తీసేసి కాంగ్రెస్ పార్టీతో ఏఏ సందర్భంలో అవగాహన ఉండవచ్చు అనేది 2.116లో పేర్కొన్నాం. పార్లమెంటు లోపల, పార్లమెంటు బయట మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులతో విశాలమైన వేదికలు నిర్మించడానికి అవగాహన ఉండవచ్చు అని పేర్కొన్నారు. అదే సందర్భంలో కాంగ్రెస్‌తో రాజకీయ ఒడం బడికలు ఉండవు. ఈ రాజకీయ అవగాహనకు లోబడి ఎన్నికల సందర్భంలో బిజెపికి వ్యతిరే కంగా ఓట్లన్నిటినీ ఒక చోటుకి సమీకరించేం దుకు వీలుగా మనం ఎత్తుగడలు రూపొందించు కుంటామని చెప్పి మనం తీర్మానించుకున్నాం. బిజెపికి వ్యతిరేకంగా ఎన్నికల్లో ఓట్లు చీలకుండా చూసుకోవడానికి కృషి చేయాలనేది మన తీర్మానం. అంటే అందుకోసం కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకొని, అవగాహన కుదుర్చు కోవడం అనికాదు. రాజస్థాన్, బీహారు, గుజ రాత్ ఇటువంటి చోట్ల మన పార్టీ బలం తక్కువ. కానీ కొన్ని ఓట్లు ఉన్నాయి. బిజెపికి వ్యతిరేకంగా ఎవరు ప్రధానమైన ప్రత్యర్థులుంటారో వాళ్లకి ఆ ఓట్లు వేస్తాము. బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తాము. గుజరాత్‌లో కాంగ్రెస్ తప్ప ఇంకోటి లేదు. అందువల్ల బిజెపికి వ్యతిరేకంగా ఎవరు ఓడించగలుగుతారో వారికి ఓట్లేయాలని ప్రచారం చేస్తాం. ఆ రకంగా బిజెపి వ్యతిరేక ఓట్ల సమీకరణకు సాధ్యమైనంత కృషి చేస్తాం. అదే సమయంలో బిజెపి, కాంగ్రెస్‌తో దీటుగా మనకూ ఓట్లున్నాయనుకోండి అప్పుడు తప్పకుండా పోటీ చేస్తాం.

మరో ప్రధానమైన అంశం అఖిల భారత స్థాయిలో కూటములు కట్టే ఆలోచన మనకు లేదు. అటువంటి కూటములతో నష్టపోయాం. మన శక్తి వృథా అయిపోయింది. కాబట్టి అటువంటి ప్రయత్నాలుండవు. అఖిల భారత స్థాయిలో కూటమి కట్టాలంటే అది వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ మాత్రమే. అది ఇవాళ, రేపు సాధ్యపడకపోయినా ఆ దిశలోనే మన ప్రయ త్నాలు సాగుతాయి. బిజెపికి వ్యతిరేకంగా ప్రాం తీయ పార్టీలన్నీ కలిసివస్తామంటే ఆ సందర్భం లో దానిపై నిర్ణయముంటుంది.

స్థూలంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం అనేది ఎన్నికల ఎత్తుగడులు, ఎన్నికల సర్దుబాట్లు ద్వారా సాధించేది కాదు. అది మన అనుభవం. ఎన్నికలు కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కానీ మతోన్మాద శక్తులను దేశంలో బలహీనం చేయాలంటే బహుముఖ కార్యక్రమం చేస్తే తప్ప సాధ్యం కాదు. ఆ దిశలో లోపాలు సరిచేసుకొని పార్టీ బలపడటం మినహా మరో మార్గం లేదు. పార్టీ అఖిల భారత కేంద్రం సామర్థ్యం పెంచుకోవాలని, ఉద్యమ సామర్థ్యం పెంచుకోవాలని కూడా మహాసభ నిర్దేశించింది.

మహాసభ పార్టీ నిబంధనావళికి ఒక సవరణ కూడా చేయడం జరిగింది. ఎన్నికల్లో పాల్గొనే రాజకీయ పార్టీలు భారత రాజ్యాం గంలో చెప్పిన సోషలిజం, లౌకికవాదం, ప్రజా స్వామ్యాలకు కట్టుబడి ఉంటాం అని ఒక డిక్లరేషన్ ఇవ్వాలి. మన నిబంధనావళిలో దానిని చేర్చాం. కేంద్ర కమిటీలో 25 మంది కొత్త వాళ్లను తీసుకున్నారు. పొలిట్‌బ్యూరోలోకి ఒకరిని అదనంగా తీసుకోవడం జరిగింది. ఆ రకంగా కొత్త నాయకత్వాన్ని కూడా ఎన్నుకొని, యువకులు, మహిళలు,సామాజిక తరగతుల కూర్పు పెంచేందుకు ఈ మహాసభలో కృషి జరిగింది. రాజకీయ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోయేరీతిలో నాయకత్వాన్ని ఎన్నుకొని మహాసభ మార్గనిర్దేశం చేసింది.

**(రాఘవులు గారి ప్రసంగానికి వ్యాసరూపం ఇచ్చినవారు బి.అమరనారాయణ)**

# బహుముఖ ప్రజ్ఞాశాలి జక్కా వెంకయ్య

(2వ పేజీ తరువాయి)

బాధ్యతలన్నీ అప్పగించారు. 20వ సంవత్సరం వరకూ, అంటే కమ్యూనిస్టుగా మారే వరకూ ఆయనీ పనులన్నీ సమర్థవంతంగా చేశారు. "ఆ వయసులో కఠోర శ్రమ చేశాను. సాగుకే పరిమితం కాలేదు. భూసారం, నీటి యాజమాన్యం, భూమి కొలత పద్ధతులు వంటివన్నీ క్షుణ్ణంగా పరిశీలించాను. ఇవన్నీ ఉద్యమ కారునిగా ఎదగడానికి నాకెంతో తోడ్పడ్డాయి." అని నెల్లూరు జిల్లా ఉద్యమ ఘట్టాలు రాసే సందర్భంగా స్వయంగా ఈ వ్యాస రచయితతో ఆయన చెప్పిన మాటలివి. ఒకసారి వ్యవసాయ పనిలో ఉండగా వెనక నుంచి శ్రద్ధగా పరిశీలించిన సుందరయ్య కూడా తనను మెచ్చుకున్నారని ప్రత్యేకంగా చెప్పారు.

జక్కా వెంకయ్య 1930 నవబంరు 3న జక్కా రమణారెడ్డి, శంకరమ్మ దంపతులకు పుట్టారు. వారిది భూస్వాముల కుటుంబం. అయినా జెవి జీవితంలోని ఆచరణ పేదల మనిషిగానే నిలిపింది. ఆయన తన పేరు చివర నున్న 'రెడ్డి'ని తొలగించారు. జెవికి ఇద్దరు అక్కలు. తన అక్కకూతురైన చేడిమాల పార్వతమ్మను 1950లో వివాహమాడాడు. శాంతి, అశోక్, జయరామ్, శారద వారి పిల్లలు. జేవీనీ, శేషారెడ్డినీ జెట్టి దశరథ రామిరెడ్డి పార్టీవైపుకు మళ్ళించారు. సిద్ధాంతం అధ్యయనంలోనూ, దాని ఆచరణ పద్ధతిని అనుసరించడంలోనూ డా.రామచంద్రారెడ్డి ప్రభావం ఆ ఇద్దరిపై ఉంది. సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడం, దాని ఆచరణ రూపాలను గుర్తించడం అక్కడే నేర్చుకున్నట్టు జేవీయే మా విద్యార్థి బృందానికి నడిపిన అధ్యయన తరగతుల్లో చెప్పారు. 1980 లలో పార్టీ జిల్లా కమిటీ విద్యార్థి రంగంపై కేంద్రీకరించి అధ్యయన తరగతులు నడిపింది. అందులో చదివే పద్ధతినీ, కమ్యూనిస్టు పదాలను అర్థం చేసుకోవలసిన తీరునూ పూసగుచ్చినట్టు చెప్పారు. సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టే పద్ధతినీ చెప్పేవారు.ఆయన వివరించే తీరును బట్టి పదో తరగతే జెవి విద్యార్హతంటే డిగ్రీలూ, పీజీలూ చదివిన విద్యార్థులు నమ్మేవాళ్ళు కాదు. ఎమర్జెన్సీ కాలంలో జైలు ఆయన అధ్యయన కేంద్రం అయింది. ఖైదీలనేక మంది ఆయన విద్యార్థులయ్యారు. రహస్య జీవితం, ప్రయాణ సమయం ఆయనకు అధ్యయన వేళలుగా మారాయి. చనిపోయే వరకూ సిద్ధాంతం – ఆచరణలపై ఆయన ఆలోచన పదును తగ్గలేదు. మార్క్స్ కేపిటల్ ఆధారంగా మేం రాసిన 'సిందూరం' పుస్తకాన్ని అడిగి మరీ తెప్పించుకున్నారు. ఇచ్చిన ఒక్క పూటలోనే చదివి వినిపించుకున్నారు. అది పరిపూర్ణం కావాలంటే ఇంకా ఏయే అంశాలు చేర్చాలో పెద్ద క్లాసే తీసుకున్నారు. రాయించి కూడా పంపించారు. సిద్ధాంతం పట్ల ఆయన కున్న పట్టుదలకు ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే. పనిచేసే సందర్భంలో ఆచరణ నుంచి సిద్ధాంతాన్ని గుర్తించే పద్ధతిని చెప్పేవారు. ఆయన అనుసరించిన ఈ విధానం ఉద్యమంలో, ప్రత్యేకించి విద్యార్థి ఉద్యమంలో అనేక మందిని నాయకులుగా తీర్చిదిద్దింది.

"కమ్యూనిస్టు చెప్పే మాటకూ – పాటించే ఆచరణకూ మధ్య ఉన్న సంబంధం నుంచే సిద్ధాంతం – ఆచరణల్లో ప్రజలు కమ్యూనిస్టు విలువలను చూస్తారని ఆయన తరచూ చెప్పేవారు. బహుశా ఆ ప్రభావమే కావచ్చు. ఆయన ముతక పైజామా, లేత గోధుమరంగు చొక్కా ధరించేవారు. ఎద్దులరేవులో సంఘం ఆఫీసు ఉన్నప్పుడు రూ.3కు అద్దెకు తీసుకున్న పూరి గుడిసెలో నివసించే వారు. బాలాజీనగర్‌లో నిర్మించిన పార్టీ ఆఫీసులో కూడా చిన్న గదినే తన నివాసంగా చేసుకున్నారు. చెక్క బల్లనే మంచంగా వాడారు. తరిగిన కూరగాయలు బియ్యంలో వేసి ఉడికించేవారు. దానిలో ఉప్పు, కారం దట్టించి అదే ఆహారంగా తినేవారు. ఈ ఆచరణే ఆయనది భూస్వామ్య కుటుంబం అనే విషయాన్నే మరిపించింది. అందుకే ప్రజలు ఆయన్ని పిలిచే తీరులోనే సొంతం చేసుకున్నారు. పెద్దవాళ్ళయితే "ఎంకయ్య ఉన్నాడా?" అనీ, చిన్న వాళ్ళయితే "వెంకన్న ఉన్నాడా?" అనే పిలుపుల్లో ఏక వచన ప్రయోగం ఆత్మీయతకు చిహ్నంగా ఉండేది. 1980 పార్లమెంటుకు మధ్యంతర ఎన్నికలు జరిగినప్పుడు చదువు కుంటూ ఎన్నికల ఆఫీసు కార్యదర్శిగా నేను పనిచేశాను. రాత్రి 10 గంటల సమయంలో ఓ వృద్ధుడు వచ్చి జెవిని కలవాలన్నారు. "ఆయన ఎప్పుడో వస్తారు, కలవడం కష్టం" అని చెప్పినా ఆఫీసులోనే ఉండిపోయారు. రాత్రి 12 గంటలకు వచ్చిన జెవి నన్ను లేపి సెంటరు వివరాలన్నీ తెలుసుకున్నారు. చేయాల్సిన పనులు చెప్పి వెళుతుండగా ఆ వృద్ధుడు జెవిని కలిశారు. ఆ సమయంలోనూ ఆయన సమస్యను సావధానంగా విన్నారు. స్థానిక నాయకులకు ఒక లేఖ రాసిచ్చి వారిని కలిస్తే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఎంత పనిచేసి, ఏ సమయానికి వచ్చినా ప్రజల్ని చూస్తే ఆయనకు అలసట రాదు.

1980లో ఇప్పుడుంటున్న ఆఫీసు నిర్మాణం జరుగుతోంది. అందుకోసం ఒక సీనియర్ కమ్యూనిస్టు అయిన రైతును పర్యవేక్షణకు పిలిపించారు. ఒకరోజు ఆయన సరిగా చేయని పనిని చూపిస్తూ "ఏమిటీ మాలా మాదిగ పని" అన్నారు. ఆ సమయంలో జెవి కూడా అక్కడే పనిచేస్తున్నారు. "ఓ.... అన్న! అలా మరోసారి అనొద్దు" అని సున్నితంగా మందలించారు. బాగా చేయని పనిని చూపుతూ పదే పదే అవే మాటలు వాడారు. మూడోసారీ అనడంతో ఇక భరించలేని జెవి ఒక ఇటుకను తీసుకుని విసురుగా విసిరారు. 'మళ్ళీ మాల మాదిగ' అంటే చంపేస్తానన్నారు. అప్పటికి గాని ఆయనకు పొరపాటు అర్థం కాలేదు. ప్రయాణాల్లో ఎవరైనా ఆయన మోసే బ్యాగు తీసుకోబోతే ఇచ్చేవారు కాదు. ''మన బరువే మనం మోసుకోకపోతే ఇతరుల బరువేం మోస్తాం?" అనేవారు. ఇలా ప్రతి విషయంలో కమ్యూనిస్టు ఆచరణకూ, ప్రజలతో మమేకతకూ ఆయన ప్రాధాన్యతనిచ్చేవారు. అందుకే 1985 ఎన్నికల్లో అభ్యర్థి పరిచయంలో "జిల్లాలోని ప్రజలకు ఎప్పుడు, ఎక్కడ, ఏ కష్టం కలిగినా నేరుగా ఆయన్ని కలిసి చెప్పుకునేవారు.... సౌమ్యత, నమ్రత ఆయన ఆస్తి. పరిశీలన, విశ్లేషణ, కార్యాచరణ ఆయన జీవిత పెట్టుబడి. పేద రైతాంగం అభ్యున్నతి ఆయన ఊపిరి" అని రాసిన ప్రతి అక్షరం అక్షర సత్యం.

అధ్యయనాన్ని ఆచరణలో పెట్టే పద్ధతి జెవి జీవితం నుంచి నేర్చుకోవలసిన ముఖ్యాంశం. నెల్లూరు జిల్లాలో సిపిఎం 1970వ దశాబ్దంలో భూ సమస్యపై కేంద్రీకరించి పనిచేసింది. ఇందులో వర్గ వైరుధ్యాలను గుర్తిస్తూ, శత్రువును ఒంటరిపాటు చేస్తూ, కష్టజీవుల చుట్టూ పేద, మధ్యతరగతి రైతాంగాన్ని కూడగడుతూ ఉద్యమాన్ని విజయతీరాల వైపు నడిపించడంలో ఆయనదే ప్రధాన పాత్ర.బంజరు భూములను పేదలకు పంచాలనే డిమాండ్‌తో ఈ పోరాటం మొదలైంది. ఇది విస్తృతమయ్యే కొద్దీ బంజరు భూముల్లో అత్యధికం భూస్వాముల ఆక్రమణలో ఉన్నట్టు తేలింది. వాటిని గుర్తించి పేదలకు పంచాలంటే తమ వద్ద తగినంత మంది సర్వేయర్లు లేరనీ, తామేమీ చేయలేమనీ అధికారులు చేతులెత్తేశారు. ఈ భూములు పంపిణీ చేయించాలంటే బంజర్లను సర్వేచేసి తేల్చే పని సిపిఎం గానే చేయాలని జెవి పెట్టిన ప్రతిపాదనను జిల్లా కమిటీ ఆమోదించింది. భూములపై అవగాహన ఉన్న 30 మందిని ఎంపికచేసి 1978లో పైనాపురం వద్ద శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పడక, వంట అన్నీ పొల్లాలో ఏర్పాటు చేసుకున్న తాటాకు పాకల్లోనే సాగాయి. ఈ బృందమే జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూస్వాముల ఆక్రమణలో ఉన్న బంజర్లను సర్వేచేసి తేల్చింది. వాటిని పేదలకు పంచాలంటూ అధికారులకు అర్జీలు ఇచ్చారు. దీంతో భూస్వాములు అగ్రహోదగ్రులయ్యారు.



పోరాటంలో పాల్గొన్న జక్కా వెంకయ్యను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పోలీసులను ప్రభావితం చేసి ఉద్యమకారులపైకి ఉసిగొల్పారు. "మేం భూస్వాముల భూములు ఆక్రమించలేదు. వారు ఆక్రమించిన బంజర్లను చట్టం ప్రకారం పేదలకు పంచమంటున్నాం. ప్రభుత్వ నిర్ణయానుసారం ఈ పని అధికారులనే చేయమన్నాం. అందుకు తగిన ఆధారాలివిగో. చట్టానికి రక్షణగా మీరు నిలవండి" అంటూ జెవియే అనేక గ్రామాల్లో పోలీసులకు చెప్పారు. ఆ ఆధారాలు చూశాక పోలీసులకు నోరు పెగల్లేదు. తాము పొలాల వద్దకొస్తే పేదలకే అండగా నిలవాల్సి వస్తుందని భూస్వాములకు చెప్పి వారు తప్పుకున్నారు. ఇది 1979లో రాష్ట్ర వ్యాపితంగా జరిగినా, ప్రత్యేకించి నెల్లూరు జిల్లాలో ఉధృతంగా సాగింది. తండోప తండాలుగా పేదలు కదలడం, బంజర్లలో ఎర్రజెండాలు పాతడం వంటి దృశ్యాలు నెల్లూరు జిల్లాలో మరో స్వాతంత్ర్య పోరాటాన్ని తలపింప చేశాయని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వంటి పత్రికలే వ్యాఖ్యానించాయి. అప్పుడు పంచిన భూములను అనుభవిస్తున్న కుటుంబాలు ఇప్పటికీ నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. ఆయన 1985–89, 1995–99లో ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు కూడా ఉన్న కొద్ది నీటితోనే సోమశిల, కనిగిరి రిజర్వాయర్ల కింద ఆయకట్టు భూములన్నీ పండించే ఇంజనీరింగ్ సూచనలు చేశారు. అల్లూరు ప్రాంత రైతుల మాటలు విని అప్పటి మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సోమశిల నీటిని ఒకే దఫా వదలాలని ఆదేశించారు. జెవి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు ఇది జరిగింది. వెంటనే జిల్లా పరిషత్ సమావేశం జరపాలని జెవి కోరారు. సమావేశం ఏర్పాటైంది. ఆరుతడుల కింద దఫదఫాలుగా నీటిని వదిలితేనే మొత్తంగా ఆయకట్టు పండుతుందని చెప్పారు. మంత్రి చెప్పినట్టు నీరొదిలితే అత్యధిక భాగం భూములు పండవని చెప్పారు. మంత్రి ఆదేశం అమలు కావడం ప్రధానమో, భూములు పండటం ప్రధానమో ఆలోచించమని చెప్పి జెవి కూర్చున్నారు. ఇంజనీర్లూ ఈ వాదనను బలపర్చడంతో జెవి చెప్పినట్టే నీటిని విడుదల చేయమని మంత్రి అన్నారు. దాంతో మొత్తం భూమి పండింది. రెండో దఫా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా సోమశిల, కనిగిరి రిజర్వాయర్లలో ఉన్న 13 టిఎంసిలతో 90 వేల ఎకరాలే పండుతాయనీ, మిగిలిన రెండు లక్షల ఎకరాల్లో మెట్ట పంటలు వేయాలనీ కలెక్టరు సూచించినప్పుడు కూడా జెవి ఇలాగే స్పందించారు. ఆరుతడి పద్ధతుల్లో నీటిని విడుదల చేయడం వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించి మొత్తం భూములు పండించే సూచనలు చేశారు. నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట అధ్యయనం చేయడంలో ఇక్కడ జెవి ప్రత్యేకత కనిపిస్తోంది. తుపాన్లప్పుడు గూడూరు డివిజన్‌లోని గొలుసుకట్టు చెరువులు వరుసగా తెగుతూ గ్రామాలను ముంపుకు గురిచేస్తున్నప్పుడు కూడా ఆయన పరిశీలన ఇలాగే సాగింది. నీరు ఎక్కువైనప్పుడు బయటకు తరలే కలుజు (అలుగు) విధానం శాస్త్రీయంగా లేకపోవడం, చెరువు కట్ట పై భాగాల నిర్మాణం లోపభూయిష్టంగా ఉండటంలోని లోపాలను గుర్తించారు. "గంగాళం సిద్ధాంతం(ఉదాహరణ)"తో దీన్ని వివరించారు. గంగాళం నిండినా తెగదు. నీరే పొర్లుతుంది. అలుగు ప్రవాహాన్ని విస్తృత పర్చడం, చెరువు నిండినప్పుడు పొర్లి ప్రవహించే చెరువుకట్ట ప్రాంతాలను పటిష్టం చేయడం, మరి ఎక్కువైతే కట్టపై నుంచే పారే నిర్మాణాలు చేపట్టడం వల్ల చాలా వరకు ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. దీన్ని అమలు జరిపాకే గూడూరు డివిజన్‌లో ఈ సమస్య తీవ్రత తగ్గింది. ఇలా వర్గ, వర్గేతర, సమస్యలన్నింటిలోనూ అధ్యయనం పరిష్కారం నిర్దిష్టంగా ఉండేవి.

'వర్గ శత్రువును ఒంటరి చేసి కష్టజీవుల చుట్టూ మిత్రులను కూడగట్టడంలో ఎత్తుగడలే ప్రధానం' అని భావించిన జెవి వాటిని ఆచరణలో చూపారు. ఇప్పటికీ ఇది అనుసరించదగిన పాఠంగానే గోచరిస్తుంది. భూపోరాటంలో భాగంగా సాగిన బంజర్ల ఆక్రమణ సందర్భంగా భూస్వాములు పేద సన్నకారు రైతులను పేదలకూ, సిపిఎం కార్యకర్తలకూ వ్యతిరేకంగా రెచ్చగొట్టారు. ''ఇవాళ భూములకోసం వచ్చినోళ్ళు, రేపు మీ పెళ్ళాల కోసం వస్తారు" అంటూ సెంటిమెంటుతో రెచ్చగొట్టారు. దీన్ని సిపిఎం పసిగట్టింది. 10 ఎకరాల లోపు పొలం కలిగిన రైతుల బంజర్ల జోలికి తాము రాబోమనీ, ఆ పైబడినోళ్ళు ఆక్రమించిన బంజర్లనే తాము పంచమంటున్నామనే ఎత్తుగడను పార్టీ చేపట్టింది. దీన్ని విస్తృతంగా పేద, సన్నకారు రైతాంగంలోకి తీసుకెళ్లింది. దీంతో చిన్నరైతులు తటస్థులయ్యారు. భూస్వాముల ఒంటరులయ్యారు. కూలి పోరాటాల్లో కూడా భూస్వాములను ఒంటరి చేసి వ్యవసాయ కార్మికుల చుట్టూ చిన్న సన్నకారు రైతాంగాన్ని కూడగట్టే ఎత్తుగడలను దామరమడుగులో ప్రారంభించి పరిసర గ్రామాలకూ విస్తరింపచేశారు. ప్రతి జట్టులో ఎడ పిల్లలు, యువకులు, వృద్ధులూ ఉండేలా జట్టులు ఏర్పాటు చేశారు. పని నేర్చుకుని పిల్లలు త్వరగా ఎదిగిరావడం, వృద్ధులున్నా యువకులు వేగంగా చేయడం వల్ల పనిలో లోటు కనిపించకపోవడంతో రైతులూ దీన్ని ఆమోదించారు. కుటుంబమంతా పనిలో ఉండటంతో పేదల ఆదాయాలూ పెరిగాయి. భూస్వాముల ఒత్తిడి ప్రకారం కాకుండా ముందుగా నమోదు చేసుకున్న రైతుల జాబితా ప్రకారం కూలీలను పంపే పద్ధతి ఉపయోగకరం అని చిన్న, మధ్య తరగతి రైతాంగానికి అనిపించింది. 'చిన్న రైతులు ఒకరి పొలాల్లో ఒకరు బదులుకు పనిచేసే విధానా'న్ని వ్యవసాయ కార్మిక సంఘం ఆమోదించడంతో ఆ రైతులూ కూలీలకు అండగా నిలిచారు.

"లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎత్తుగడల్లోనూ విజయాలు సాధించాలి. అప్పుడే జనం మన వెంట నడుస్తారు" అని చెప్పడమే కాదు, దాన్ని అనేక గ్రామాల్లో ఆచరణలో పెట్టారు. తాను పార్టీలోకొచ్చిన తొలి సంవత్సరంలోనే దామరమడుగు గ్రామంలో అనుసరించి విజయాలు సాధించారు. అక్కడ పార్టీ శాఖ ఏర్పడిన 1953లో జరిగిన కూలి సమ్మె సందర్భంగా జెవితో సహా పార్టీనాయకుల మీద భూస్వామ్య గూండాలు దాడి చేశారు. నాయకుల తలలు పగిలి కారిన రక్తంతో బట్టలు ఎర్రబారాయి. ఈ దృశ్యాన్ని చూసిన గ్రామపేదలు భూస్వాము

లపై ఎదురుదాడికి సిద్ధమయ్యారు. అయినా నాయకులు వారించారు. "మనం సాధించాల్సింది ప్రతీకారం కాదు, కూలి పెంచుకోవడంలో విజయం" అని గాయపడిన నాయకులే చెప్పడంతో పేదలు శిరసావహించక తప్పలేదు. ఈ సంయమనాన్ని ప్రత్యక్షంగా చూసిన అధికారులు పోలీసులను తటస్థం చేసి కూలి పెంపుకు భూస్వాములను ఒప్పించారు. దీంతో అహం దెబ్బతిన్న భూస్వాములు 1967 కూలి పెంపు సమ్మె సందర్భంగా పోటీ కూలీలతో ఘర్షణలకు సిద్ధమయ్యారు. స్థానిక కూలీలు అందులోని ప్రమాదాన్ని విడమర్చి చెప్పి వారిని వెనక్కు పంపించారు. దీంతో పిచ్చెక్కిన భూస్వాములు 1969లో కమ్యూనిస్టులకు బలమైన ప్రాంతంలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించారు. పంచాయతీలో గెలిచిన సిపిఎం అధికారాన్ని సవాల్ చేశారు. అది కమ్యూనిస్టుల స్థావరం కావడంతో భూస్వాముల ఆటలు సాగక తోక ముడిచారు. భూస్వాముల కవ్వింపు చర్యలను ఎప్పటికప్పుడు గ్రామస్తుల్లోనే కాకుండా పరిసర గ్రామాల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి భూస్వాములను ఒంటరిపాటు చేశారు. దీంతో సిపిఎంకు ప్రజామద్దతు పెరిగింది. ఊరందరికీ ఉపయోగపడేలా వడ్రంగికి ఇచ్చిన పంచాయతీ స్థలాన్ని ఆక్రమించడం ద్వారా (ఇది భూస్వాములకు బలమైన ప్రాంతంలో ఉంది) మళ్ళీ భూస్వాములు కయ్యానికి దిగారు. ఆత్మరక్షణ చేసుకుంటూనే పంచాయతీ తీర్మానం మేరకు దాన్ని పొలం పనుల వృత్తి పరికరాలు తయారు చేసే వడ్రంగులకే ఉంచేలా చూడాలని పార్టీ తీర్మానించింది. షెడ్డును కూల్చే భూస్వాముల పన్నాగాన్ని ఎదుర్కోవాలని నిర్ణయించింది. షెడ్డును కూల్చే పనికి భారీ సంఖ్యలో అక్కడికి చేరిన ప్రజలు అడ్డుపడ్డారు. ఉప్పరి తట్టలు, చేటలు అడ్డం పెట్టుకుని భూస్వాములు రువ్వే రాళ్ళు తగలకుండా ముందుకు సాగారు. భూస్వామ్య గూండాలను వెనక్కుకొట్టే సమయంలో అంకులయ్య, ఇంకో కార్యకర్త సమూహాన్ని దాటి ముందుకురికారు. వారిని కత్తులతో పొడిచారు. గొడ్డళ్ళతో నరికారు. అంకులయ్య అక్కడికక్కడే చనిపోయాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. "ఈ దాడిని తిప్పికొడితేనే పేదలు నిలబడతారు. పార్టీ బతుకుతుంది" అని జెవి చెప్పిన మాటలు అర్థం అయ్యాయి. ఈ దశలో ఒక్క ఉదుటున ప్రజలు దూకిన తీరుకు దడిసిన భూస్వాములు పలాయనం చిత్తగించారు. వారిలోనూ ఒకరు చనిపోయారు. అయినా ప్రజలు ఈ ఘటనలో కమ్యూనిస్టు పార్టీ ప్రదర్శించిన నిబ్బరాన్నీ, దాడిని తిప్పికొట్టిన తీరునూ హర్షించారు. అప్పటి నుంచి గ్రామంలోనూ పంచాయతీలోనూ సిపిఎం ఎదురులేని శక్తిగా బలపడింది. ప్రతిగ్రామంలో 'ఎత్తుగడల్లో విజయం సాధించడమంటే ఇదే' అనే పాఠాన్ని గ్రామ శాఖకు నేర్పారు. ఇక్కడే కాదు, పెనుబర్తి గ్రామంలో స్వార్థపరులైన నాయకుల మాటలు నమ్మి నష్టపోయిన దళితులను సిపిఎం చేరదీసింది. తాము చెప్పిన ఎత్తుగడలకు భిన్నంగా వ్యవహరించడం వల్ల జరిగిన నష్టాన్ని గుర్తింపజేసింది. తిరిగి గ్రామంలో దళితులు నిలదొక్కుకునే పరిస్థితులు కల్పించింది. ఇలా అనేక గ్రామాల్లో వర్గ అంశం, ప్రజల్లో వర్గ సమీకరణలను గమనిస్తూ ప్రతి గ్రామంలో విజయాన్ని సాధించే ఎత్తుగడలతో పార్టీని నడుపుతూ ఉద్యమాన్ని విస్తరింపచేశారు.

1977లో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీనీ పార్టీ విస్తరణకు అనుగుణంగా ప్లాన్ చేశారు. కొత్తగా కావలి, గూడూరు, ఉదయగిరి, అల్లూరు, పొదలకూరు ఏరియాల్లో కార్యాలయాలు పెట్టారు. పూర్తికాలం పనిచేసే బాధ్యులనూ ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. జిల్లాలోని విద్యార్థి, యువజన, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నుంచి ఆర్గనైజర్లను నిర్ణయించి ప్రజల మధ్య పనీ, ప్రచారం, రాజకీయ బృందాల నేర్పర్చడంలో మెళకువలపై శిక్షణనిచ్చారు. కొత్తగా ఏర్పడిన అప్పటి జనతా పార్టీతో కలయిక వల్ల వచ్చే కొత్త అవకాశాలపై అంచనానిచ్చారు. వీరందరూ పార్టీ నిర్ణయానుసారం కాలినడకనే గ్రామాల్లో తిరిగారు. ప్రజలు పెట్టింది తిన్నారు. వీలైనచోట వాళ్ళ ఇళ్లలోనే ఉంటూ రాజకీయ కేంద్రాల ఏర్పాటుకు పనికొచ్చే వారిని గుర్తించారు. ఎక్కడా స్థావరం దొరకనప్పుడు వీధి అరుగులపై, ప్రభుత్వ బడుల్లో పడుకుని ఎన్నికల్లో ప్రజాభిమానం చూరగొనే కొత్త ఎత్తుగడలను అనుసరించారు. ఇలా ఎన్నికలనూ పార్టీ విస్తరణ పోరాటంగా మార్చారు.

శ్రామికుల పోరాటాలను అణచడానికి శతృవు ఆశ్రయించే 'పోలీసు' పాత్రను తటస్థం చేయడం, శతృవును ఒంటరి చేయడం, ఎదుర్కోవలసి వచ్చినప్పుడు అనుసరించాల్సిన సూక్ష్మాలను (ఎత్తుగడలను) కూడా గుర్తించడంలోనూ, వాటిని ఆయుధాలుగా కేడరుకు అందించడంలోనూ జెవి ప్రత్యేకత ఉంది. భూపోరాటంలో చట్టాన్నే పోలీసుల ఎదుటపెట్టి ఎలా తటస్థం చేశారో ముందు భాగంలో చూశాం. సాహసోపేతమైన పోరాటాల్లో జెవి ప్రత్యక్షంగా నిలిచి కమాండరులాగా పోరాట శ్రేణులను నడిపేవారు. రహస్య జీవితం గడుపుతున్నప్పుడు కూడా బాహాటంగా పోరుభూమిలో నిలిచేవారు. దామరమడుగులో భూస్వాములకూ, పార్టీ శ్రేణులకూ మధ్య నిర్ణయాత్మక పోరాటం జరిగే సమయంలో జెవి రహస్య జీవితంలో ఉన్నారు. అయినా ఎదురయ్యే పరిణామాలను లెక్కజేయకుండా ఆ పోరాట విజయం కోసం నేరుగా రంగంలోకి వచ్చారు. అంకులయ్య మరణం కారణంగా పార్టీ శ్రేణుల్లో మనో నిబ్బరం దెబ్బ తినకుండా నిలబెట్టారు. విజయం సాధించే, ప్రజలను మెప్పించే ఎత్తుగడలతో పార్టీదే పై చేయి అయ్యేలా చేశారు. భూపోరాటం సందర్భంగా ఎల్లాయపాలెంలో పోలీసుల, భూస్వాముల దాడిని ఎదుర్కొంటూ భూముల సాధనకు పోరాటం సాగించిన కష్టజీవులపై పోలీసులు కాల్పులు జరిపారు. గాలంకి తిరుపాలు మరణించాడు. రమణమ్మకు చేయి పోయింది. అనేక మంది గాయపడ్డారు. ఈ పోరాటం సందర్భంగా కూడా ముందస్తు అరెస్టు పన్నాగాలకు దొరక్కుండా జెవి రహస్యంగా ఉంటూ ఉద్యమాన్ని నడిపారు. ఈ కాల్పుల విషయం తెలిసి ఆయన నేరుగా పోరుభూమిగా మారిన పొల్లాల్లోకి వచ్చారు. ఒకరి మృతీ, పలువురికి తీవ్ర గాయాలూ... ఈ స్థితిలో శతృ బలగాలను అంచనా వేసుకున్న జెవి పోరాటాన్ని కొనసాగించే ప్రయత్నం చేయలేదు. గాయపడిన వారిని ఆస్పత్రికి చేర్చే సూచనలను స్థానిక నాయకత్వానికి చేసి పోలీసులకు లొంగిపోయారు. ఆయన ఆ నిర్ణయం తీసుకోకుంటే ఇంకా భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చేది. భూసమస్యపై కేసు నడిచేలా ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. ఆ తరువాతే పోలీసులకు సరెండర్ అయ్యారు.

ఎమర్జెన్సీ అనంతరం సూళ్ళూరుపేట అభిరామా కాటన్ మిల్లులో సమ్మెకు నాయకత్వం వహించిన సందర్భంగా శ్రీహరిపై దాడికి మిల్లు యాజమాన్యం పథకం రూపొందించింది. పోలీసులనుపయోగించి సమ్మెకు నాయకత్వం వహించిన 15 మందిపై హత్యాయత్నం కేసులు మోపారు. రహస్యంగా ఉంటూ సమ్మెను నడుపుతున్న శ్రీహరి హత్యకు పథకాలు రూపొందించారని అక్కడి నాయకులు జిల్లా కమిటీకి సమాచారం అందించారు. శ్రీహరిని రక్షించుకుంటూ అక్కడి ఉద్యమాన్ని కాపాడేందుకు స్వయంగా జెవి అక్కడికి చేరుకున్నారు. ఉద్యమకారులకు తగిన సూచనలు చేసి శ్రీహరిని కారులో ఎక్కించుకుని శతృవుకు అంతుబట్టని దారులగుండా నెల్లూరుకు చేర్చారు. మాల కొండారెడ్డి, మస్తాన్‌లపై కూడా దాడులు జరిగే అవకాశముందని తెలిసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అయినా వారు లెక్కచేయకుండా నిత్య కార్యకలాపాల్లో ఉండటంతో 1985లో మాలకొండారెడ్డినీ, 1987లో మస్తాన్‌నూ కిరాతకంగా హత్య చేశారు. కాని హంతకులకు శిక్షలు వేయించడంలోనూ, పరారవుతున్న వారిని వేటాడి బంధించడంలోనూ జెవి ఆధ్వ

ర్యంలో పార్టీ తీసుకున్న నిర్ణయాలు కార్యకర్తల్లో మనోనిబ్బరాన్ని నింపాయి. కేడర్‌ను రక్షించుకుంటేనే పార్టీనీ రక్షించుకోగలమన్న లెనిన్ ఉపదేశాలను అమలు జరిపిన తీరుకు ఇవి కొన్ని ఉదాహరణలు.

కమ్యూనిస్టు ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ కష్టజీవుల్లో కలిసిపోతేనే ఉద్యమ నిర్మాణంలో విజేత అవుతారన్న అంశాన్నీ ఆయన ఆచరించి చూపారు. తానొచ్చిన వర్గ లక్షణాలకు భిన్నమైన రీతిలో శ్రామికవర్గ లక్షణాలతో జీవనం సాగించారు. 1948లో పార్టీపై నిర్బంధం కొనసాగిన కాలంలో నెల్లూరులో కమ్యూనిస్టు పార్టీకి ఆఫీసు లేకుండా పోయింది. 1951లో ఆయన పార్టీ సభ్యుడైన సంతవ్సరమే ఒక చిన్న గదిని అద్దెకు తీసుకొని పార్టీ ఆఫీసును ఏర్పాటు చేశారు. అదే అప్పటి పార్టీ కేంద్రమైంది. 1952 ఎన్నికలకు ముందు పార్టీ బహిరంగంగా పని చేయడం ప్రారంభించాక ఆఫీసును కాపు వీధికి మార్చారు. ఇంతకన్నా కఠోర పరీక్షను నక్సలైట్లు చీలాక జెవి ఎదుర్కొన్నారు. జిల్లా కమిటీలో ఉన్న 17 మందిలో 15 మంది నక్సలైట్లతో కొట్టుకుపోయారు. వృద్ధుడైన భీమవరపు శేషయ్య యువకునిగా ఉన్న జక్కా వెంకయ్య సిపిఎంతో నిలిచారు. ఆచరణలో జక్కా వెంకయ్య ఒక్కరే పార్టీ పునర్నిర్మాణ బాధ్యతల్లో తలదూర్చాల్సి వచ్చింది. మినిట్స్, ఇతరత్రా డాక్యుమెంట్స్‌ను ఒక ట్రంకు పెట్టెలో పెట్టుకుని 'ట్రంకు పెట్టె ఆఫీసు'తో పార్టీని నడిపారు. కొన్నాళ్ళు డా.రామచంద్రారెడ్డి ఆస్పత్రిలో ఒక గదిలో ఉన్నారు. అది రోగులకు ఇబ్బంది కరంగా మారడంతో ఆస్పత్రి వెనుక రెండో వీధిలో ఉన్న అప్పటి విజయశ్రీ లాడ్జి పక్కన ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. ఈ దశలోనే శ్రీహరిని, చిట్టేటి రమణయ్యని జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత మాలకొండారెడ్డి వచ్చారు. వచ్చేపోయే వాళ్ళతో ఇబ్బందికరంగా మారడంతో ఆ ఇంటిని ఖాళీ చేశారు. తరువాత ఎద్దులరేవు సంఘంలోని గిరిజన కాలనీలో రూ.300 పెట్టి ఒక స్థలం కొన్నారు. దాతలిచ్చిన రేకులతో పార్టీ ఆఫీసు నిర్మించారు. దానిని ఆనుకుని ఉన్న గిరిజనుల గుడిసెను జెవి రూ.3కు అద్దెకు తీసుకుని నివాసమున్నారు. ఆ తరువాత ఆఫీసు పక్కనే వి.శ్రీహరి కుటుంబానికి మరో రెల్లుగడ్డి ఇంటిని నిర్మించి ఇచ్చారు. హోటళ్ళలో పనిచేసే స్థానికులైన గిరిజనులు మిగిలిపోయిన వంటకాలను బుట్టల్లో తెచ్చి చౌకగా అమ్మేవారు. వీటిని 'బుట్టకూళ్ళు' అనేవారు. జెవి, శ్రీహరితో సహా భూపోరాటం కేసుల్లో పార్టీ ఆఫీసుకొచ్చే వాళ్ళందరూ 'ఆర్థిక పొదుపు'లో భాగంగా వాటినే కొని తినేవారు. ఇందువల్ల 'చౌక అన్నం' గిరిజనులకు కొరవడింది. పేదల కడుపు మాడ్చేలా పార్టీ ఆచరణ ఉండకూడదని ప్రత్యామ్నాయం ఏర్పాటుచేసుకున్నారు. భూస్వాముల కుటుంబం నుంచి వచ్చిన జక్కా వెంకయ్య, బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చిన వి.శ్రీహరి ఇంతటి కఠోర జీవితాన్ని, ప్రత్యేకించి కష్టజీవులతో సమానమైన జీవితాన్ని గిరిజనుల మధ్య గడుపుతుంటే.. ప్రజా ఉద్యమాలకు దూరంగా ఉండాలని దేశభక్తి కలిగిన ఏ యువకుడైనా అనుకోగలరా? ఇలాంటి సిద్ధాంతం, ఆచరణలతో ప్రేరణ పొందిన అనేక మందిలో విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తున్న జెవి కొడుకు అశోక్, ప్రస్తుత కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు, ఈ వ్యాస రచయిత వంటి వారు వరుసగా పూర్తికాలం కార్యకర్తలుగా వచ్చారు. భూపోరాటం కేసుల్లో వాయిదాకు వచ్చేవారు ఇంటినుంచి అన్నం మూట కట్టించుకుని నెల్లూరు ఆఫీసుకు తెచ్చేవారు. తెచ్చుకోని వారికి విస్తట్లో రెండోవైపు సగం అన్నాన్ని పెడితే ఒకే విస్తరిలో ఇద్దరూ తినేవారు. వంట వండుకోని సందర్భాల్లో పిలవగానే జెవి కూడా ఇలాగే వారి విస్తరిలో తినేవారు. ఈ దృశ్యాన్ని చూసిన విద్యార్థి ఉద్యమ నాయకులనేకమంది కుల, మత, ప్రాంతీయాలకు అతీతమైన ఒక కొత్త తరం.. శ్రామిక విప్లవానికి నాయకత్వం వహించేతరం తయారవుతోందనే ఉత్తేజం పొందేవారు. ఎన్నికల ఖర్చుల్లో కూడా ఇలాంటి ఆదర్శాన్నే పాటించారు. 1977 ఎన్నికల్లో కార్యకర్తల పనితీరును ముందు భాగంలో చర్చించాం. అందువల్లనే లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల ఖర్చును రూ.35 వేలతోనే ముగించగలిగారు. 1983 శాసనసభ ఎన్నికల్లో ఎన్టీఆర్ ప్రభంజనాన్ని తట్టుకొని హోరాహోరీగా పోరాడి 17 వేలకు పైగా ఓట్లతో ప్రతిష్ఠాత్మకమైన స్థానంలో నిలిచిన సందర్భంలో కూడా ఇలాంటి పొదుపునే పాటించారు. 1960లో జెవి అవిభక్త కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గానికి ఎన్నికయ్యాక ఫైనాన్స్ విభాగం బాధ్యతలు చూశారు. అప్పుడు పూర్తికాలం కార్యకర్తలకు అప్పటి వరకూ నెలాఖరులో అలవెన్సులు ఇచ్చేవారు. ఇందువల్ల వారు అప్పుచేసి బతకడంలోని తిప్పలను గమనించారు. దాన్ని అధిగమించడానికి నెల మొదట్లోనే అలవెన్సు ఇచ్చే పద్ధతి పాటించారు. ఈ చర్య వారిలో చాలా మార్పులు తీసుకొచ్చింది.

నక్సల్స్ చీలిక పూర్తయ్యాక సిపిఎంతో మిగిలిన ఇద్దరినీ "ఏక్ బూఢా ఏక్ బచ్చా... వాళ్ళే సిపిఎంగా మిగిలారు" అంటూ హేళన చేసేవారు. నక్సలైట్లలో కెళ్ళిన ఒక సీనియర్ నాయకుడు "ఇద్దరు మిగిలారు. ఏంచేస్తారు?" అని ప్రశ్నించారు. దానికి ఏ మాత్రం తటపటాయింపు లేకుండా జక్కా వెంకయ్య ధీటుగా, ధాటిగా సమాధానం ఇచ్చారు. "పార్టీని పునర్నిర్మించి రాజకీయంగా దొంగ దెబ్బకొట్టిన వాళ్ళపై బదులు తీర్చుకుంటాను" అన్నారు. "ఈట్ కా జవాబ్ పత్థర్ సే దూంగా" (మీరు రాయితో కొడితే మేం శంకురాయితో కొడతాం) అని కూడా అన్నారు. అన్నట్టే ఆచరణలో చూపించారు. నక్సల్స్ చీలినప్పుడు జిల్లాలో 1500 మంది సభ్యులకు గాను 150 మందే సిపిఎంతో నిలిచారు. జిల్లాలో కేవలం దామరమడుగు, వంగల్లు మర్రిపాడు, పెనుబర్తితో పాటు రామాపురం గ్రామ శాఖలు సిపిఎంతో ఉన్నాయి. నెల్లూరు పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ వర్కర్స్ యూనియన్ శాఖ మాత్రమే పూర్తిగా సిపిఎంతో ఉంది. శెట్టిగుంట రోడ్డు, లారీవర్కర్స్ యూనియన్ శాఖలలోని కొందరు సభ్యులే పార్టీతో ఉన్నారు. జక్కా వెంకయ్య చనిపోయే నాటికి జిల్లాలో 289 శాఖల్లో (260 గ్రామాల్లో సభ్యులు) 2,193 మంది సభ్యులుండే పార్టీగా ఎదిగింది. ఇందులో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోనే 64 శాఖల్లో 680 మంది పార్టీ సభ్యులున్నారు. అతిచిన్న పార్టీగా మొదలై ఇప్పుడు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ అంటే సిపిఎం అనే స్థాయికి పెరగడం నుంచి జక్కా వెంకయ్య జీవితాన్ని వేరుచేసి చూడలేము.

ఇలా బహుముఖంగా.... సిద్ధాంతం-ఆచరణల్లోనూ, వాటిని వర్గపోరాటాల్లో అన్వయించడంలోనూ, శ్రామికవర్గ లక్షణాలకు అనుగుణంగా, 'డీక్లాసు' కావడంలోనూ జక్కా వెంకయ్య జీవితమే ఒక కమ్యూనిస్టు పాఠంగా ఉంది. ఆ పాఠాన్ని స్మరించడం కాదు, ఆచరించడమే ఆయనకు అర్పించగల నివాళి అవుతుంది. ఆయన వర్గ పోరాటాలతో పార్టీని విస్తరింపచేయడంలోనే కాదు మృత్యువుతో పోరాడి కూడా ఒకటిన్నర దశాబ్దంపాటు ప్రజల మధ్య పనిచేస్తూనే ఉన్నారు. ఇకనైనా విశ్రాంతి తీసుకోవచ్చు గదా అని అంటే .. "శ్రమవల్లే ఇతర జీవుల నుంచి మనిషిగా మారాడు. శ్రమ చేస్తూ ఉన్నంతకాలం ఆరోగ్యంగా ఉంటాం. దానికి దూరమైన రోజున మనిషి మనిషిగా మిగలడు" అనేవారు. ఈ కాలంలో ఆయన చిన్న కుమార్తె శారదమ్మ అందించిన సేవలను ప్రస్తావిచకుంటే ఇది అసంపూర్ణమే అవుతుంది. చివరి దశలో ఆమె 'నాయన'కు కన్నతల్లై అందించిన సేవలు ఆయన్ని మరింతకాలం బతికించాయి. ఆమె ఇంటినే జెవి పార్టీ ఆఫీసుగా మార్చి చర్చలు జరుపుతున్నా వచ్చేవారికి టీలు అందించడంతో సహా 'నాయన' గౌరవాన్ని పెంచేలా వ్యవహరించారు. అలాంటి కూతురున్నందుకు జెవి ధన్యుడనే చెప్పాలి. ❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-07-2018 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# భగవంతుడుంటే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి?



**భగత్ సింగ్**

ఈ భూమిని, ఈ ప్రపంచాన్ని సృష్టించిన ఒక సర్వశక్తివంతుడు, సర్వాంతర్యామి, భగవంతుడు వున్నాడని మీరు నమ్ముతున్నారు. అలా అయితే దానిని ఆయన ఎందుకు సృష్టించాడో చెప్పగలరా? ఈ ప్రపంచంలో ప్రజలు పేదరికంతో, రకరకాల కష్టాలతో, బాధలతో అనేక అత్యాచారాలకు గురవుతూ జీవించుతున్నారు. ఎవ్వరూ తృప్తిగా జీవించడం లేదు.

దయచేసి ఆయనకున్న శాసనాలకు లోబడి చేస్తున్నాడని అనబోకండి. ఆయనే గనుక కొన్ని శాసనాలకు కట్టుబడి వుండవలసినవాడైతే ఆయన కూడా ఒదిగిఒదిగి వుండవలసిన బానిస మాత్రమే కాగలడు. ఇలా జనాన్ని బాధపెట్టడం ఆయనకు సరదా అని అనబోకండి. నీరోచక్రవర్తి రోమ్ నగరాన్ని తగులబెట్టించాడు. నీరో పరిమిత సంఖ్యలోనే ప్రజలను హతమార్చాడు. అనేక విషాదాలను తన చిద్విలాసం కోసమే ఆయన జరిపించాడు. మరి అలాంటి నీరో చక్రవర్తి స్థానం చరిత్రలో ఏమిటి? చరిత్రకారులు ఆయనను ఏ పేరుతో పిలుస్తారు? నీరో చక్రవర్తిని ఎన్నిరకాల విషభరితమైన, అపభ్రంశమైన పేర్లను పెట్టి పిలవాలో అన్నీ పెట్టి మరీ పిలుస్తారు. నీరో చక్రవర్తి పరమ నిరంకుశుడు, హృదయం లేని పరమ క్రూరుడు అని చరిత్ర పుటలన్నింటా వర్ణించబడ్డాడు.

ఇక చెంఘిజ్‌ఖాన్ తన క్రూరమైన సంతోషం కోసం వేలమందిని హతమార్చాడు. చెంఘిజ్‌ఖాన్ పేరు చెబితేనే మనకు వళ్లు మండుతుంది. అత్యంత ద్వేషం, అసహ్యం కలుగుతుంది. అలాంటప్పుడు ప్రపంచంలోని అశేష ప్రజల జీవితాలనే దు:ఖభాజనం, చేసే దేవుణ్ణి, ప్రతిరోజూ, ప్రతి గంట, ప్రతి నిమిషం కష్టాలతో, విషాదాలతో వారి జీవితాలను అధోగతి పాల్జేసే దేవుణ్ని, ఈనాటికీ వారిని కష్ట సముద్రాల్లో నిత్యమూ ముంచుతున్న దేవుణ్ణి మనం ఏమనాలి? చెంఘిజ్‌ఖాన్, నీరోచక్రవర్తి ఎప్పుడో ఒకసారి చేసిన దానికంటే దేవుడు ఈ ప్రపంచంలోని ప్రజలను నిత్యమూ కష్టాలకు, బాధలకు అత్యాచారాలకు గురి చేస్తున్నప్పుడు ఆయనను ఎలా పూజించాలి? ఎలా కొలవాలి? మీకు నా సూటి ప్రశ్న ఇది. ఇంచుమించు నరకప్రాయంగా వున్న ఈ ప్రపంచాన్ని ఆయన ఇలా ఎందుకు సృష్టించాలి? ఎల్లప్పుడూ మానవులకు ఆవేదనలనూ, అశాంతినీ కలుగజేసే విధంగా ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాలి. దేవుడు సర్వశక్తి సమన్వితుడు కదా? ఏదైనాసరే చేయడానికి లేదా చేయకుండా వుండటానికి ఆయనకు శక్తి వుంది కదా? అటువంటప్పుడు ఇన్ని దు:ఖాలు, బాధలుపడే మానవుల్ని ఆయన ఎందుకు సృష్టించాలి? ఆయన చేసిన పనిని మనం ఎలా సమర్థించగలం?

పూర్వం ఒక రకం మృత్యు క్రీడలు జరిపి ఆనందించేవారు వుండేవారట. (గ్లాడియేటరు సంస్థ నిర్వాహకులు వారు) ఆకలితో ఆరాటపడే సింహాలు, పులుల ముందు మనుషులను నెట్టేవారు. ఆ సింహాలకు, పులులకు ఆహారమై పోకుండా ఎవరైనా ఒక అభాగ్యుడు బయటపడితే వాడికి పంచభక్ష్య పరమాన్నాలు పెడతాం. సర్వసౌఖ్యాలు, సంపదలు ఇచ్చి సత్కరిస్తాం అనేవారట. సరిగ్గా అలాగే ఉంది దేవుడి సంగతి. సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వచైతన్యమూర్తి అయిన భగవంతుడు ఈ దు:ఖమయ ప్రపంచాన్ని, అందులో అష్టకష్టాలు పడే మానవుడ్ని ఎందుకు సృష్టించాలి అని నేను అడుగుతున్నాను. ఇదంతా ఆయన ఆనందానికే అయితే, నీరోచక్రవర్తికి, భగవంతుడికి ఏమిటీ తేడా?

చెరసాలలో మగ్గేవాళ్లు, ఆకలి మంటలతో అలమటించేవాళ్లు లక్షలాది కోట్లాది ప్రజలు ఈ ప్రపంచంలో వున్నారు. దోపిడీ చేయబడుతున్న కష్టజీవులు, కార్మికులు, అభాగ్యుఢ, దీనులు, హీనులు వున్నారు. వీరంతా తమ రక్తాన్ని స్వేదంగా మారుస్తున్నారు. ఈ రక్తాన్ని పిండి పెట్టుబడిదారీ వర్గాలు రాబందులవలె, జలగలవలె వీరిని పీలుస్తూ సంపన్నులవుతున్నారు. లక్షలాదిమందిని నిరుద్యోగులుగా, నిరర్థకులుగా చేస్తున్నారు. అంతేకాదు, అవసరమైతే తమ లాభాల రక్షణ కోసం, అధికోత్పత్తి చేసి నిల్వపడి వున్న సరుకులను, ఆహారధాన్యాలను సముద్రం పాలు చేస్తున్నారు. (పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభం ఏర్పడినప్పుడు, ధరల మాంద్యం వచ్చినప్పుడు లక్షల కోట్ల టన్నుల పాల డబ్బాలను ఇతర ఆహార పదార్థాలను పెట్టుబడిదారీ వర్గాలు సముద్రం పాటు చేస్తాయి. అనువాదకుడు) ఆకలితో మలమలమాడే కోటాను కోట్ల ప్రజలకు ఈ ఆహార ధాన్యాలను, పాలడబ్బాలను, బట్టలను తదితర జీవితావసర వస్తువులను పంచిపెట్టరు. తమ చెమటను, రక్తాన్ని ధారపోసి శ్రామిక ప్రజలు పంటలు పండిస్తారు. తమ ఎముకలను సున్నంగా చేసి మహాభవనాలను కార్మికులు నిర్మిస్తారు.

వారందరూ దారిద్ర్యంతో కడుపునిండా తిండిలేక, బట్టలేక, ఇల్లులేక ఎందుకు అలమటించాలి? దీనికి భగవంతుడు ఏమి సమాధానం చెపుతాడు? ఇలా ఎందుకు జరుగుతున్నది? ఇలా ఒకవైపున జరుగుతూ వుంటే నా సృష్టి అంతా సవ్యంగా వున్నదని భగవంతుడు ఎలా అనగలడు? దీనికి ఆయన ఏమైనా సమాధానం చెప్పగలడా? మౌనమే సమాధానమా?

*('నేనెందుకు నాస్తికుడినయ్యాను' అన్న భగత్‌సింగ్ పుస్తకం నుంచి ఈ అంశాలు గ్రహించబడ్డాయి)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.13, No.3. Published on July 1, 2018